
మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సిఎం సహాయ నిధికి విరాళాలు

రెండు రోజులు భారీ వర్షాలు

కిన్నెరసాని వాగులోపడి ఇద్దరు మృతి

లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 275 | బుధవారం | 04-09-09-2024 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

‘తెలంగాణ విద్యా కమిషన్’ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో నూతన విద్యావిధానాన్ని రూపొందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ‘తెలంగాణ విద్య కమిషన్’ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మంగళవారం జిఒ నంబర్ 27 ను విడుదల చేశారు. ప్రీ ప్రైమరీ నుంచి యూనివర్సిటీ విద్య వరకు పలు అంశాలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ విద్యా కమిషన్ సిఫారసులు చేస్తుంది. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు నేటీ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా విద్యార్థులను తరువాయి 2లో

ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలు

మున్సిపాలిటీల్లో విలీనం

ఆర్డినెన్స్ తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు గ్రామాలను ఆయా మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఒక్కో మున్సిపాలిటీలో ఒకటి నుంచి ఆరు వరకు గ్రామాలను విలీనం చేసింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని తరువాయి 2లో

బుల్‌డోజర్ విధానంపై సుప్రీంకోర్టు

మార్గదర్శకాలపై సిపిఐ హర్షం



న్యూఢిల్లీ : వివిధ రాష్ట్రాలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న బుల్‌డోజర్ విధానంపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేయడంపట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హర్షం వ్యక్తం చేసింది. పార్టీ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారంనాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రాలలో ఒక నేరానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై వ్యక్తుల ఆస్తులను అధికార యంత్రాంగం ఇష్టానుసారంగా కూల్చివేసి ధ్వంసం చేయడాన్ని వెంటనే ఆపాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేయడం ఎంతో హర్షణీయమని పేర్కొంది. నేర నిర్ధారణ జరిగితే, దోషి అని తేలితే శిక్షించే అర్హత, అధికారం న్యాయస్థానానికి మాత్రమే తరువాయి 2లో

ధర్నాలు

18కి వాయిదా

ప్రజాపక్షం /హైదరాబాద్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర కమిటి పిలుపుమేరకు ఈ నెల 5న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తలపెట్టిన ధర్నాలను భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్‌లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమాలను తిరిగి ఈనెల18న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా లు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ గండ్లు తక్షణమే పూడ్చివేయాలి 03

జిల్లాల్లోనూ హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటుకు కలెక్టర్లకే పూర్తి అధికారం

ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ఆక్రమణల వల్లే.. విపత్తులు

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని చెరువుల ఆక్రమణలపై చాలా ఆరోపణలు వస్తున్నాయని, వాటన్నింటిపై చర్యలకు తీసుకునేందుకు ఆయా జిల్లాలలో హైడ్రా తరహా వ్యవస్థ తీసుకురానున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్‌లో వరద నష్టంపై మంగళవారం జరిగిన సమీక్షలో సిఎం మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో వరద ఉధృతికి ఆక్రమణలే కారణమని, ఈ క్రమంలో ఆక్రమణల నివారణకు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు ప్రత్యేకంగా పూర్తి అధికారం ఇస్తున్నట్లు సిఎం రేవంత్ తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ శాఖలతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను తరువాయి 2లో

ఇల్లు కూలినవారికి ఇందిరమ్మ ఇల్లు

ముందస్తు చర్యలతో నష్టనివారణ

అధికారులు, మంత్రుల సహాయక చర్యలు భేష్

వరదప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు సిఎం పరామర్శ

ప్రజాపక్షం/మహబూబాబాద్

రాష్ట్రంలో అకాల వర్షాలు కబలించిన ప్రాణ నష్టం,ఆస్థి నష్టం తనను కలిచివేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేధన వ్యక్తం చేశారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని సిఎం మంత్రులతో కలిసి పరిశీలించారు. తొలుత ఖమ్మం జిల్లాలోని గేట్ కారెపల్లి సమీపంలోని గంగారం గ్రామంలో నూనావత్ అశ్విని సోదరుడు, తల్లిని సిఎం రేవంత్‌రెడ్డి పరామర్శించి, అశ్విని, మోతీలాల్ మరణాలకు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో తక్షణమే ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఖమ్మం కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లాలోని మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం వద్ద పూర్తిగా వరద భీభత్సంతో డ్యామేజీ అయిన బ్రిడ్జి పరిస్థితిని అధికారులు, మంత్రులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి సీతారాంతండాకు వెళ్లిన సిఎం తండాకు ఏ విధంగా ముంపుకు గురైందో తెలుసుకున్నారు. మూడు తండాలు వరద తాకిడితో ఇబ్బందుల నేపథ్యంలో వాటినింటి ఒక్కచోటకు చేర్చి వారిందరికీ ఇందిర పథకం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను ఆదేశించారు. అటు తర్వాత మహబూబాబాద్ ఐడీఓసీకి చేరుకున్న సిఎం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ... ముందస్తు చర్యలతోనే నష్ట నివారణ సాధ్యమైందన్నారు. అధికారులు, మంత్రులతో ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందాయన్నారు. వరద భీభత్సంతో ప్రాణ, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్థులకు నష్టం వాటిల్లిందన్నారు. ఖమ్మం మహబూబాబాద్‌లో అధికారులు, మంత్రుల సహాయక తరువాయి 2లో

వ్యవసాయం కుదేలు

లక్షల ఎకరాల్లో నీట మునిగిన పంటలు

వరి, పత్తికి అపార నష్టం

అప్పు చేసి పంట సాగు

కేంద్రం సహాయం చేయకపోతే భారమంతా రాష్ట్ర ప్రభుత్వం పైనే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గత 5 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసింది. ఆరుగాలం కష్టపడి పంటలు వేసిన రైతులను నట్టేరులో ముంచింది. ఇప్పటికే ప్రభుత్వం నుంచి అందాల్సిన రైతు భరోసా ఆలస్యమవ్వగా, అప్పు, సప్పు చేసి రైతులు పంటలు వేసుకోగా, వారికష్టం కాస్తా నీటి పాలైంది. రూ.2 లక్షల వరకు ఉన్న రైతురుణాలను ప్రభుత్వం ఏక కాలంలో మాఫీ చేయడంతో కాస్తా ఊరట చెందిన రైతులను, వర్షుడు తిరిగి కష్టాల్లోకి నెట్టారు. దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో దాదాపుగా 1,29,32,310 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 1,09,57,557 ఎకరాల్లో (84.73 శాతం) వివిధ పంటలను రైతులు సాగు చేశారు. భారీ వర్షాల కారణంగా లక్షల ఎకరాల పంట నీటి పాలు కావడంతో రాష్ట్ర రైతాంగం బిక్కు బిక్కుమంటోంది. భారీ వర్షాలకు 18 లక్షల ఎకరాల మేర వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. అయితే ఇప్పటి వరకు 7 లక్షల నుంచి 8 లక్షల ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా. పంట భీమా పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకురాక పోవడంతో నష్ట పోయిన పంటకు పరిహారం అందే పరిస్థితి లేదు. గతంలో సైతం భారీ వర్షాలకు పంట నష్టపోగా, కేంద్రం పైసా కూడా సహాయం అందించలేదు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా వారి నుంచి ఇప్పటి వరకు పెద్దగా స్పందన లేదు. ఈ సారి కూడా కేంద్రం నుంచి సహాయం అందక పోతే మాత్రం ఈ భారమంతా రాష్ట్ర ప్రభుత్వం పైనే పడే అవకాశం ఉంది. దీంతో పంట నష్టపోయిన రైతులను తరువాయి 2లో

లారీ, బస్సు ఢీ : ముగ్గురు మృతి

ప్రజాపక్షం/పాలకుర్తి

జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల వద్ద బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం పాలకుర్తి నుండి తొర్రూరుకు వెళ్తున్న ఆర్టీసి బస్సు, తొర్రూరు నుండి పాలకుర్తికి వస్తున్న లారీ వావిలాల సమీపంలో బస్సును ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందినట్లు తెలిపారు. వెలికట్ట గ్రామ శివారు టికె తండాకు చెందిన భార్యభర్తలు జాటోతు హేమాని, బుజ్జమ్మ, మండల కేంద్రానికి చెందిన ఎండి నసీమాలు మృతిచెందినట్లు తెలిపారు. హేమాని, బుజ్జమ్మ దంపతులు హైదరాబాద్‌లోని కొడుకు ఇంటికి వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదంలో తరువాయి 2లో

‘కిన్నెరసాని’ అధికారుల నిర్లక్ష్యం

వందలాది ఎకరాల్లో పంటనష్టం

అనేక ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు

ప్రతీ కుటుంబాన్ని, రైతులనూ ఆదుకుంటాం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ముంపు బాధితులకు పరామర్శ

ప్రజాపక్షం/భద్రాచలం

కిన్నెరసాని అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయకుండా నిర్లక్ష్యం వహించడంతోనే వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయని, తరువాయి 12లో

‘గాంధీ’లో వారంలోగా ఐవిఎఫ్ కేంద్రం

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేది పేదలే : మంత్రి దామోదర రాజనర్సింహ్మా

ప్రజాపక్షం/హైదరాబాద్

గాంధీ, ఉస్మానియా లాంటి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే దళిత, గిరిజన, అట్టడుగు పేద వర్గాలను చూసుకోవడం తన బాధ్యత అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా అన్నారు. దొరలు కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం పొందుతారని, పేదలకు కష్టం వస్తే ప్రభుత్వ దవాఖానాలకు వస్తారని తెలిపారు. వారం రోజుల్లోనే గాంధీలో ఐవిఎఫ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు దొరల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాదులోని గాంధీ, కింగ్‌కోటి ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి దామోదర రాజనర్సింహ్మా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీ ఆస్పత్రి ఒపి బ్లాక్‌లో పర్యటించి, జ్వరం బాధితులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో వివిధ విభాగాలలో చికిత్స పొందుతున్న రోగులతో మంత్రి మాట్లాడి, వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి లో చికిత్స పొందుతున్న సీజనల్ ఫీవర్ బాధితుల వివరాలను గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిని అడిగి తెలుసుకున్నారు.కారిడార్లలో రోగుల సహాయకులు కింద కూర్చోవడం పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల సహాయకులు కూర్చోవడానికి సీట్లను ఏర్పాటు చేయలని ఆదేశించారు.రోగుల కోసం వచ్చిన సహాయకులకు మెరుగైన సదుపాయాలను కల్పించాలని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను మంత్రి ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆస్ప త్రిలోని పడకలు, ఒపి పేషంట్ల వివరాలు లెక్కలపై తరువాయి 2లో

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

9 మంది మావోయిస్టులు హతం

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతి చెందారు. దీనిని రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ధృవీకరించారు. దంతెవాడ, బీజాపూర్ జిల్లాలోని సరిహద్దు అటవీ ప్రాంతంలో డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు ఒక్క సారిగా పోలీసులపై ఎదురు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో ఆత్మరక్షణలో భాగంగా కాల్పులకు దిగారు. ఈ ఎదురు కాల్పుల్లో మొత్తం 9 మంది మావోయిస్టులు మృతి చెందగా ,మరి కొందరికి గాయాలు అయ్యాయని, గాయాలపాలైన వారు అడవుల్లోకి పారిపోయారని బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజన్ స్పష్టం చేశారు.దక్షిణ బస్తర్‌లో మావోయిస్టులు తలదాచుకున్నారనే తరువాయి 12లో

పరిశోధనలను ప్రోత్సహించాలి

సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవ సభలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పిలుపు

పుణె : విద్యారంగంలో పరిశోధనలను మరింత ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. భారతదేశంలోని రీసెర్చ్‌స్కాలర్లు దేశం ఎదుర్కొనే సమస్యలకు మాత్రమే కాకుండా యావత్ ప్రపంచ సమస్యలకు కూడా పరిష్కారం కనుగొనగలిగే సత్తా ఉన్నవారని ప్రశంసించారు. మంగళవారం నాడు పుణెలోని సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (డీమ్డ్) 21వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి) పరిశోధనకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఒక పెద్ద బంగళా, కారు కొనేందుకు డబ్బుపరమైన ఆలోచనలను సాకారం చేయడం కోసం కాకుండా పరిశోధనా సామర్థ్యాలను పెంచుకునే దిశగా కృషిచేయాలని విద్యార్థులను కోరారు. ‘నేటి యువతరం ఈ దేశ అభివృద్ధికి అకుంఠిత దీక్షతో పనిచేస్తుందనే నమ్మకం నాకున్నది. ఈ దేశ ప్రజలు ఎంతో తెలివితేటలు, నైపుణ్యాలు కలిగినవారు. సమాజం అవసరాలను మీరు అవగాహన చేసుకోవాలని నేను కోరుకుంటున్నాను. అందుకు మీ జ్ఞానాన్ని ఉపయోగించండి. చిన్నచూపుకు గురవుతోన్న అట్టడుగు వర్గాల అభివృద్ధికి, వారు అన్నింటినీ తట్టుకుని ముందడుగు వేసేలా మనం వారికి పరిష్కారాలు చూపించగలగాలి’ తరువాయి 12లో

అత్యాచారం చేస్తే పెరోల్ లేకుండా

జీవితాంతం జైలులోనే!

‘అపరాజిత’ బిల్లుకు పశ్చిమబెంగాల్ ఆమోదం



కోల్‌కతా : అత్యాచార దోషులకు జీవితఖైదు విధించే అత్యాచార వ్యతిరేక బిల్లుకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అపరాజిత ఉమెన్ అండ్ చైల్డ్ బిల్లు 2024 పేరుతో తీసుకొచ్చిన బిల్లును ఆ రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మోలాయ్ గాటక్ మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరించి అత్యాచారం, లైంగిక నేరాలకు సంబంధించిన కొత్త నిబంధనలను ప్రవేశపెట్టి, మహిళలు, పిల్లల రక్షణను మెరుగుపరచడమే లక్ష్యంగా బంగాల్ ప్రభుత్వం బిల్లును తీసుకొచ్చింది. పెరోల్ లేకుండా దోషులకు జీవితకాల కారాగార శిక్ష విధించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. అపరాజిత ఉమెన్ అండ్ చైల్డ్ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడారు. ఈ బిల్లు చారిత్రకమని వ్యాఖ్యానించారు. ‘ఈ రోజు మేం ప్రవేశపెట్టిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని విపక్షాలు అడగాలి. ఆ తర్వాత దానిని అమలు చేసే బాధ్యత మాది. ఈ బిల్లు ద్వారా కేంద్ర చట్టంలోని లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సత్వర విచారణ, బాధితులకు న్యాయం అందించడం ఈ బిల్లు లక్ష్యం. ఒకసారి ఈ బిల్లు పాస్ అయితే ప్రత్యేక తరువాయి 12లో

కాంగో జైలులో తొక్కిసలాట

129 మంది మృతి

02

కాంగో జైలులో తొక్కిసలాట

129 మంది మృతి.. పరారీకి ఖైదీల ప్రయత్నం..

కిన్‌షాద (కాంగో): కాంగో రాజధాని కిన్‌షాదాలోని ఓ జైలులో జరిగిన తొక్కిసలాట ఏకంగా 129 మంది ప్రాణాలను హరించింది. పలువురు తీవంగా గాయపడ్డారు. జైలు నుంచి తప్పించుకోవడానికి ఖైదీలు ప్రయత్నించడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని అధికారులు అంటున్నారు. దేశాధ్యక్షుడి భవనానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మకాలా సెంట్రల్ జైలులో సోమవారం తెల్లవారు జామున ఒక్కసారిగా అలజడి రేగిందని, పలువురు ఖైదీలు పారిపోయేందుకు జరిపిన ప్రయత్నంలో తొక్కిసలాట చోటు చేసుకుందని కాంటలీస్ ఆంతరంగిక వ్యవహారాల శాఖ మంత్రి జాక్వెమిన్ షాబానీ ప్రకటించారు. నిజానికి ఆ జైలులో గరిష్టంగా 1,500 మంది ఖైదీలను ఉంచవచ్చు. కానీ, వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నవారితోసహా సుమారు 12,000 మందిని అధికారులో జైల్లో ఉంచారు. వీరిలో ఎక్కువ మంది కేసు ఇంకా విచారణకు కూడా రాలేదు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా పలు మానవ హక్కుల సంఘాలు కాంగోలో జైళ్ల పరిస్థితిపై పలు సందర్భాల్లో ఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నదని విమర్శించాయి. జైళ్ల నుంచి పారిపోవడానికి ఖైదీలు ప్రయత్నించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాల్లో ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఈ స్థాయిలో తొక్కిసలాట చోటు చేసుకొని వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం మాత్రం అరుదు. తాజా ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఇంకా ఎలాంటి నిరాాఇరణకు రాలేదు. అయితే, ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జైలులోని ఒక వార్డులో కాల్పుల మోత వినిపించిందని ఖైదీలు అంటున్నారు. కొద్ది మంది ఖైదీల మధ్య ఘర్షణ చెలరేగి, ఆ క్రమంలోనే పారిపోయే ప్రయత్నం జరిగిందని కొందరు అనుమానిస్తుండగా, పరారయ్యేందుకు వ్యూహాత్మకంగా ప్రణాళికను సిద్ధం చేసుకున్నారని కొంత మంది వాదిస్తున్నారు. వాస్తవాలు వెలికిరాకపోయినప్పటికీ, జైలులో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం, అర్ధాకలితో రోజులు



గడపడం వంటి పరిస్థితులపై ఖదీలు ఆగ్రహంతో ఉండడం వంటి అంశాలు ఖైదీల పరీరాయత్నానికి కారణమై ఉండవచ్చన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. ఇలావుంటే, జైలులో తొక్కిసలాట ఘటనపై కాంగో ప్రభుత్వం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పరిస్థితి అదుపులోనే ఉందని ప్రకటించింది. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేసింది.

ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారంపై చర్చ లు జరిపేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం బ్రూనై చేరుకున్నారు. బందార్ సెరీ బెగావన్‌లో ఆయనకు పట్టాభిషక్తు డైన బ్రూనై యువరాజు అల్ ముహ్తదీ బిల్లా స్వాగతం పలి కారు. ఈ పర్యటనలో భాగంగా బ్రూనై రాజు సుల్తా న్ హాజి హసనల్ బొల్కియాతో సమావేశమవుతారు.

ఉత్తర కొరియా అప్రమత్తం!

డ్రోన్ క్షిపణులను పరిశీలించిన కిమ్

ప్యాంజియాంగ్(ఉత్తర కొరియా): అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలు చేపట్టిన నేపథ్యంలో ఉత్తర కొరియా అప్రమత్తమైనట్టు కనిపిస్తున్నది. నిర్దేశిత లక్ష్యాలను సమర్థవంతంగా ఛేదించగల సత్తావున్న డ్రోన్ క్షిపణుల పనితీరును ఉత్తర కొరియా అధినేత కిమ్ చాంగ్ ఉన్ స్వయంగా పరిశీలించారు. ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కెసిఎన్ఎ) సోమవారం విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, డ్రోన్ క్షిపణుల ప్రయోగాన్ని శనివారం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కిమ్ స్వయంగా హాజరయ్యారు. ప్రత్యేంకగా అమెరికా లేదా దక్షిణ కొరియా పేర్లను ప్రస్తావించకపోయినప్పటికీ, వివిధ దేశాల సంయుక్త సైనిక విన్యాసాల నేపథ్యంలోనే ఈ ప్రయోగాలు జరిపినట్టు ఉత్తర కొరియా అధికారులు అంటున్నారు. నీటి లోపల కూడా ప్రయోగించగల డ్రోన్లను సిద్ధం చేసినట్టు కెసిఎన్ఎ తన ప్రకటనలో పేర్కొంది. అంతేగాక, మూడు రోజుల వ్యవధిలో సుమారు 60 నీటి విమానాలను ప్రయోగాత్మకంగా నడిపించి చూసినట్టు వివరించిది.

చైనాలో స్కూల్‌బస్సు స్వైర విహారం

11 మంది దుర్మరణం
13 మందికి గాయాలు

బీజింగ్: తూర్పు చైనాలోని షాన్డాంగ్ ప్రావిన్స్‌లోని మిడిల్ స్కూల్ గేట్ వద్ద విద్యార్థులపైకి బస్సు దూసుకెళ్లడంతో కనీసం 11 మంది మరణించారు. 13 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్‌షువా వార్తాకథనం ప్రకారం, తైయాన్ నగరంలో మంగళవారం ఉదయం సుమారు 7.30 గంటల ప్రాంతంలో విద్యార్థులను తీసుకెళుతున్న ఓ అద్దె బస్సు నియంత్రణ కోల్పోయి, పాదచారులపైకి దూసుకెళ్లింది. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని, ప్రమాదానికిగల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక పిల్లలపై ఉద్దేశ్యపూర్వకంగా దాడి చేశారా అనేది స్పష్టంగా తెలియరాలేదు. కిండర్ గార్టెన్ పాఠశాలలపై కొంతమంది అసంతృప్తివాదులు దాడులు చేస్తున్న ఘటనలు ఇటీవల కాలంలో పెరగడంతో, తాజా ప్రమాదంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది మార్చి మాసంలో, షాన్డాంగ్ ప్రావీన్స్‌లోని డెజౌ నగరలో ఒక వ్యక్తి స్థానిక జూనియన్ పాఠశాల వెలుపల గుంపుపైకి కారును నడిపించడంతో, ఇద్దరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. జూన్ మాసంలో జియాంగ్సు ప్రావీన్స్‌లో స్కూల్ బస్సుపై ఒక వ్యక్తి దాడి చేయగా, ఒకరు చనిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తరచు పాఠశాల విద్యార్థులను లక్షంగా చేసుకొని దాడులు జరుగుతున్నందున, తాజా ఘటనను కూడా అనుమానించాల్సి వస్తున్నది.

రష్యా దాడుల్లో 41మంది మృతి?

కీవ్:ఉక్రేన్ మధ్యతూర్పు ప్రాంతంలోని విద్యా కేంద్రం,సమీపంలోని ఆసుపత్రిపై రెండు రష్యన్ బాలిస్టిక్ క్షిపణులు దాడి చేశాయి. ఈ ఘటనలో కనీసం 41 మంది మరణించారు. 180మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని ఉక్రేన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ మంగళవారం ప్రకటించారు. రష్యా సరిహద్దు నుంచి 110 కిలోమీటర్లు (70 మైళ్ళు), కీవ్‌కు ఆగ్నేయంగా 350 కిలోమీటర్లు (200 మైళ్ళు) దూరంలో పోల్టావా నగరంపై రష్యా దాడులు జరిపినట్టు ఆయన అన్నారు. 2022 ఫిబ్రవరి 24న ప్రారంభమైన యుద్ధంలో ఇంత వరకూ ఈ స్థాయిలో దాడులు జరగదలేదని ఉక్రేన్ వర్గాలు అంటున్నాయి. రష్యా భారీ విధ్వంసానికి పాల్పడుతున్నదని పేర్కొన్నాయి. వైమానిక దాడి హెచ్చరిక వినిపించిన కొద్ది సేపటికే క్షిపణులు పడడంతో, మృతుల సంఖ్య పెరిగిందని అధికారులు అంటున్నారు. జెలెన్స్కీ కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతీకార దాడులు జరుపుతామన్నారు. పోల్టావాకు సహాయక బృందాలను పంపినట్టు ఆయన చెప్పారు. ఇలావుంటే, ఉక్రేన్ ఇటీవల డ్రోణులతో విరుచుపడి, విధ్వంసం సృష్టించిన తర్వాత, రష్యా దాడులను ముమ్మరం చేసింది. ఉక్రేన్‌తో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నట్టు కనిపిస్తున్నది.

ఉలాన్‌బతార్(మంగోలియా)చేరుకున్న రష్యా అధ్య క్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఘనస్వాగతం పలుకుతున్న ఆదేశ అధ్యక్షుడు ఖురెల్సుక్ ఉఖాన్. ఉక్రేన్‌పై ఏకపక్ష యుద్ధానికి దిగినట్టు ఆరోపిస్తూ, పుతిన్ అరెస్టుకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) 18నెలల క్రితం వారెంట్ జారీ చేసిన నేప థ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈవారెంటు జారీ అయిన తర్వాత, ఐసిసి సభ్య దేశాల్లో పుతిన్ పర్యటించడం ఇదే మొదటిసారి. రోమ్‌ఒప్పందాన్ని అనుసరించి, ఒకసారి వారెంటు జారీ అయితే, సదరు వ్యక్తిని ఐసిసి సభ్యదేశాలు విడిచిపెట్టడానికి వీల్లేదు. మంగోలియా కూడా ఐసిసి సభ్య దేశం కావడంతో, ఈ నిబంధనను అనుసరించి పుతిన్‌ను ఆదేశం అదుపులోకి తీసుకోవాలి. కానీ, సరిహద్దున ఉన్న అతి పెద్ద దేశమైన రష్యాపై మంగోలియా ఎన్నో రకాలుగా ఆధారపడింది. ముఖ్యంగా చమురు, విద్యుత్ కోసం రష్యాను ఆశ్ర యించక తప్పని పరిస్థితి. అందుకే, పుతిన్‌ను మంగోలియా అరెస్టు చేసే అవకాశమే లేదు. అందుకే, ఆయన ఎలాంటి వెరపు లేకుండా పర్యటనకు వచ్చారు. రెండు దేశాల మధ్య మైత్రీ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే తన పర్యటన లక్ష్యమని ఆయన ప్రకటించారు.

ఆక్రమణల వల్లే విపత్తులు

(మొదటి పేజీ తరువాయి)

తయారీ చేసి ఆక్రమణ దారులపై చర్యలకు సిద్ధం కావాలన్నారు. హైదరాబాద్‌లో హైడ్రాలాగానే రాష్ట్రమంతటా కావాలని ప్రజల నుండి డిమాండ్స్ వస్తున్నాయన్నారు. ఆక్రమణదారులతో ప్రకృతి వైపరిత్యాలు సంబవిస్తున్నాయని, ప్రకృతిపై దాడి చేస్తే మానుకోటలో వచ్చిన వర్ష భీభత్సంలాగానే వికృతాలు ఉంటాయని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాలలో ఎఫ్‌టీఎల్, భఫర్‌జోన్‌లను గుర్తించాలన్నారు. ప్రతి జిల్లాలో హైదరాబాద్ హైడ్రాగానే కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు. చెరువుల ఆక్రమణలో ఎంతటి వారైన వదిలేదని స్పష్టం చేశారు. ఆక్రమణలపై ప్రభుత్వం వెనక్కిది లేదని ఖరాఖండీగా చెప్పారు. నాలాలు, కాలువలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాల్వలు ఆక్రమించి నిర్మాణాలు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు నివేధిక తయారు చేయాలని సూచించారు. నివేధిక వచ్చిన తర్వాత సంబంధిత వ్యక్తులపై కొరఢా ఝులిపించాల్సిందేనని అధికారులకు వివరించారు. చెరువుల ఆక్రమణలకు సంబంధించి కోర్టుల్లో కేసులుంటే ప్రభుత్వమే ప్రత్యేక న్యాయవాదులను పెట్టి కేసుల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటికి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. చెరువుల ఆక్రమణదారులతో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పేదోళ్ల ప్రాణాల మీదకు తెస్తున్నాయని ఆందోళన చెందారు. చెరువులను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తే వాటిని వెంటనే తొలగించాల్సిందేననని అధికారులను ఆదేశించారు.

వారంలో ఐవిఎఫ్ కేంద్రం (మొదటిపేజీ తరువాయి)

ఆరాతీశారు. సమావేశానంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే ప్రజల ఆసుపత్రులన్నారు. తాను గాంధీలో ఆస్పత్రిలో పుట్టానని వివరించారు.ఎక్కువ కాలం ఒకేచోట తిష్ట వేసిన డాక్టర్లను బదిలీ చేశామన్నారు. ఆసుపత్రుల్లో వైద్యుల కొరత లేదని, అవసరమైన చోట్ల కాంట్రాక్ట్ పద్ధతుల్లోను వైద్యులను తీసుకుంటున్నామని తెలిపారు.14లోపు వైద్య విద్యార్థుల భద్రత పై కేంద్రం అడిగిన వివరాలను పంపుతామన్నారు. డాక్టర్ల కోసం గాంధీలో హాస్టల్ భవనానికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే రూ 79 కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలపై సిపిఐ హర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందనీ, ఈ విషయంలో చట్టపరమైన నిబంధనలను, సంబంధిత ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందనీ పార్టీ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాల్సిన విధి ప్రభుత్వాలపై ఉందని పేర్కొంది. ఏ విధమైన న్యాయపరమైన ప్రక్రియను, న్యాయ చట్టాలను అనుసరించకుండా ప్రభుత్వాలు నేరారోపణలపై శిక్షలు విధించకూడదని పేర్కొంది. చట్టం, న్యాయం ప్రకారం సంబంధిత ప్రక్రియను అనుసరించాల్సిన అవసరం ఉందని, ఈ ప్రక్రియను ప్రభుత్వాలు గౌరవించాలని పార్టీ ఆ ప్రకటనలో పేర్కొంది. బిజెపి ప్రభుత్వాలు ప్రత్యేకించి ముస్లిం మైనారిటీ వర్గాలను ఈ బుల్‌డోజర్ల సంస్కృతితో భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని దీనిని తక్షణం అడ్డుకోవాలని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు అనుసరిస్తాయని తాము ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని, ఈ విషయంపై న్యాయస్థానంలో పోరాటం చేసిన పిటిషనర్లలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు (భారత జాతీయ మహిళా సమాఖ్య) కూడా ఉందని సిపిఐ పేర్కొంది.

మున్సిపాలిటీల్లో విలీనం (మొదటి పేజీ తరువాయి)

పలు గ్రామాలు ఈ విలీన జాబితాలో ఉన్నాయి. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో నాలుగు గ్రామాలు, శంషాబాద్‌లో ఆరు, నార్సింగి, తుక్కుగూడలలో ఒక్కో పంచాయతీ, మేడ్చల్‌లో రెండు, దమ్మాయిగూడలో ఆరు, నాగారంలో నాలుగు, పోచారంలో ఐదు, ఘట్‌కేసర్‌లో ఆరు, గుండ్లపోచంపల్లిలో రెండు, తూంకుంట మున్సిపాలిటీలో మూడు పంచాయతీలను విలీనం చేస్తూ ఆర్డినెన్స్‌జారీ చేసింది.పెద్ద అంబర్‌పేటమున్సిపాలిటీలో బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తారామతి పేట పంచాయతీలు. * శంషాబాద్ మున్సిపాలిటీలో బహదూర్‌గూడ, పెద్ద గోల్కోండ, చిన్న గోల్కోండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ. * నార్సింగి మున్సిపాలిటీలో మీర్జాగూడ గ్రామపంచాయతీ.*తక్కుగూడమున్సిపాలిటీలో హర్షగూడ గ్రామపంచాయతీ. * మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు,రాయిలాపూర్. * దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి. *నాగారంమున్సిపాలిటీలో బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి, దాయర. *పోచారం మున్సిపాలిటీలో వెంకటాపూర్, ప్రతాపసింగారం, కాచవానిసింగారం, కొర్రెముల, చౌదరిగౌడ. *ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ. * గుండ్లపోచంపల్లిలో మునీరాబాద్, గౌడవెల్లి. * తూంకుంట మున్సిపాలిటీలోబొంరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం చేసింది.

లారీ బస్సు ఢీ –ముగ్గురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

మృతిచెందారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఈ సరస్వతి, భూలక్ష్మి, టి నాగమ్మ, జే బాలోజిని గాయపడడంతో వారిని పాలకుర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘటన స్థలాన్ని జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, తహశీల్దార్ శ్రీనివాస్ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని క్షతగాత్రులను పరామర్శించి గాయపడిన వారందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. వారి వెంట సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇల్లు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు భేష్ అని అభినందించారు. సీతక్క మంచి సేవలు అందించారని ప్రత్యేకంగా అభినందించారు. వరద భీభత్సం దాటికి జిల్లాలో ముగ్గురు మృతి..చెరువులు, రోడ్లు డ్యామేజ్ అయ్యాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 45 ఇళ్లు పూర్తిగా, 96 ఇళ్లు పాక్షికంగా ధ్వంసం అయినట్లు వివరించారు. సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలను కలిపి ఒక్కచోటే ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి బాధితులకు అప్పగించాలన్నారు. అశ్విని, మోతీలాల్ మృతి హృదయ విధారకంగా మారిందని, వీరి మరణం రాష్ట్ర ప్రజలకు సైతం కదిలించిందన్నారు. వారికి తక్షణమే ఇందిరమ్మ ఇల్లును మంజూరీ చేశామన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు నష్టపరిహారం కింద రూ..5 లక్షల పరిహారం చెల్లించేలా అధికారులకు ఆదేశించారు. ప్రతి ఎకరాకు తక్షణ సాయం కింద ఎకరాకు రూ.10 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. వరద తాకిడికి మృతి చెందిన పశువులకు 50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.5వేలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. తెలంగాణ వర్ష భీభత్సం జాతీయ విపత్తు కింద పరిగణించాలని ప్రధానికి లేఖ రాసినట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5438 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ తక్షణ సాయం 2 వేల కోట్లు అందించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. జిల్లాలో జరిగిన నష్టంపై నివేధిక అందించాలన్నారు. జిల్లాలో 45 ఇళ్లు పూర్తిగా, 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్ల నష్టం వాటిల్లిందని, త్వరలోనే మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అధికారుల ముందస్తు చర్యలతోనే నష్ట నిరవారణ జరిగిందన్నారు. అలాగే అధికారుల,మంత్రుల సహాయక చర్యలు భేష్ అని, తక్షణమే పునరుద్దరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.

కెసిఆర్ ఏనాడైనా బాధితులను పరామర్శించారా..?

పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ ఏనాడైనా వరద, ప్రమాద బాధితులను పరామర్శించారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వరద బాధితుల వద్దకు ఏనాడూ కెసిఆర్ వెళ్లలేదని, సొంత నియోజవకర్గం మాసాయిపేటలో రైలు ప్రమాదంతో చిన్నారులు చనిపోయినా, హైదరాబాద్ ఒఆర్ఆర్‌లో పశు వైద్యురాలు అత్యాచారానికి, హత్యకు గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యులను కెసిఆర్ పరామర్శించలేదని ముఖ్యమంత్రి మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నేతలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని కెసిఆర్ ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అమెరికాలో ఎంజాయ్ చేస్తున్న కెటిఆర్ క్షేత్రంలో ఉండి సహాయక చర్యలు చేపడుతున్న మంత్రులపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో దోచుకున్న రూ.లక్ష కోట్ల నిధుల్లో రూ.వెయ్యి కోట్లో... రూ. రెండు వేల కోట్లో సిఎం రిలీఫ్ ఫండ్‌కు ఇవ్వాలని కెసిఆర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సూచించారు.

సిఎంఆర్ఎఫ్‌కు విరాళాలు...

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు గానూ ముఖ్యమంత్రి ఉపశమన నిధి (సిఎంఆర్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఒక రోజు మూల వేతనం రూ.135 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేశారు. వారికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

మానవీయ కోణంలో స్పందించాలి

తెలంగాణ, తెలంగాణేతర కార్పోరేట్ కంపెనీలు జరిగిన విపత్తు పట్ల మానవీయ కోణంలో స్పందింఆచలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా వర్ష భీభత్సానికి కకావికలం అయ్యాయని, వీరందరిని ఆదుకునేందుకు ఆర్థికంగా ఎదిగిన వారు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీరోలు పోలసీస్టేషన్ ఎస్సై సేవలు అభినందనీయమని రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గత మూడు రోజుల క్రింత ఉద్భవించిన వర్ష భీభత్సానికి గురైన సీతారాంతండా వాసులు వంద మందిని కాపాడి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు.

అశ్విని కుటుంబాన్ని ఆదుకుంటాం

నివాళులర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / ఖమ్మం : రెండు రోజుల క్రితం ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గంగారం తండాకు చెందిన మోతీలాల్, అశ్విని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మోతీలాల్, అశ్విని కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రెండు రోజుల క్రితం ఆకేరు వరద ప్రవాహంలో కారు కొట్టుకోని పోయి యువ శాస్త్రవేత్త అశ్విని ఆమె తండ్రి మోతీలాల్ మరణించిన విషయం విధితమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అశ్విని, మోతీలాల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని యువ శాస్త్రవేత్తను కోల్పోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. అశ్విని సోదరునికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'తెలంగాణ విద్య కమిషన్' ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దేలా నూతన విద్యావిధానాన్ని రూపొందించే అవకాశాలు ఉన్నాయి. దీనిపైన ఇప్పటికే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పలువురు విద్యావేత్తలు, ప్రముఖులతో చర్చించినట్టు తెలిసింది. ఈ కమిషన్‌కు ఛైర్మన్, సహా ముగ్గరు సభ్యులను నియమించనుంది.పలు అంశాలను అధ్యయనం చేసి ప్రీ ప్రైమరీ నుంచి సాంకేతిక , యూనివర్సిటీ విద్య వరకు విద్యావిధానాన్ని రూపొందించనున్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి విద్యా కమిషన్ తెలియజేయనుంది. విద్యారంగ నిపుణులతోపాటు పలువురితో విద్యా రంగంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై విద్యా కమిషన్ నిత్యం అధ్యయనం చేయనుంది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు దిగజారుతున్నాయని వెల్లడైంది. పైగా యూనివర్సిటీల్లో పబ్లికేషన్ల సంఖ్య తగ్గుతోంది. పరిశోధనలు కుంటుపడుతున్నాయి.ఈ నేపథ్యంలో విద్యా రంగంలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం బావిస్తున్నది.

అధ్యయనం చేసే అంశాలు ఇవే

విలువలతో కూడిన విద్యను అందించడం. విద్యార్థులను ఉత్తమ ,బాధ్యతగల అంతర్జాతీయ పౌరులుగా తీర్చిదిద్దడం.విద్యార్థులందరికీ పూర్వ ప్రాథమిక విద్యను అందించడం. ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు.ఉన్నత విద్యలో నాణ్యమైన విద్యను అందించడం. విద్యార్థుల సమాగ్రాభివృద్ధికి చర్యలు.ఉన్నత విద్య సంస్థలను అప్రంటిస్ షిప్, ఎంప్లాయిబిలిటీస్కిల్స్‌తో అనుసంధానం. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాన్ని తీర్చిదిద్దడం.విద్యా కమిషన్ ఛైర్మన్‌గా ఆకునూరి మురళీ..?విద్యా కమిషన్‌కు త్వరలోనే ఛైర్మన్,ముగ్గురు సభ్యులను నియమించనున్నారు. కమిషన్ మెంబర్ సెక్రెటరీగా విద్యాశాఖకు చెందిన అధికారిని నియమించనున్నారు. కమిషన్ ఛైర్మన్‌గా మాజీ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళీ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ విధానానికి సంబంధించిన నివేదికను అందజేయడంతో పాటు విద్యావిధానంలో మార్పులు తీసుకొచ్చారు. పైగా నూతన విద్యా విధానం అంశంలో ఆకునూరి మురళీతో పలు మార్లు చర్చలు జరిగినట్టు తెలిసింది. అలాగే మిగిలిన ముగ్గురు సభ్యులలో విద్యా రంగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్లను నియమించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇందులో ప్రొఫెసర్. పి.ఎల్.వి విశ్వేశ్వర్‌రావు పేరు కూడా వినిపిస్తుంది. మరో ప్రొఫెసర్‌తో పాటు విద్యారంగంతో సంబంధం ఉన్న మరో వ్యక్తిని సభ్యునిగా నియమించనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

వ్యవసాయం కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందో తెలియక రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే 90.47 లక్షల పై చిలుకు ఎకరాల్లో వరి, పత్తి పంటలు సాగు :ప్రధాన పంటలైన వరి 57,18,527 సాగు విస్తీర్ణం కాగా ఇందులో రైతులు 47,81,185 ఎకరాలు(83.61 శాతం) ఇప్పటికే నాటు వేశారు. అలాగే రెండవ ప్రధాన పంట పత్తికి సంబంధించి 50,48,904 ఎకరాలకు గాను 42,66,041 ఎకరాలు(84.49 శాతం) పంట సాగు చేశారు. ఈ రెండు ప్రధాన పంటలు కలిపి 1,04,99,712 ఎకరాల సాగు విస్తీర్ణానికి గాను 90,47,226 ఎకరాల్లో పంటలు వేశారు. ఈ రెండు పంటలు అత్యధికంగా పండే ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరదల దాటికి లక్షల ఎకరాల్లో ఈ రెండు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సన్న వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈ ఏడాది రైతులు పెద్ద ఎత్తున సన్న వడ్లను సాగు చేశారు. అయితే వరి నాట్లు వేసి నెలలోపే కావడంతో వరి పంటలకు అపార నష్టం జరిగింది. కాగా భారీ వర్షాల కారణంగా పత్తి రైతులకు సైతం కోలుకోని దెబ్బ తగిలింది. మొక్క జొన్న, సజ్జలు, జొన్న రాగులు, కందులు, సోయాబీన్, మిరప పెసలు, మామిడి, ఆయిల్ పామ్, పసుపు, వేరు శెనగ, మినుములు, ఆముదాలు తదితర పంటలు కలిపి ఇప్పటి వరకు రాష్ట్ర రైతాంగం 1,09,57,557 ఎకరాల్లో సాగు చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాలో 1,09,57,557 ఎకరాల్లో వివిధ పంటల సాగు :

జిల్లా	విస్తీర్ణం(ఎకరాలు)	పంటసాగు(ఎకరాలు)	శాతం
ఆదిలాబాద్	5,62,093	,64,397	100.41
కుమురంబీమ్‌అసిపాబాద్	4,20,705	3,89,346	92.55
మంచిర్యాల	3,36,912	2,72,350	80.24
నిర్మల	4,09,750	3.68,566	89.95
నిజామాబాద్	5,05,122	5,45,846	108 .56
కామారెడ్డి	5,10,288	5,04,834	98.93
కరీంనగర్	3,31,252	3,05,372	92.19
పెద్దపల్లి	2,83,876	2,51,206	88.49
జగిత్యాల	3,74,645	3,69,036	98.50
రాజన్న సిరిసిల్ల	2,43,292	2.39,672	98.51
మెదక్	3,17,155	3,00,132	94.53
సంగారెడ్డి	7,17,866	7,10,961	99.04
సిద్దిపేట	5,22,414	4,77,102	91.33
వరంగల్	2,79,688	2,65,533	94.94
హనమకొండ	2,43,644	2,13,066	87.45
మహబూబాబాద్	3.26,631	2,84,746	87.18
ములుగు	1,27,481	94,086	73.80
జయశంకర్ భూపాలపల్లి	2,11,8371,56,077		73.80
జనగామ	3,47,626	3,07,974	88.59
ఖమ్మం	5,42,758	4,08,472	75.26
భద్రాదికొత్తగూడెం	3,70,920	4,06,806	109.67
రంగారెడ్డి	3,96,899	2,13,920	53.90
వికారాబాద్	5,77,508	5,07,168	87.82
మేడ్చల్ మల్కాజ్‌గిరి	23,026	21,039	91.37
మహబూబ్‌నగర్	3,34,159	1,95,242	58.43
నారాయణ్‌పేట్	4,27,260	3,61,814	84.68
నాగర్ కర్నూల్	5,26,606	3,24,926	61.70
వనపర్తి	2,40,233	1,42,253	59.21
జోగులాంబగద్వాల్	3.37,011	2,27,233	67.43
నల్లగొండ	11,07,086	8,53,824	77.12
సూర్యపేట	5,65,917	3,32,038	58.67
యాద్రాది భువనగిరి	4,10.650	3,42,520	83.41
మొత్తం	1,29,32,3101,	1,09,57,557	84.73

ప్రజావాణిలో 611 దరఖాస్తులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 611 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలను స్వయంగా ఆర్జీలను స్వీకరించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులోభాగంగా ఎస్‌సి సంక్షేమ శాఖకు సంబంధించి 149, బిసి సంక్షేమ శాఖకు సంబంధించి 123, మైనారిటీ సంక్షేమ శాఖ 94, విద్యుత్ శాఖ 57, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 54, ఇతర శాఖలకు సంబంధించి 134 మొత్తం 611 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సిపిఐ(ఎం) డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో త్రీవ ఆస్తి, ప్రాణ నష్టం చోటు చేసుకుందని, ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న అత్యంత భారీ వర్షాల కారణంగా 22 జిల్లాల్లో తీవ్ర ఆస్థి, ప్రాణ నష్టం జరిగిందని, ఇప్పటికి దాదాపు 21 మంది మరణించగా, లక్షలాది ప్రజలు నిరాశ్రయులు కాగా, సుమారు 173 మండలాల్లో భారీ వర్షాలు నమోదయ్యాని తెలిపారు. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో నష్టం తీవ్రంగా వున్నది. సుమారు రు.5500కోట్లు నష్టం జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసిందని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన నష్ట తీవ్రతను గుర్తించి తెలంగాణ ప్రజానీకాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గత నెల రోజులుగా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు అల్లాడిపోతున్న నేపథ్యంలో రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని వీరభద్రం కోరారు.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ
గండ్లు తక్షణమే పూడ్చివేయాలి

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.15వేల చొప్పున అందించాలి : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : భారీ వర్షాలు, వరదలతో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు పడిన గండ్లను తక్షణం పునర్ నిర్మించి రైతుల పంటలను కాపాడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాగితం రామచంద్రపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుండి పాలేరుకు వెళ్లే ప్రధాన కాలువ రెండు చోట్ల తెగిపోయిన ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రాష్ట్ర కౌలు రైతుల ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి దొడ్డ వెంకటయ్య కంబాల శ్రీనివాస్ సిరిపురం గ్రామ రైతులు శ్రీహరి పరిశీలించారు. ఈ ఈ సందర్భంగా అక్కడ రైతులతో నాయకులు ముచ్చటించారు. వారం రోజుల లోపు ఈ గండ్ల నిర్మాణం పూర్తి కాకపోతే వరి పొలాలు ఎండిపోతాయి అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పశ్య పద్మ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ,హైదరాబాద్ మహబూబ్‌గర్ జిల్లాలలో కుండపోతగా వర్షంతో జనజీవనం స్తంభించిపోవడంతో పాటు నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుండి పాలేరుకు వెళ్లే కాలువ కాగితం రామచంద్రపురం సమీపంలో ఒకచోట, రంగుల బ్రిడ్జి వద్ద ఈ రెండు చోట్ల కాలువ కట్టలు

తెగిపోవటంతో నీళ్లన్నీ పొలాలపై పడి ఎక్కడికక్కడ గళ్ళు పడటం పచ్చటి పొలాలపై ఇసుక మేటలు వేశాయని తెలిపారు. పాలేరు నుంచి నీళ్లు వెనక్కి రావటమే మరింత నష్టానికి దారి తీసిందని, దీంతో వేల ఎకరాలు జలమయం కావడంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెగిపోయిన కాలువ గండ్లను వెంటనే నిర్మాణం చేసి పంటలను కాపాడాలి అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ఏ మాత్రం ఆలస్యమైనా తిరిగి వరి నాట్లు వేసుకోటానికి వీలు ఉండదు.వేసిన వరి పంట పూర్తిగా దెబ్బ తినే అవకాశం ఉంటుందన్నారు. ఈ భారీ వర్షాలు ప్రకృతి వైపరీత్యంగా పర్యావరణంలో వస్తున్న విపరీతమైన మార్పులకు కారణంగా కేంద్ర పాలకులు పరిగణించాలని, జాతీయ విపత్తుగా ప్రకటించి సహాయక చర్యలు పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పొలాలకు ఎకరాకు రూ.15 వేల చోప్పున నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుతాన్ని కోరారు.

రెండు రోజులు భారీ వర్షాలు

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మరో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవరించి ఉందని వాతావరణ శాఖ సంచాలకులు వివరించారు. రుతుపవన ద్రోణి జైసల్మేర్, ఉదయ్‌పూర్ అల్పపీడనం కేంద్రంగా, పశ్చిమ విదర్భ, రామగుండం, కళింగపట్నం, ఆగ్నేయ దిశగా తూర్పు బంగాళాఖాతం మీదుగా వెళ్తుందని, సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, కోస్తాంధ్ర, యానాం వరకు విస్తరించి ఉందన్నారు. గురువారం వరకు పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. మంగళవారం తెలంగాణలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వానలుపడే సూచనలున్నాయన్నారు.

వారంలోపు నష్టం వివరాలివ్వండి

అన్ని శాఖల అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్నభారీ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను వారంలోపు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టం అంచనాల రూపొందించేందుకు గాను తీసుకోవాల్సిన కార్యచరణకు సంబంధించి మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ ఓ డీ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిజిపి డాక్టర్.జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ రావు, రవీ గుప్తా, వికాస్ రాజ్, అర్వింద్ కుమార్, ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, నవీన్ మిట్టల్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు, లోకేష్ కుమార్, రోనాల్ రోస్, ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, ఇప్పటికీ అనేక జిల్లాల్లో వర్షాలు కొనసాగుతుండడంతో వరదలుతగ్గుముఖం పట్టలేదని తెలిపారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపించి, జిపిఎస్ కోఆర్డినెట్ లతో సహా పూర్తి వివరాలను సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) లను ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలు వెంటనే అందజేయానలి ఆదేశించారు. ఈ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిహెచ్ ఎంసి కమీషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారాఫ్ అలీ, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సిఎం సహాయ నిధికి విరాళాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ముందుకొచ్చారు. తమ ఒక రోజు మూలవేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. సినీ ప్రముఖులు కూడా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తమ వంతు విరాళాన్ని ప్రకటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలు పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యా యి. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, మహబూబాబాద్, ఏపిలోని విజయవాడ, కృష్ణా జిల్లాల పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయి. వాగులు, వంకలు వరదలతో పోటెత్తాయి. దీంతో వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయం చేసేందుకు పలువురు ముందుకొచ్చారు. ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న తన ఒక నెల వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో జెఏసి నాయకుల అశ్వద్ధామరెడ్డి, ఊదరిగోపాల్, నిర్మల తదితరుల ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తమ ఒక రోజు మూలవేతనాన్ని అప్పగిస్తూ లేఖను అందజేశారు. అలాగే తెలంగాణ సెక్రెటేరియట్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ ప్రతినిధి బృందం రాజేశ్వరెడ్డి, ఉమా నాగలక్ష్మి బృందం కూడా ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శికి లేఖను అందజేశారు. కాగా మరో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జెఏసి చైర్మన్ జగదీశ్, సెక్రటరీ జనరల్ ఎల్లూరి శ్రీనివాస్ రావు ప్రతినిధి బృందం మహబూబాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డిని కలిసి ప్రభుత్వ ఉద్యోగుల ఒక రోజు వేతనాన్ని అందజేయనున్నట్టు వెల్లడించారు.

సినీ ప్రముఖుల విరాళాలు ...

సీనియర్ నటుడు, హిందూపూరం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణ తెలుగు రాష్ట్రాల సిఎం సహాయనిధికి రూ.50లక్షల చొప్పున, నటుడు మహేష్ బాబు ఎపి తెలంగాణకు రూ.50 లక్షల చోప్పున, జూనియర్ ఎన్‌టిఆర్ రూ.50లక్షల చొప్పున కోటీ రూపాయల విరాళాన్ని అందించారు. అతి త్వరగా తెలుగు ప్రజలు కోలుకోవాలన్నారు. విశ్వక్‌సేన్ తెలంగాణ, ఎపి సిఎం సహాయనిధికి రూ.5 లక్షల చొప్పున, సిద్ధు జొన్నలగడ్డ రూ.15 లక్షల చొప్పున రూ.30 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ , నిర్మాతలు,ఎస్.రాధాకృష్ణ ఎస్.నాగవంశీ తెలంగాణ, ఎపికి రూ. 25 లక్షల చొప్పున అందజేస్తున్నట్టు ప్రకటించారు.

భారీ వర్షాలతో ప్రాణ నష్టం దురదృష్టకరం

తక్షణ సహాయం అందించాలని హోం సెక్రటరీని కోరాం : కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతా ల్లో ప్రాణనష్టం దురదృష్టకరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులతో సంబంధం లేకుండా తక్షణ సహాయం కింద తాత్కాలికంగా వరద బాధిత ప్రాంతాలకు తక్షణమే సాయం అందించాలని కేంద్ర హోం సెక్రటరీని కోరామని కేంద్ర మంత్రి తెలిపారు.హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో భారీ వర్షాలు, వరద పరిస్థితిపై తాము ఎప్పటికప్పుడు సమీక్షించి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాని నరేం ద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.. స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడారని అవసరమైన మేర రాష్ట్రానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించారని తెలిపా రు. వరంగల్, మహబూబాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, రైల్వే ట్రాక్‌లను వెంటనే మరమ్మతులు చేసి, ప్రయాణికులు రాకపోకలు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించిందని వెల్లడించా రు. .అదేవిధంగా బిజెపి శ్రేణులు ఎక్కడ కూడా రాజకీయాలకు తావులేకుండా సేవాభావంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగస్వామ్యమై . ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని చెప్పారు. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం విషయంలో కేంద్రప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఇప్పటికే స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్స్ ఉన్నాయని ఆయన వెల్లడించారు.

వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే దాడి

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి
బాధితున్ని పరామర్శించిన హరీష్ బృందం

ప్రజాపక్షం/ ఖమ్మం : వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకే కాంగ్రెస్‌పార్టీ పరామర్శకు వచ్చిన బిఆర్ఎస్ నాయకులపై దాడి చేయించారని మాజీ మంత్రి జి. జగదీశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పథకం ప్రకారం రౌడీ షీటర్ మిక్కిలినేని నరేంద్ర ఆధ్వర్యంలో దాడి చేయించారని కారు అద్దాలు పగుల గొట్టారని ఇటువంటి దాడులకు భయపడేది లేదన్నారు. మంగళవారం స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియంతలనే ఎదుర్కొన్నాం ఈ ఆకు రౌడీలు మాకు లెక్కనా అన్నారు. ఎవరో చెపితే తప్ప మంత్రులు పరామర్శకు రాలేదని ఆయన ఆరోపించారు. పోలీసుల సహకారంతోనే దాడి జరిగిందని పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధితులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కార్లపై దాడి : వరద బాధితులను పరామర్శించి సాయం అందించేందుకు వచ్చిన బిఆర్ఎస్ బృందం మంచికంటి నగర్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో కొందరు కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రులను విమర్శించడం, బిఆర్ఎస్ కార్యకర్తలపై ఉమ్మి వేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ దశలో రాళ్లు, కర్రలతో బిఆర్ఎస్ కార్యకర్తలపైనా, మాజీ మంత్రుల పైనా దాడికి ప్రయత్నించారని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మాజీ మంత్రులు హరీష్‌రావు, అజయ్‌కుమార్ కార్లపై రాళ్లు విసరడంతో అద్దాలు పగిలాయి. ఈ ఘర్షణలో సంతోష్‌రెడ్డి అనే బిఆర్ఎస్ కార్యకర్త తీవ్రంగా గాయపడి మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బిఆర్ఎస్ నేతలు పరామర్శించారు. అనంతరం సిపిని కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వద్ది రాజు రవిచంద్ర నేతృత్వంలో బిఆర్ఎస్ బృందం సిపికి విజ్ఞప్తి చేసింది.

డిండి నదిలో గిరిజనులను రక్షించిన పోలీసులు

నల్గొండ, నాగర్‌కర్నూల్ పోలీసులను అభినందించిన డిజిపి జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్: వరద ఉధృతికి డిండి నదిలో చిక్కుకున్న పది మంది గిరిజనులను పోలీసులు సురక్షితంగా ప్రాణాలతో రక్షించారు. ధైర్యసాహసాలు ప్రదర్శించి గిరిజనులను కాపాడిన నల్గొండ, నాగర్‌కర్నూల్ పోలీసులను డిజిపి డాక్టర్ జితేందర్ అభినందించారు. డిండి నదిలో మంగళవారం డిండి మండలం గోసబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన పది మంది చెంచు గిరిజనులను అగ్నిమాపక శాఖ సమన్వయంతో వేగంగా నివహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో విజయవంతంగా రక్షించారు. భారీ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న నది నీటిమట్టం పెరగడంతో కొందరు డిండి కత్వా వద్ద చిక్కుకుపోయారు. అధికారుల యొక్క తక్షణ చర్యలు, మత్స్యకారులు మరియు వారి పడవల సహాయంతో ప్రభావితమైన వారందరినీ సురక్షితంగా తరలించారు. రక్షించబడిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. జల్లా గురువయ్య (70), నిరంజమ్మ (60), జల్లా బయ్యన్న (35), జల్లా సత్యయ్య (20), జల్లా చిన్న పాపయ్య (30), యాదమ్మ (20), అంజలి (5), అఖిల (3), శివ(16), ఒక చిన్న బిడ్డ (ఆరు నెలలు). ఈ కుటుంబాలను సురక్షిత ప్రదేశానికి తరలించి, అవసరమైన వైద్య సహాయం, సహాయక పదార్థాలు అందజేశారు. ఈ కుండపోత వర్షాల నేపథ్యంలో పౌరులందరికీ భద్రత కల్పించడంలో వారి నిబద్ధతను ప్రదర్శిస్తూ పోలీసు, అగ్నిమాపక శాఖ బృందాల సమిష్టి కృషి విస్తృతంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ ఆపరేషన్‌లో నాయకత్వం వహించిన నల్గొండ ఎస్‌పి శరత్ చంద్ర పవార్, ,నాగర్‌కర్నూల్ ఎస్‌పి వైభవ్ గైక్వాడ్‌లతో పాటు రెస్క్యూ ఆపరేషన్లో నిర్భయయంగా కృషి చేసిన దేవరకొండ, అచ్చంపేట డిఎస్‌పిలు, డిండి, అచ్చంపేట సిఐలను డిజిపి అభినందించారు.

మెదక్ ఎస్‌పి, క్యూఆర్‌టి సిబ్బందిని అభినందించిన డిజిపి

మెదక్ జిల్లా క్విక్ రెస్పాన్స్ టీం (క్యూ ఆర్ టి) పోలీసులు, గ్రామ యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి వరద నీటిలో కొట్టుకుపోతున్న రమావత్ నందు అనే వ్యక్తిని కాపాడిన సంఘటన మంగళవారం నాడు జరిగింది. మెదక్ జిల్లా టెక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధి గుండు వాగులో చోటుచేసుకుంది. వాగు పొంగిపొర్లుతుండగా.. అటుగా వెళ్తున్న రమావత్ నందు నీటిలో కొట్టుకుపోయాడు.. సమచారం అందుకున్న మెదక్ జిల్లా క్యూ ఆర్ టి పోలీసులు వెంటనే స్పందించారు. టెక్మాల్ పోలీస్ స్టేషన్ పరిధి గుండు వాగులో 45 ఏళ్ల రమావత్ నందు బ్రిడ్జిని దాటడానికి ప్రయత్నిస్తూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. వాగులో కొట్టుకుపోతూ.. వాగు లోపల ఓ బండ రాయిని పట్టుకొని ఆగిపోయాడు.. ఈ క్రమంలో అతడిని గమనించిన మెదక్ జిల్లా క్యూఆర్‌టి జిల్లా సభ్యుడు హోం గార్డ్ మహేష్ మరో ఇద్దరు యువకులు తాడు సహాయంతో కల్వర్టు మధ్యలోకి చేరుకోగా, అందరూ ఒక జట్టుగా ఏర్పడి.. ఆ వ్యక్తిని వరద ప్రవాహం నుంచి తాడు సహాయంతో బయటకు తీసుకువచ్చారు. ఆ వ్యక్తిని నెమ్మదిగా నీళ్లలోంచి బయటకు తీసి సురక్షితంగా వాగులో నుండి బయటకు తీశారు. ప్రాణాలను లెక్కచేయకుండా వరద నీటిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడినందుకు జిల్లా ఎస్పీ శ్రీ ఉదయ్ కుమార్ రెడ్డిని , క్యూ ఆర్ టి సభ్యులు బండి శ్రీనివాస్(హెడ్ కానిస్టేబుల్), సురేష్ నాయక్ (పోలీస్ కానిస్టేబుల్), కృష్ణ (పోలీస్ కానిస్టేబుల్), రమేష్ (పోలీస్ కానిస్టేబుల్), మహేష్ (హోమ్ గార్డ్) తదితరులను రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ లు అభినందించారు.

రైతులకు తక్షణ సాయం అందించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో నీట మునిగి పంటలకు ఇల్లు కోల్పోయిన బాధితులకు తక్షణమే ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభులింగం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రైతు సంఘం నాయకులు టి.రామ్ రెడ్డి,మాధవరెడ్డి గోపాల్ రెడ్డి, సురేష్, నిమ్మల నరసింహులు , వెంకట్ రెడ్డి, గుండాల శివుడు, సుధాకర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్వచ్ఛంద కార్యకర్తలుగా చురుకుగా పాల్గొనాలని వారు కోరారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కిన్నెరసాని వాగులో పడి ఇద్దరు మృతి



ప్రజాపక్షం/ ఆళ్లపల్లి : శుభకార్యానికి వచ్చిన బావ బామర్థులు ద్విచక్ర వాహనంపై వెళుతూ కిన్నెరసాని వాగులో పడి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సింది మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన కోరం వెంకటేశ్వర్లు (31) ఆయన బావమరిది దొడ్డ సాయికుమార్ (26) ద్విచక్ర వాహనంపై గుండాల మండలం వేపలగడ్డలో శుభకార్యం ముగించుకుని ఆదివారం తిరిగి లచ్చన్నగూడెం వస్తున్న క్రమంలో రాయగూడెం, మెట్లగూడెం మధ్య కిన్నెరసాని వాగును దాటుతున్న క్రమంలో వాహనంతో సహా వాగులో కొట్టుపోయారు. సోమవారం కుటుంబ సభ్యులు వారి ఆచూకీ కోసం ప్రయత్నించగా గల్లంతైన విషయం వెలుగు చూసింది. సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్, తహసీల్దార్ నాగభవాని ఆధ్వర్యంలో వాగులో గాలించగా చింతకుంట గ్రామం వద్ద సాయికుమార్ మృతదేహం, తోక బందం గ్రామ సమీపంలో కోరం వెంకటేశ్వర్లు మృతదేహాలు లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లుకు భార్య, రెండేళ్ల కుమార్తె ఉండగా సాయికుమార్‌కు 9 నెలల క్రితమే వివాహమైంది.

ఇండియన్ బ్యాంక్ Indian Bank ఇలాహాబాద్ ALLAHABAD BANKING THAT'S #TWICE AS GOOD

కళ్యాణ్ నగర్ బ్రాంచ్
డి.నం.8-3-168/ఎం/13, కళ్యాణ్‌నగర్ ఎంపర్-3, శ్రీరామ్‌నగర్, యూసుఫ్‌గూడ పోస్ట్, హైదరాబాద్-500029

[నిబంధన-8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

1. సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 8&9తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి **ఇండియన్ బ్యాంక్** అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు, రుణగ్రహీత/లు: **(1) శ్రీ మహమ్మద్ ఇలియాస్ తండ్రి లేటు మహమ్మద్ అష్ఫల్ (రుణగ్రహీత) & (2) శ్రీమతి నూర్జహాన్ బేగం భర్త మహమ్మద్ ఇలియాస్ (సహ-రుణగ్రహీత)** లకు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసు పేర్కొన్నట్లుగా మా కళ్యాణ్‌నగర్ బ్రాంచికి బకాయి పడిన రుణ మొత్తం 18/12/2012 నాటికి **రూ. 8,87,819.04/- (ఎనిమిది లక్షల ఎనభైఏడువేల ఎనిమిది వందల పంతొమ్మిది రూపాయల నాలుగు పైసలు మాత్రమే)** లను భవిష్యత్ వడ్డీ మరియు వ్యయంతో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ **05.02.2024** న డిమాండ్ నోటీసు జారీ చేయ డమైనది. 2.రుణగ్రహీత బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 8తో చదివే సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **02/09/2024 న** స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇంద

1.53 లక్షల ఎకరాల్లో పంట నష్టం

***పారిశుద్ధ్యం, ఆరోగ్య శిబిరాలపై ప్రధాన దృష్టి**
***నిపుణులతో వంతెనల పరిశీలన**
మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల

ప్రజాపక్షం / ఖమ్మం : రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు 1.53 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమిక అంచనా వేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అత్యధికంగా ఖమ్మంలోనే పంట నష్టం జరిగిందని ఆ తర్వాత సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయని తెలిపారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్నేరు పరివాహక ప్రాంతంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో పరివాహక ప్రాంతంలోని పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు, సలహాలు ఇచ్చి పంటలను కాపాడాలన్నారు. స్పష్టమైన నివేదిక తర్వాత ఇసుక మేటలు, కోతలకు గురైన రైతులకు నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు. రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఖమ్మంలో 10 విజన్లలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఖమ్మంలో మోహరించి పారిశుధ్య పనులు పూర్తి చేస్తున్నామన్నారు. నీటి సరఫరాను పునరుద్ధరించామని, నగరంలో 197 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని కొన్ని సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయని ఒకట్రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యుత్‌ను పునరుద్దరిస్తామని తెలిపారు. ముంపు ప్రాంతాలలో నిరంతరాయంగా మున్సిపల్ వాటర్‌ను ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇంటింటికి రేషన్ అందిస్తున్నామని ఇంట్లో వంటలు చేసుకోలేని పరిస్థితి నెలకొన్నప్పుడు ఆహార ప్యాకెట్లను అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 50వేల ప్యాకెట్లను క్యాంపు కార్యాలయం నుంచి పంపించినట్లు ఆయన తెలిపారు. ఉపశమన చర్యల అనంతరం సర్వే ప్రకారం ఆర్థిక సాయం అందిస్తామని ఆయన తెలిపారు. టెస్కో ద్వారా దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేయనున్నామని తుమ్మల తెలిపారు. ఖమ్మంను అనుసంధానం చేస్తూ మున్నేటిపై నిర్మించిన మూడు వంతెనలకు సంబంధించి నిపుణుల తో పరిశీలన చేయించి, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రిటైనింగ్ వాల్‌కు సంబంధించి ఒక పరిశీలన చేయాల్సి ఉందని నిపుణుల సలహామేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మీడియా సమావేశంలో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

మంగళవారం ఖమ్మం నగరంలో వరద ముంపుకు గురైన బొక్కలగడ్డ, మోతీనగర్, చెరువు బజార్ తదితర ప్రాంతాలలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి బాధితుల ను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడు తూ వరద బాధితులకు తక్షణ సాయంగా రూ. 10వేలు అందించనున్నట్లు తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు ప్రాంతాలలో పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలలోని రహదారులపై పేరుకుపోయిన బురదను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, నాగండ్ల దీపక్ చౌదరి, తుపాకు ల ఎలగొండ స్వామి, బొమ్మ ఉదయ్, శివ, మంగ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించేందుకే క్షేత్రస్థాయి పర్యటన

పంట నష్టం జరిగిన ప్రతీ రైతుకు రూ.10వేల ఆర్థిక సహాయం
రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: భారీవర్షాల వలన జరిగిన నష్టాన్ని, ప్రజల కష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట పరిహారం చెల్లించేందుకే ఈ పర్యటన చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 1వ వార్డులో పర్యటించి ఇండ్లలోకి నీరుపోయి నష్టం వాటిల్లిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రూ.10వేలు ఇస్తుందన్నారు. దద్దనాల చెరువు వరద వల్ల ధ్వంసం అయిన డ్రైనేజీని పరిశీలించి త్వరగా మరమ్మత్తులు చేపించాలని అధికారులకు సూచించారు. శివాలయం బజార్ 7వ వార్డులో ఉన్న ట్యాంక్‌బండ్ కొరకు కట్టిన డ్రైనేజీ ప్లానింగ్ సరిగ్గా లేకపోవడం వలనే వరదనీరు ఇండ్లలోకి వచ్చాయని నేను గతంలో ఎంపిగా ఉన్నప్పుడే ప్లానింగ్ సరిగ్గా లేదని మార్చాలని సూచించిన మార్చకుండా అలాగే నిర్మించడంతో నేడు ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని దీనికి కారణమైన ఏఈ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని, చెరువు కట్టకు సాధ్యమైనంత త్వరగా మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఇరిగేషన్ సీఈ రమేష్‌ను ఆదేశించారు. వరదల వలన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో తడిచిన ఎరువుల బస్తాలను పరిశీలించారు. అనంతరం మట్టపల్లి రోడ్డు జంక్షన్‌లో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని ఆర్‌డివోకు సూచించారు. నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.10వేలు ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తానని రైతులకు మంత్రి భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగేందర్, మున్సిపల్ కమిషనర్ యాకూబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

భారీ వర్షాలతో పంటలు నష్టపోయి న రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి కేంద్రంతో పాటు మండలంలోని చౌటపల్లి, రఘునాథపా లెం, గుండ్లపల్లి, చెన్నాయిపాలెం గ్రామాలలో మంత్రి ఉత్తమ్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ చెరువులు, కాలువల మీద కాలినడకన కలియ తిరుగుతూ రైతాంగాన్ని ఓదారుస్తూ, ప్రతి రైతుకు భరోసా నిచ్చారు. ప్రయాణానికి అనువుగాని ప్రాంతాలకు ట్రాక్టర్ మీద పయనించి వరద ముంపు ప్రాంతాలను, పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాలకు ఎకరాలకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందిస్తామని వెల్లడించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు రూ.10 వేలు, పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లకు ఇందిరమ్మ పథకంలో భాగంగా పక్కా గృహా లు నిర్మిస్తామని తెలియజేశారు. మృతి చెందిన పశువులకు రూ.50 వేలు, దురదృష్టవశాత్తు మరణించిన కుటుంబాలకు రూ. 5లక్షలు అందిస్తామన్నారు. ఏ ఒక్కరు మనోధైర్యం కోల్పోరాదని మంత్రి ఉత్తమ్ ప్రజలకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో వేగం పెంచాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: వరద సహాయ చర్యల్లో వేగం పెంచి బాధితులకు తోడ్పాటునివ్వాలని రాష్ట్ర రెవిన్యూ,హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం లోని వాల్యా తండా, కస్నాతండా, తనకంపాడు గ్రామాల్లోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితులను ఓదర్చారు. మంత్రి ఇంటింటికి తిరిగి వరద నష్టాన్ని పరిశీలించారు. ఇండ్లు, వస్తువులు, షాపులు, పంటపొలాలు నష్టపోయిన ప్రతి ఒక్క బాధితుల కు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఆకేరువాగును పరిశీలిం చి, దెబ్బతిన్న బ్రిడ్జి పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కస్నాతండాలో ఫర్టిలైజర్ షాను సరుకుతో సహ వరదలో కొట్టుకోపోవడం జరిగిందని తెలుపగా..మంత్రి పరిశీలించారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. రెవిన్యూ అధికారులు ఇంటింటికి వెళ్లిక్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేయాలన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనాలు చేపట్టాలన్నారు. త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫర్మర్స్, తెగిన విద్యుత్‌వైర్ల మరమ్మత్తులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలన్నా రు. దెబ్బతిన్న రహదారులు, కల్వర్టుల మరమ్మత్తులు చేపట్టి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధు లు పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ, ప్రజలకు ఆరోగ్య విషయాల్లో అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. బాధితులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరో సా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కష్టాలు, కన్నీళ్లు తుడిచేందుకు నేను ఉన్నా..

వరదబాధితులకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క భరోసా

ప్రజాపక్షం/ముదిగొండ: తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధితులకు అధైర్యపడవద్దని మీ కష్టాలు కన్నీళ్లు తుడిచేందుకు నేను ఉన్నా అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భరోసా కల్పించారు. మంగళవారం ముదిగొండ మండలపరిధిలోని న్యూ లక్ష్మీపురం, పండ్రేగుపల్లి గ్రామాల్లో వరద ముం పు ప్రాంతాలను ఆయన పర్యటించారు. ఆ తరువాత న్యూలక్ష్మీ పురంలో ఎస్సీ కాలనీలు, పండ్రేగుపల్లిలో డబుల్‌బెడ్‌రూమ్‌లు, మున్నేరు కరకట్ట తెగి నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు, మహిళలు, ఆయన ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన స్పంది స్తూ..అధైర్యపడవద్దని ఇంది రమ్మ ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ముంపు ప్రాంతాల్లో నిరాశ్రయులైన బాధితులకు తక్షణమే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని అక్కడే ఉన్న తహశీల్దార్ కరుణాకర్‌రెడ్డిని ఆదేశించారు.

పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేసి నివేదిక అందజేయాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు ఇస్తూ నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. కాగా న్యూలక్ష్మీపురం ఎస్సీ కాలనీలు వరద ముంపునకు గురి కాకుండా శాశ్వత పరిష్కారం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కాలనీ వాసులు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పండ్రేగుపల్లితండాలో వర్షం వల్ల కూలిపోయిన ఖమ్మం, కూసుమంచి 132 కేవీ హైటెన్షన్ టవర్‌ను ఆయన పరిశీలించారు. తక్షణమే విద్యుత్ టవర్ల పరిస్థితి పై ఆరా తీశారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన విద్యుత్ ఏడీ బాబు నాయక్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగులు సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మినేని రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు పసుపులేటి వెంకట్, మహ్మద్ అజ్గర్, పల్లపాటి కృష్ణ, వీరబాబు, ఉసికల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళులు : డిఐజి ప్రకాష్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: జమ్మూకాశ్మీర్‌లోని లేహ లడఖ్‌లో అక్టోబర్ 21, 1959న చైనా బలగాల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), ఇండోటిబెట్ బార్డర్ ఫోర్స్ (ఐటిబిఎఫ్)కు చెందిన పది మంది అమరులకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర టూరిజం డౌలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి డిఐజి ఎన్.ప్రకాష్‌రెడ్డి నివాళులర్పించారు. 18000 ఎత్తు అడుగులో లడఖ్‌లో అమరుల జ్ఞాపనార్థం నిర్మించిన అమర వీరుల స్థూపాన్ని ప్రకాష్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ప్రతి ఏటా తెలంగాణ రాష్ట్ర పోలీసుల తరపున ఒక ప్రతినిధి వెళ్లి నివాళులర్పించడం ఆనవాయితీగా సాగుతుంది. ఈ క్రమంలోనే ఈ సారి ప్రకాష్ రెడ్డి తెలంగాణ పోలీసు విభాగం తరపున ప్రతినిధిగా లడఖ్‌కు వెళ్లారు.అక్టోబర్21వ తేదీన చైనా బలగాల చేతిలో పోలీసులు ప్రాణాలు కోల్పోయిన రోజు.ఈ రోజునే ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా పోలీసు అమరవీరుల దినోత్సవంగా నిర్వహిస్తారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర రవాణ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలసి మంత్రి పొన్నం ప్రభాకర్, హిమాయత్ సాగర్ జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఒక వర్షం పడితే పూర్తిగా ఐదు వేల క్యూసెక్కుల నీళ్ళు వస్తే 10 గంటల్లో జలాశయం నిండి ఓవర్ ఫ్లో అవుతుందని,జలాశయం నిండితే, జలాశయం కింద ఉన్న ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఎక్కడ కూడా ఏ చిన్న ఇబ్బంది రాకుం డా అధికార యంత్రాంగం నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తుందన్నారని తెలిపారు. వర్షాల కారణంగా సంభవించిన మరణాలు అన్ని ప్రమాదవశాత్తు జరిగాయని, ఎక్కడ కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగినవి కావన్నారు. చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో వారికి 5లక్షల ఎక్స్ గ్రేషియ ఇస్తున్నామని, భారీ వర్షాల వల్ల ఇబ్బందులు కలగకుండా అందరినీ అప్రమత్తం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం అందుబాటులో ఉంటు 24 గంటలు పని చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం వెళ్లి అక్కడ పర్యటించి రాత్రి అక్కడే ఉన్నారని, ఉదయం మహబూబాబాద్ వెళ్లి అన్ని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.భారీ వర్షాల వల్ల లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ప్రాథమిక అంచనా మేరకు 5 వేల కోట్ల రూపాయలపైన నష్టం జరిగిందని మంత్రి పొన్నం వివరించారు. జాతీయ విపత్తుగా తీసుకోని తక్షణం అంచనాలు తరువాత,ముందు 2వేల కోట్లు ఆర్థిక సహకారం చేయాలని కేంద్రాన్ని కోరడం జరిగిందన్నారు. పంట నష్టానికి, ప్రాణ నష్టానికి, ఆర్థిక నష్టానికి సంబంధించి ప్రభుత్వ పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్లు కు భారీగా నష్టం జరిగిందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప బయటకు రావద్దని మంత్రి ప్రజలను కోరారు. రాష్ట్రం లోని 33 జిల్లాల కలెక్టర్లు, గ్రామ కార్యదర్శి నుండి మొదలు సిఎస్ వరకు 24/7 పని చేస్తున్నారని మంత్రి తెలిపారు. సమస్యను పరిష్కరించెందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, శాసన సభ్యులు, ఎంపి లు అందరూ అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. ప్రజలు ధైర్యంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశా రు.

ఈ పరిశీలనలో బండ్లగూడ మేయర్ లతా ప్రేమ్ గౌడ్, రాజేందర్ నగర్ ఆర్‌డిఒ వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు బి. జ్ఞానేశ్వర్,నరేందర్, ఇరిగేషన్, ఇతర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,బిజెఎల్‌పి నేత మహేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి : భారీ వర్షాలు, వరదలతో సమస్యలను ఎదుర్కొంటున్న జిఎన్ఆర్ కాలనీ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. మంగళవారం భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని జిఎన్ఆర్ కాలనీలో స్థానిక శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలలతో కలిసి మంత్రి పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో వరదనీటి వలన ఏర్పడుతున్న ఇబ్బందులను కాలనీ ప్రజలు మంత్రికి వివరించారు. స్వర్ణ ప్రాజెక్టు కింద చెక్ డ్యామ్ నిర్మాణం స్థానికంగా ఉన్న నాళాల ఆక్రమణ కారణంగా వరద నీరు సక్రమంగా ప్రవహించక నీరు కాలనీలోకి చేరుతుందని స్థానికులు మంత్రికి తెలిపారు. చెక్ డ్యామ్ వలన ప్రతి సంవత్సరం పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో నిర్మల్ సమీప గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. చెక్ డ్యామ్ నిర్మాణాన్ని కుదించి, నాళా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి తద్వారా వరద నీటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోనికి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల వర్షాలు కురిసినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ ప్రజ లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు వరదలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీవాసుల సమస్యలను శాస్త్రీయంగా అధ్యయ నం చేసి సాంకేతిక నిపుణులతో చర్చించి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి,త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా కాలనీ ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. గత కొన్ని సంవత్సరాలుగా వరదల కారణంగా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న నష్టాలు, సమస్యలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి జిఎన్ఆర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి కి వివరించారు. కాలనీ వాసులు,రైతుల సమస్యల పరిష్కారానికి తాము అన్ని విధాలుగా ప్రభుత్వానికి సహకరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు,ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, డిఎస్పి గంగారెడ్డి, మునిసిపల్ కమిషనర్ రాజు, తహసిల్దార్ రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు కాలనీవాసులు, రైతులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ప్రాణ, ఆస్తి నష్టం

మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత హరీష్‌రావు

ప్రజాపక్షం / ఖమ్మం : పాలనపై పట్టు కోల్పోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలతో విపక్షాలను విమర్శిస్తూ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు ఆరోపించారు. దారుణంగా విఫలమైన కారణంగానే రాష్ట్రంలో ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా జరిగిందని ఆయన తెలిపారు. మంగళవారం బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడుతూ సహాయ చర్యలు పర్యవేక్షించాల్సిన ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకోకుండా బిఆర్ఎస్‌ను విమర్శించడంతో కాలం గడిపారన్నారు.

జిల్లాలో తొమ్మిది మందిని గెలిపిస్తే తొమ్మిదిని కూడా కాపాడలేకపోయారని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ముందస్తు సమాచారం లేకనే కట్టుబట్టలతో అనేక మంది నిరాశ్రయులయ్యారని ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను, హెలికాప్టర్లను అందుబాటులో ఉంచలేక పోయారన్నారు. సాయం అందలేదని ప్రభుత్వాన్ని విమర్శించిన ఇంటర్ బాలికపై కాంగ్రెస్ దాడి చేసేందుకు ప్రయత్నిస్తుందని జర్నలిస్టులపైనా, వరద సాయం అడిగిన వారిపైనా, రైతులపైనా, పరామర్శకు వచ్చిన వారిపై దాడులు చేస్తుంటే ప్రజా పాలన ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. తప్పులు ఎత్తి చూపుతామని ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రజల పక్షాన పోరాడతామని అనేక పోరాటాలను చేసిన మేము అనేక మంది నియంతలను చూశామని హరీష్‌రావు తెలిపారు. పోలీసులు, రౌడీలు కలిసి తమపై దాడి చేశారని మా పర్యటనలో ఒక్క పోలీస్ కనిపించకపోగా దాడి సమయంలో రౌడీలను పోలీసులే వెంటేసుకొచ్చారని హరీష్‌రావు ఆరోపించారు. నష్టపోయిన ప్రతి ఇంటికి రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలని ఆయన తెలిపారు. ప్రతి ఎకరాకు రూ. 30వేలు పరిహారం ఇవ్వాలని, మరణించిన ప్రతి కుటుంబానికి గతంలో రేవంత్‌రెడ్డి, సీతక్క లు డిమాండ్ చేసినట్లుగా రూ. 25 లక్షలు ఇవ్వాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ బాధితులకు అండగా ఉంటుందని రాష్ట్రం నలుమూలల నుంచి నిత్యావసర వస్తువులు సేకరించి ఖమ్మంలో పంపిణీ చేస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసన సభ్యులు వివేక్ గౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి, శంబీపూర్ రాజు, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, బానోత్ మదన్‌లాల్, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, పలువురు కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిండు కుండలా నీటి ప్రాజెక్టులు

ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా గత 5 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలోని అన్ని జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. అన్ని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతుండడంతో అంతకు అంతా నీటి మట్టాలు పెరిగాయి. మరి ముఖ్యంగా గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అప్రమత్తమైన నీటి పారుదల శాఖ అధికారులు పలు ప్రాజెక్టుల నుంచి దిగువకు వరద నీటిని వదులుతున్నారు. కృష్ణ బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులలో సైతం సోమవారంతో పోల్చితే మంగళవారం నీటి మట్టాలు కాస్తా పెరిగాయి.

కృష్ణాబేసిన్....

ప్రాజెక్టు	పూర్తి స్థాయి నీటి మట్టం	ప్రస్తుత నీటి మట్టం
నారాయణపూర్	37.14 టిఎంసిలు	36.03 టిఎంసిలు
జూరాల	9.66 టిఎంసిలు	8.03 టిఎంసిలు
తుంగభద్రాడ్యాం	105.79 టిఎంసిలు	99.35 టిఎంసిలు
శ్రీశైలం రిజర్వాయర్	215.81 టిఎంసిలు	208.72టిఎంసి లు
పులిచింతల డ్యాం	45.77 టిఎంసిలు	41.59 టిఎంసిలు
నాగర్జున సాగర్	312.05 టిఎంసిలు	300.03 టిఎంసిలు
గోదావరి బేసిన్....		
సింగూరు	29.917టిఎంసిలు	21.54టిఎంసిలు
నిజాంసాగర్	17.800 టిఎంసిలు	13.15 టిఎంసిలు
శ్రీరాంసాగర్	80.500 టిఎంసిలు	69.89 టిఎంసిలు
కడెం నారాయణరెడ్డి	7.600 టిఎంసిలు	6.19 టిఎంసిలు
శ్రీపాద ఎల్లంపల్లి	20.175 టిఎంసిలు	14.25 టిఎంసిలు

కులగణనకు అనుమతిచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ఎవరు?

కాంగ్రెస్ గ్యారంటీని బిజెపి హైజాక్ చేస్తుందా? కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ : కులగణనకు అనుమతి ఇచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ఎవరు? అని కాంగ్రెస్‌పార్టీ మండిపడింది. కులగణన చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆర్‌ఎస్‌ఎస్ సోమవారంనాడు చేసిన ప్రకటనపై కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల వ్యవహారాల ఇన్‌ఛార్జ్ జైరామ్ రమేశ్ మంగళవారంనాడు ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ, కాంగ్రెస్‌పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన మరో గ్యారంటీని బిజెపి హైజాక్ చేస్తోందా? అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇప్పుడు సంఘపరివార్ అనుమతి ఇచ్చింది గనుక ఇక కులగణనను బిజెపి ప్రభుత్వం చేపడుతుందా? అని ఆయన విస్తుపోయారు. ఆర్‌ఎస్‌ఎస్ చేసిన ప్రకటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, అసలు కులగణనకు అనుమతి ఇవ్వడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఎవరు? అదేమైనా అంపైరా? న్యాయమూర్తా? ఎన్నికల ప్రయోజనాల ని మిత్తం కులగణనను దుర్వినియోగం చేయకూడదని ప్రకటనలు గుప్పించడానికి అసలు ఆర్‌ఎస్‌ఎస్ ఎవరు? అని జైరామ్ రమేశ్ మండిపడ్డారు. కొన్ని కులాలకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా సేకరించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదనీ, ఐతే ఆ సమాచారాన్ని ఎన్నికల ప్రయోజనాలకోసం ఒక రాజకీయాస్త్రంగా మాత్రం ఉపయోగించుకోకూడదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించడంపట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కులగణనను తిరస్కరించడానికి, వ్యతిరేకించడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏమైనా ''వీటో పవర్'' ఉందా? ఎవరైనా దానికి అలాంటి అధికారాన్ని ఇచ్చారా? అని తీవ్రస్థాయిలో జైరామ్ రమేశ్ విమర్శలు చేశారు. ఈ మేరకు హిందీలో ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు ఇచ్చే రిజర్వేషన్‌పై 50 శాతం పరిమితిని తొలగించాలన్న విషయంపై ఆర్‌ఎస్‌ఎస్ ఎందుకు అర్థంకాని నిగూఢమైన మౌనా న్ని పాటిస్తోంది? అని ఆయన ప్రశ్నించారు. ''ఇప్పుడు ఇక ఆర్‌ఎస్‌ఎస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది గనుక దైవాంశ సంభూతుడై న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ప్రజల కు ఇచ్చిన మరో గ్యారంటీని హైజాక్ చేస్తారా? అని ప్రశ్నించారు.

ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి తేలిపోయింది : ఖర్గే

ఇదిలా ఉండగా, జైరామ్ రమేశ్ కంటే ముందుగానే సోమవారం రాత్రి పొద్దు పోయాక కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఒక ప్రకటన చేస్తూ, కుల గణనకు దేశం వ్యతిరేకమా? అనుకూలమా? అనే విషయంపై ఆర్‌ఎస్‌ఎస్‌కు ఉన్న వైఖరి ఏమిటో తేటతెల్లమైపోయిందని అన్నారు.''దేశ రాజ్యాంగానికంటే ఎక్కువగా మనుస్మృతివైపే మొగ్గుచూపించే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ఇతర అణగారిన కులాల భాగస్వామ్యంపట్ల తీవ్ర ఆందోళన చెందుతోందా? లేదా?'' అని ఎక్స్ దికగా హిందీలో చేసిన పోస్టింగ్ ద్వారా ప్రశ్నించారు. కాగా కేరళ పాలక్కాడ్‌లో మూడు రోజులపాటు జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం ''సమన్వయ్ బైఠక్'' అనంతరం ఆ సంస్థ అఖిలభారత ప్రచార్ ప్రముఖ్ సునీల్ అంబేద్కర్ మీడియాతో మాట్లాడుతూ, కులం, కుల సంబంధాలు హిందూ సమాజానికి చాలా ముఖ్యమైన, అతి సున్నితమైన సమస్య అని అన్నారు. ఈ సమస్య మన జాతీయ ఐక్యతకు, జాతీయ సమగ్రకు అత్యంత కీలకమైన, సున్నితమైన విషయమని కులగణనపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అందువల్ల ఈ విషయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చాలా సీరియస్‌గా పరిగణిస్తుందన్నారు. కేవలం ఈ అంశాన్ని ఒక ఎన్నికల లేదా రాజకీయ ప్రాతిపదికపై ఆర్‌ఎస్‌ఎస్ చూడబోదని అన్నారు. ''అందువల్ల ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచించేది ఏమిటంటే, అన్ని సంక్షేమ కార్యక్రమాలకూ కూడా ప్రత్యేకించి వెనుకబడిన కొన్ని కులాలు, లే దా వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలంటే ఆయా కులాలపై దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది, ఇది చాలా అవసరం, ఇంతకుముందు కూడా ఈ విషయాన్ని చేపట్టాం, దీన్ని చేపట్టవచ్చు, సమస్య ఉండదు'' అని సునీల్ అంబేద్కర్ అ న్నారు. ''ఐతే ఈ కులగణనను కేవలం కొన్ని వెనుకబడిన కులాల సంక్షేమ సమస్యల పరిష్కారానికితప్ప ఇతరవిధాలుగా దుర్వినియో గం చేయకూడదు, అందువల్ల మేం అందరికీ ఒక హెచ్చరిక రేఖ పెడుతున్నాం'' అని ఆయన అన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీపార్టీ, ఇతర 'ఇండియా' కూటమి పార్టీలు కులగణనను సమర్థవంతమైన విధాన నిర్ణయాలకోసం చేపట్టాలని ప్రచారం చేస్తున్న తరుణంలో సునీల్ అంబేద్కర్ ప్రకటన వెలువడింది.

కుల గణనను రాజకీయ అస్త్రం చెయ్యొద్దు

మద్దతు ఇస్తూనే లక్ష్మణరేఖ గీసిన ఆర్‌ఎస్‌ఎస్

పాలక్కాడ్ : కులగణనకు ఆర్‌ఎస్‌ఎస్ పచ్చజెండా ఊపింది. ఐతే గుర్రం ఎక్కిన రౌతులాగా పెత్తనం చెలాయించేవిధంగా కొన్ని షరతులు విధించింది. దేశంలో కులగణన చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సోమవారం నాడు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఐతే కేవలం ఈ కుల గణనను కొన్ని వెనుక బడిన వర్గాల సాంఘిక సంక్షేమం కార్యక్రమాల అమలుకు, వారి అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలి తప్ప రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలకోసం మాత్రం ఉపయోగించుకోకూదని షరతులు విధించింది. కొన్ని వెనుకబడిన కులాలు, వర్గాలకు సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని సేకరించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఐతే ఒక రాజకీయ అస్త్రంగా వాడకూడదని స్పష్టం చేసింది. పాలక్కాడ్‌లో మూడురోజులపాటు జరిగన ప్రత్యేక సమావేశాల ముగింపు అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ సునీల్ అంబేద్కర్ సోమవారంనాడు మీడియాతో మాట్లాడుతూ, ''అన్ని సంక్షేమ కార్యక్రమాల అమలుకు, ప్రత్యేకించి సమాజంలో కులాలు, వర్గాలను లక్ష్యంగా చేసుకుని కులగణ న చేసినప్పుడు వారి అభివృద్ధికోసం ఆయా వర్గాల గణాంకాలు ప్రభుత్వానికి అవసరం అవుతాయి, ఇది దేశంలో అమలులో ఉన్న సంప్రదాయమే, కానీ ఈ గణాంకాలను కేవలం ఆయా వర్గాలు, కులాల సాంఘిక సంక్షేమానికి మాత్రమే ఉపయోగించుకోవాలి, జాతీయ స్థాయిలో దేశవ్యాప్తంగా సేకరించే ఈ గణాంకాలను ఒక రాజకీయ అస్త్రంగా ఉపయోగించకూడదు, అందువల్ల ప్రతిఒక్కరికీ మేం ఈ విషయంలో ఒక లక్ష్మణరేఖ గీస్తున్నాం'' అన్నారు. హిందూ సమాజంలో కులం, కుల సంబంధాలు చాలా సున్నితమైన స మస్య, భారతదేశ సమగ్రతకు, సమైక్యతకు ఇది అ త్యంత ముఖ్యమైన విషయం, ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు తమ అనుబంధ సంస్థలన్నీ ఎల్లప్పుడూ ముందుగా జాతీయ ప్రయోజనాలనే దృష్టిలోపెట్టుకుంటా యి, అందువల్ల కులగణనను చాలా సున్నితమైన వ్యవహారంగా చూడాలి, దీనిని ఎన్నికల ప్రయోజనాలకోసమో, రాజకీయ ప్రయోజనాల కోసమో ఉపయోగించుకోకూడదు'' అని సునీల్ అంబేద్కర్ అన్నారు. తమిళనాడులో మైనారిటీలు పెద్ద సం ఖ్య లో మతమార్పిడులు చేస్తున్నారని సంఘపరివా ర్ సంస్థ లు గుర్తించాయి, ఇది చాలా ఆందోళన క లిగించే విష యం, ఈ విషయంపై మేం ఒక అధ్యయనం నిర్వహి స్తాం, తదపరి దీనిపై ఒక వ్యూహం రూపొందిస్తాం'' అన్నారు. అదేవిధంగా కోల్‌కతా ఆర్.జి.కార్ వైద్యకళాశాల—ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న పోస్టుగ్రాడ్యుయే ట్ వైద్యశిక్షణార్థి అభయపై ఆగస్టు 9వ తేదీన జరిగిన అ త్యాచారం, హత్య సంఘటనను కూడాఈ మూడు రోజుల ఆర్‌ఎస్‌ఎస్ సమావేశాలు ఖండించాయి. ఈ విధమైన స మస్యల పరిష్కారానికి చట్టాలను తిరిగి సవరించాల్సిన అ వసరం ఉందని, వాటిని కఠినతరం చేయాల్సిన అవసరం ఉందనిపేర్కొంది.

23వ 'లా' కమిషన్‌ను ఏర్పాటు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం 23వ లా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 22వ లా కమిషన్ పదవీకాలం ఆగస్టు 31వ తేదీతో పూర్తి కావడం తో కేంద్ర ప్రభుత్వం కొత్త లా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ సోమవా రం అర్థరాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. లా కమిషన్ మూడు సంవత్సరాలపాటు కొనసాగుతుంది. ఈ కొత్త కమిషన్‌లో పూర్తికా లం పనిచేసే ఛైర్‌పర్సన్‌తోపాటు మరో నలుగురు సభ్యులు కూడా పూర్తికాలం పదవుల్లో కొనసాగుతారు.వీరిలో ఒక మెంబర్ సెక్రటరీ కూడా ఉంటారు. ఈ ఉత్తర్వు ప్రకారం ఇందులో ఐదుగురు కంటే ఎక్కువమంది పార్ట్‌టైమ్ సభ్యులుగా ఉండకూడదు. న్యాయ వ్యవహారాల శాఖ కార్యర్శి, శాసనవిభాగం కార్యదర్శులు ఇందులో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. వీరికి రూ.2.50 నుండి 2.25 లక్షల మేరకు నెల నెలా వేతనాలుగా చెల్లిస్తారు. సుప్రీ కోర్టు, హైకోర్టులో పనిచేసే న్యాయమూర్తులను లేదా పదవీ విరమణ చేసిన న్యా యమూర్తులు ఈ లాకమిషన్‌లో సభ్యులుగా, ఛైర్‌పర్సన్‌గా నియమిస్తారు. సంక్లిష్టమైన న్యాయపరమైన సమస్యలపై ఈ కమిషన్ నివేదికలు ఇవ్వడం ద్వారా పరిష్కారాలు చూపిస్తుంది. ఈ మేరకు 23 వ లా కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యుల నియామకాలకు సంబంధించిన ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సెప్టెంబరు 1వ తేదీ నుం డీ ఈ కొత్త కమిషన్ పదవీకాలం ప్రారంభం అవుతుందని కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ పేర్కొంది. 2015, 2020 సెప్టెంబరులలో 21, 22 లా కమిషన్ల నియామకాలకు సంధింంచిన నియామకాల నోటిఫికేషన్లు పాత నిబంధనల ప్రకారం జారీ ఐనప్పటికీ కూడా, ఇటీవలికాలంలో పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను ఛైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నారు. 22వ లా కమిషన్ అనేక నెలలుగా ఛైర్మన్ లేకుండానే పనిచేసింది. ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)పై కీలక నివేదికపై ఇప్పటికీ ఇంకా కసరత్తు జరుగుతోంది. జమిలి ఎన్నికలపై లా కమిషన్ నివేదిక ఇప్పటికికే సిద్ధమైంది. దీనిని ఇంకా న్యాయ మంత్రిత్వశాఖకు సమర్పించవలసి ఉంది. ఎందుదుకంటే లా కమిషన్ ఛైర్మన్ పదవి నియామకం జరగకుండా ఈ నివేదికను సమర్పించకూడదు. 22వ లా కమిషన్‌కు పదవీవిరమణ చేసిన న్యాయమూర్తి జస్టిస్ రితురాజ్ అవస్థి ఛై ర్మన్‌గావ్యవహరించారు. ఆయనను అవినీతి వ్యతిరేక నిఘా సంస్థ లోక్‌పాల్‌కు సభ్యుడుగా కొద్ది నెలలక్రితం నియమించడంతో ఈ పదవి ఖాళీగానేఉండిపోయింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కో విండ్ అధ్యక్షతన ప్రధానమంత్రి నియమించిన ఉన్నతస్థాయి కమి టీ ''ఒకే దేశం, ఒకే ఎన్నిక'' (పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు) అనే అంశంపై గడచిన మార్చినెలలోనే తన నివేదికను స మర్పించింది గత ఏడాది 22వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై తాజా సంప్రదింపులు ప్రారభించింది సమాజంలో భిన్న వర్గాల నుండి అభిప్రాయాలు సేకరించిన తర్వాత ముసాయిదా నివేదిక త యారుచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అప్పటికి జస్టిస్ అవస్థి లోక్‌పాల్ సభ్యుడుగా నియమితులయ్యారు.

ఎఐసిసి కార్యదర్శులతో రాహుల్, ఖర్గే సమావేశం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం ఎఐసిసి కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో సమావేశమయ్యారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై చర్చించారు. ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలలో జరిగిన సమావేశంలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం, క్షేత్రస్థాయిలో విస్తరించడంపై పార్టీ నాయకుల నుంచి వివరాలు సేకరించినట్లు వర్గాలు తెలిపాయి. కొన్ని రాష్ట్రాల్లో ఆఫీస్ బేరర్ల మార్పులు, చేర్పులు చేయడం, పలువురు కొత్త కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీలను నియమించి సంస్థాగతంగా పార్టీలో భారీ మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం నాటికి సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రతి భారతీయుడి వద్దకు కాంగ్రెస్ పార్టీ వెళ్తుందని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. తన అధ్యక్షతన జరిగిన కొత్తగా నియమితులైన ఎఐసిసి కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో సమావేశమయ్యాయమన్నారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించామన్నారు. దేశంలో అధికారంలోకి రావాడనికి అందరు గళాన్ని వినిపించాలని, నిజాలు చెప్పాలని తాము నిర్ణయం తీసుకున్నామని ఖర్గే పేర్కొన్నారు.

పదేళ్ల తరువాత జమ్ము కశ్మీర్‌లో ఎన్నికల ప్రచారం

జుమ్మ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బుధవారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. పదేళ్ల తరువాత ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనుంది. అందులో భాగంగా బుధవారం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రంబాన్, అనంతనాగ్ జిల్లాలో జరిగే రెండు ర్యాలీల్లో పాల్గొననున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తరుపున ప్రచారం చేసేందుకు ఈ ర్యాలీను నిర్వహిస్తున్నారు. రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రాతో సహ 40 మంది స్టార్ క్యాంపెనీర్లు మూడు విడతలుగా జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు జమ్ము కశ్మీర్ పిసిసి చీఫ్ తారిక్ అహ్మద్ కర్రా మీడియాకు వెల్లడించారు. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత తొలిసారిగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తు కుదుర్చుకున్నాయి. కాగా, కర్రా, రాహుల్ గాంధీ బుధవారం ఢిల్లీ నుంచి జమ్ముకు విచ్చేయనున్నారు.

ఖర్గే, రాహుల్‌తో జార్ఖండ్ సిఎం భేటీ

న్యూఢిల్లీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై చర్చించారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ జెఎంఎంకు రాజీనామా చేసిన బిజెపిలో చేరిన నేపథ్యంలో హేమంత్ సోరెన్ కాంగ్రెస్ చీఫ్‌తో సమావేశమయ్యారు. సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, సోరెన్ భార్య కల్పన సోరెన్ కూడా హాజరయ్యారు. కాగా మర్యాదపూర్వకంగానే తాము కాంగ్రెస్ నేతలతో భేటీ అయినట్లు సోరెన్ చెప్పారు. ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలపై చర్చించామన్నారు.

జూనియర్ డాక్టర్ల నిరసన గళం

కోల్‌కతా : ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ట్రైనీ మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటన అనంతరం జూనియర్ డాక్టర్ల నిరసనలు నిరవధికంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కేసు దర్యాప్తు, సంఘటన అనంతరం ఆర్‌జి కర్ హాస్పిటల్‌లో విధ్వంసాన్ని నిరోధించడంలో పూర్తిగా వైఫల్యం చెందిన కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ జూనియర్ డాక్టర్లు నిర్వహించిన ప్రదర్శనను మంగళవారం కూడా నిలిపివేశారు. సోమవారం నాటి నుంచి మంగళవారం వరకూ కోల్‌కతా పోలీసుల నుంచి జూనియర్ డాక్టర్ల ర్యాలీకి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన జూనియర్ డాక్టర్లు సోమవారం మధ్యా హ్నం 2గంటలకు లాల్‌బజార్‌లోని కోల్‌కతా పో లీస్ హెడ్‌క్వార్టర్స్ వద్దకు ప్రదర్శనను ఆరంభించా రు. నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే వారిని బిబి.గంగూలీ స్ట్రీట్ వద్దనే నిలిపివేశారు. ఆగ్రహించిన ఆందోళనకారులు ఆ రోజు రాత్రి అంతా అక్కడే బైఠాయించారు. పోలీసుల తీరును ఆక్షేపిస్తూ జూనియర్ డాక్టర్లు పోలీస్ కమిషనర్ గోయల్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హత్యాచారానికి గురైన ట్రైనీ మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలని, వైద్యులు అందరికీ రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద గు లాబీ పూలను పెట్టారు. పోలీస్ బలగాల డ్యూటీ పౌరులను రక్షించడానికి మాత్రమే అనే అర్థం వచ్చేలా గులాబీలను బాలికేడ్ల వద్ద ప్రదర్శించా రు.'ఇది మా ప్రణాళికలో భాగం కానే కాదు. కోల్‌కతా పోలీసులు మా ప్రదర్శనను నిలిపివేసేందుకు 9అడుగుల ఎత్తైన బారికేడ్లు ఏర్పాటు చేస్తారని మాకు తెలియదు. లాల్‌బజార్‌లో నగర పోలీస్ క మిషనర్ ను కలుసుకునేంతవరకూ మా ఆందోళన కొనసాగుతుంది. అప్పటివరకూ మేం ఇక్కడే బైఠాయిస్తాం' జూనియర్ డాక్టర్ తెలిపారు. అని పరిస్థి తి అదుపులోకి రాకపోవడంతో కోల్‌కతా నగర మూడవ అదనపు పోలీస్ కమిషనర్ సంతోష్ పాండే కొంతమంది పోలీస్ అధికారులు, బలగాల తో సంఘటనా స్థలం వద్దకు చేరుకుని జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపారు. అయితే, తిరిగి 24 గంటల తర్వాత మంగళవారం జూనియర్ డాక్టర్ల ప్రదర్శన కోల్‌కతా పోలీస్ కేంద్ర కార్యాలయం వద్దకు వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. అక్కడ ఏర్పాటుచేసిన భారీ బారికేడ్ల ను పోలీసులు తొలగించివేశారు. దీంతో జూనియ ర్ డాక్టర్ల ప్రదర్శన బిబి.గంగూలీ స్ట్రీట్ నుంచి ప్రా రంభమై బెంటింక్ స్ట్రీట్‌కు చేరుకునేందుకు ముందుకు సాగింది. అనుమతి ఇచ్చినప్పటికీ మళ్లీ జూనియర్‌డాక్టర్ల ప్రదర్శన ముందుకు సాగకుండా భారీసంఖ్యలో అక్కడ మోహరించిన పోలీసులు మానవహారంగా ఏర్పడ్డారు. కోల్‌కతా నగర పో లీస్ కమిషనర్ వినీత్ గోయల్ వద్దకు కొందరు సీ నియర్ పోలీస్ ఉన్నతాధికారులు తోడుగా కొంతమంది జూనియర్ డాక్టర్ల ప్రతినిధి బృందం మా త్రమే కలుసుకునేందుకు అనుమతిస్తున్నట్లు తెలియజేశారు. 'మేం ప్రశాంతంగా ర్యాలీని చేపట్టాం. మేం అందరం కలిసికట్టుగా బెంటింక్ స్ట్రీట్ వద్దకు ప్రదర్శన ను ప్రారంభించాం.

జీతం కంటే ఎక్కువగా విరమణ ప్రయోజనాలుంటాయా?

న్యూఢిల్లీ : సెబి చీఫ్ మాధవి పురి బుచ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది.మాధవికి తాము ఎలాంటి వేతనమూ చెల్లించడం లేదంటూ ఐ సిఐసిఐ బ్యాంక్ ఇచ్చిన వివరణపై మరిన్ని ప్రశ్నలను సంధించింది. ఆమెకు పదవీ విరమణ ప్రయోజనాలు మాత్రమే చెల్లిస్తున్నామని చెబుతున్న బ్యాంక్.. ఆ మొత్తం జీతం కంటే ఎక్కువ ఎలా ఉంటుందని ప్రశ్నించింది. మధ్యలో ఏడాది పాటు ఎ లాంటి ప్రయోజనాలు ఇవ్వకపోవడాన్నీ నిలదీసింది. సెబి చీఫ్‌గా బాధ్యతలు చేప ట్టిన తర్వాత కూడా మాధవీ పురి బుచ్‌కు ఐసిఐసిఐ బ్యాంకు నుంచి జీతభత్యాలు అందుతున్నాయంటూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. 2017లో ఆమె సెబీలో చేరినప్పటి నుంచి, ఇప్పటివరకు ఐసిఐసిఐ బ్యాంకు అధికా రి హోదాలో రూ.16.08 కోట్లు అందుకున్నారని, ఇదే కాలంలో సెబీ నుంచి ఆమె కు అందింది కేవలం రూ.3.3 కోట్లని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేడా ఆరోపించారు. దీనిపై స్పందించిన ఐసిఐసిఐ బ్యాంక్.. తాము ఎంలాంటి వేతనం చెల్లించడం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో పవన్‌ఖేడా మంగళవారం మరోసారి మీడియా సమావేశం నిర్వహించారు. మాధవికి చెల్లిస్తోంది కేవలం పదవీ విరమణ ప్రయోజనాలే అని బ్యాంక్ చెప్తోందని, మరి ఆ మొత్తం ఎందుకు జీతం కంటే ఎక్కువ ఉందని పవన్ ఖేడా ప్రశ్నించారు. 'ఆమె పదవీ విరమణ చేసిన అనంతరం 2014 –15లో ఐసిఐసిఐ బ్యాంక్ పదవీ విరమణ ప్రయోజనాల్లో భాగంగా రూ.5.03 కో ట్లు చెల్లించారు. మధ్యలో 2015–2016లో ఎందుకు చెల్లించలేదు? మళ్లీ 2016 నుంచి 2021 వరకు మాత్రమే ఎందుకు చెల్లింపులు చేపట్టారు?'' అని ప్రశ్నిం చారు. 2007 నుంచి 2013–14 వరకు ఆమె సగటు వేతనం రూ.1.3 కోట్లు కాగా 2016–17 నుంచి 2020–21 వరకు ఆమెకు పదవీ విరమణ ప్రయోజనాల కింద సగటున ఏటా రూ.2.77 కోట్లు ఎలా చెల్లించారని, జీతం కంటే ప్రయోజనాలు ఎక్కడైనా ఎక్కువ ఉంటాయా? అని నిలదీశారు. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వాళ్లు ఎంప్లాయా స్టాక్ ఆప్షన్లను 10 ఏళ్ల వరకు ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ సోమవారం తన వివరణలో పేర్కొంది. మరి అదే బ్యాంక్.. అమెరికా సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమర్పించిన ఎసాప్స్ పాలసీలో మూడు నెలలే అని ఎందుకు పేర్కొంది? అని ప్రశ్నించారు. ఒకవేళ

స్మగ్లర్‌గా భావించి కాల్పులు

చండీగఢ్: ఓ విద్యార్థిని పశువుల స్మగ్లర్‌గా భావించి గో సంరక్షకులు కాల్పులు జరపడంతో అతడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... ఆగస్టు 23న హర్యానాలోని ఫరీదాబాద్‌లో కొందరు పశువుల స్మగ్లర్లు రెనాల్ట్ డస్టర్, టయోటా ఫార్చ్యూనర్ కార్లలో నగరంలోకి ప్రవేశించినట్లు గో సంరక్షకులకు సమాచారం అందింది. అదే సమయంలో 12వ తరగతి చదువుతున్న ఆర్యన్ మిశ్రా, అతడి స్నేహితులు హర్షిత్, శాంకీ, మరికొందరు పటేల్ చౌక్ వద్ద డస్టర్ కారులో వెళ్తుండగా గోసంరక్షకులు వారిని పశువుల స్మగ్లర్లుగా భావించి, దాదాపు 30 కి.మీ.లు వెంబడించారు. కారు ఆపమని పలుమార్లు వారిని అడిగారు. అయితే ఆర్యన్ స్నేహితుడు శాంకీకి, ఇతరులకు మధ్య గొడవలు ఉండటంతో వారే తమను చంపడానికి రౌడీలను పంపారని భావించిన విద్యార్థులు కారును ఆపకుండా వెళ్లిపోయారు. వారు ఆగకపోవడంతో గో సంరక్షకులు కారుపై కాల్పులు జరిపారు. దీంతో వెనక సీట్లో కూర్చున్న ఆర్యన్ మెడలోకి బుల్లెట్ దూసుకుపోయింది. విద్యార్థులు వెంటనే కారును ఆపారు. అనంతరం వారు విద్యార్థిపై మళ్లీ కాల్పులు జరిపారు. వెనక సీటులో ఇద్దరు విద్యార్థినులు ఉండటం చూసిన గో సంరక్షకులు తాము కాల్పులు జరిపింది స్మగ్లర్లపై కాదని గుర్తించి, అక్కడినుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆర్యన్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరునాడు మరణించాడు. విద్యార్థిపై కాల్పులకు పాల్పడిన గోసంరక్షక బృందానికి చెందిన ఐదుగురిని అరెస్టు చేశామని పోలీసులు తాజాగా మీడియాకు వెల్లడించడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితులపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని, తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. ఘటనలో ఉపయోగించిన తుపాకీ కూడా చట్టవిరుద్ధంగా పొందినదేనని వెల్లడించారు.

డ్రోన్ దాడులు ఉగ్రవాద చర్యే

ప్రతీకారం చేస్తాం మణిపూర్ ముఖ్యమంత్రి బైరెన్ సింగ్



ఇంఫాల్ : మణిపూర్‌లో పౌర నివాసిత ప్రాంతాలపై డ్రోన్ దాడులన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బైరెన్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారంనాడు, సోమవారంనాడు వరుసగా మణిపూర్‌లో డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇద్దరు మరణించగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనలను ప్రజలపై ఉగ్రవాదులు చేసిన దాడులుగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఉగ్రవాదులు చేసిన ఈ దాడులకు ప్రతీకార చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరిక చేశారు. ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ఈ మేరకు స్పందించారు. ''డ్రోన్‌ల ద్వారా బాంబులు నివాసిత ప్రాంతాలపై వేయడం, దాడులు, తుపాకీ కాల్పులు జరపడం ఉగ్రవాదుల చర్యలేనన్నారు. భద్రతా దళాలపై కూడా ఉగ్రవాదులు డ్రోన్లు ప్రయోగిస్తున్నారన్నారు. కౌట్రక్, సెంజామ్‌లో రెండు రోజులపాటు వరుసగా డ్రోన్‌ల ద్వారా బాంబుదాడులు జరిగాయి. మొత్తం దాడుల్లో ఇద్దరు మరణించగా మరో 12 మంది గాయపడ్డారు. ఏవిధమైన రెచ్చగొట్టే చర్యలూ లేకుండా ఉగ్రవాదులు డ్రోన్ దాడులు చేస్తున్నారనీ, ఈ విధమైన ఉగ్రవాదంపై నిర్ణయాత్మకమైన పోరాటం చేస్తామన్నారు. అమాయకులైన దేశీయ వాసులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ''అన్ని రూపాలలో జరిగే హింసను మేం వ్యతిరేకిస్తున్నాం, మణిపూర్ ప్రజలు ఈ దారుణాలకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాలి, ఈ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా నిలబడాలి'' అని పిలుపు ఇచ్చారు. మణిపూర్ రాష్ట్రంలో మొదటిసారి ఈ విధంగా హైటెక్ పద్ధతుల్లో హైటెక్ ఆయుధాలతో దాడులు ప్రారంభమయ్యాయి. తొలుత డ్రోన్‌లను ఉగ్రవాదుల కదలికలను కనిపెట్టడం కోసం, పోరాటాలుచేసే గ్రూపులపై నిఘా కోసం ఉపయోగించేవారు, కానీ ఇప్పుడు ఉగ్రవాదులే భద్రతా దళాలపై డ్రోన్లు ఉపయోగిస్తున్నారన్నారు. గతంలో సాయుధులు పెద్ద ఎత్తున అనేక ప్రాంతాలలో గుమిగూడి దాడులు చేసేవారు, ఇప్పుడు డ్రోన్ల ద్వారా దాడులు చేస్తున్నారు ఈ విషయం తెలియగానే ఐజిపి, డిఐజి, ఎస్‌పి హోదాల్లో ఉన్న అధికారులు, ఇతర పోలీసు బలగాలు ఆ ప్రాంతాలకు తక్షణం తరలివెళ్ళి పరిస్థితిని అంచనావేశాయి. అన్ని జిల్లాలోనూ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా, మణిపూర్‌లో ఉగ్రవాదులు డ్రోన్లను ఉపయోగించడంపై సమీక్ష చేసేందుకుగాను మణిపూర్ పోలీసులు ఐదుగురు సభ్యులతో ఒక ఉన్నతస్థాయి పరిశీలనా కమిటీని నియమించారు.

డ్రోన్ దాడిలో ముగ్గురికి గాయాలు

మణిపూర్‌లో జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు గాయపడ్డారు. రాజధాని ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో సోమవారంనాడు సాయంత్రం 6.20 గంటలకు బాంబుదాడులు చేసేందుకు డ్రోన్ ఉపయోగించారు. ఒక నివాసిత ప్రాంతంపై జరిగిన ఈ దాడిలో ఒక మహిళ సహా మరో ఇద్దరు గాయపడ్డారని పోలీసులు మంగళవారంనాడు చెప్పారు. సెంజామ్ ఛిరాంగ్ ప్రాంతంలోని ఒక నివాసంలో ఐరన్ రూఫ్ షీట్లను చీల్చుకు వచ్చిన డ్రోన్ బాంబు దాడివల్ల మహిళ గాయపడింది. గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చారు. అతి ఎత్తైన కాంగ్‌పోక్పీ పర్వత ప్రాంతాల నుండి పల్లపుప్రాంతంలో ఉన్న సెజామ్‌ఛిరాంగ్ గ్రామంపై కూడా ఉగ్రవాదులు ఇష్టానుసారంగా కాల్పులు జరిపారు. దీంతో భద్రతా దళాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయని అధికారులు చెప్పారు. ఆదివారంనాడు ఇదేవిధంగా జరిగిన డ్రోన్ బాంబు దాడి, తుపాకీ కాల్పుల్లో ఇద్దరు మరణించిన కౌట్రక్‌కు ఈ తాజా డ్రోన్ దాడి ప్రాంతం మూడు కి.మీ దూరంలో ఉంది. ఇదిలా ఉండగా పోలీసుల సమాచారం ప్రకారం, కాంగోక్పీ జిల్లాలోని ఖరమ్ వైఫెన్ గ్రామం సమీపంలో జరిపిన గాలింపు చర్యల్లో ఒక డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రైఫిళ్ళు, తొమ్మిది మోర్టార్ బ్యారల్స్, జిలెటిన్ స్టిక్స్, మరో 30 డెటొనేటర్లు, రెండు దేశీయ రాకెట్లు, ఇతర ఆయుధ సామాగ్రి కూడా స్వాధీనం చేసుకున్నారు.

దేశాలు చుట్టబెట్టే మోదీ మణిపూర్‌లో ఎప్పుడు పర్యటిస్తారు? కాంగ్రెస్ ప్రశ్న



న్యూఢిల్లీ : తరచు ప్రపంచ దేశాలను చుట్టబెట్టి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్లోలం చెలరేగిన మణిపూర్ రాష్ట్రంలో ఎప్పుడు మానవతావాదంతో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని కాంగ్రెస్‌పార్టీ ప్రశ్నించింది. నరేంద్ర మోదీ మంగళవారం నుండి బ్రూనే, సింగపూర్ దేశాలలో పర్యటిస్తున్న సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా మంగళవారంనాడు ఒక ప్రకటన చేస్తూ, నరేంద్ర మోదీ ఇంకెప్పుడు మానతావాదంతో మణిపూర్‌లో పర్యటిస్తారని ప్రశ్నించారు. బ్రూనే సుల్తాన్ హస్సనల్ బోల్కైహ్ ఆహ్వానం మేరకు ఆ దేశంలో పర్యటించేందుకు మోదీ వెళ్ళారు. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలను ప్రస్తుతం ఉన్న రంగాలలో మరింత పటిష్టం చేసుకోవడం ఈ పర్యటన ఉద్దేశం. తర్వాత నాలుగూ, ఐదూ తేదీలలో సింగపూర్‌లో పర్యటిస్తారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకు ఆయన ఆ దేశంలో పర్యటిస్తారు. బ్రూనేలో చరిత్రాత్మక పర్యటన చేయడానికి దైవాంశసంభూతుడైన ప్రధానమంత్రికి ఏం తొందరొచ్చింది? తరచు దేశాలు చుట్టబెట్టివచ్చే ప్రధానమంత్రి తీవ్ర కష్టాల్లో ఉన్న మణిపూర్ ప్రజలను ఎప్పుడు పలుకరిస్తారని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. మణిపూర్‌లో పరిస్థితులు రోజు రోజుకూ మరింత దిగజారుతున్నాయని, ఉద్రిక్తంగా మారాయనీ, అక్కడి ముఖ్యమంత్రి బైరెన్ సింగ్ చెప్పినదానికంటే పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయని ఆయన అన్నారు. ''మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు, కల్లోలం, హత్యాచారాలు, గృహదహనాలు ప్రారంభమై 'స రిగ్గా సెప్టెంబరు మూడో తేదీనాటికి 16 నెలలు పూర్తయింది, వందలమంది ఈ హింసలో మరణించారు. వేలాదిమంది ఇళ్ళు వదిలిపారిపోయారు, వారంతా సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు'' అని రమేశ్ పోస్టింగ్ పెట్టారు. ఇన్నాళ్ళు గడచినప్పటికీ మణిపూర్‌లో పర్యటించడానికి ప్రధానమంత్రికి సమయం దొరకలేదనీ, కానీ తరచు ఆయన అనేక దేశాలు చుట్టబెట్టి వస్తున్నారని ఆయన విమర్శించారు. మణిపూర్ వెళ్ళి అక్కడి రాజకీయ పార్టీలతో సమావేశం జరపడానికిగానీ, అక్కడి పౌర సమాజ గ్రూపులతో భేటీ వేసేందుకుగానీ, ఆ రాష్ట్రంలో పర్యటించడానికిగానీ ఆయన తీరిక దొరకలేదు'' అని విమర్శించారు. చర్చలకు ఏ మాత్రం అనుకూలంగాలేని హింసాత్మక వాతావరణం నెలకున్న రాష్ట్రంలో పరిస్థితుల రీత్యా మైతీ, కుకీ, జోమి వర్గాలమధ్య ఉన్న అంతరాలను తొలగించేందుకు చర్చలకోసం ముఖ్యమంత్రి బైరెన్‌సింగ్ ఒక రహస్య ప్రతినిధిని నియమించారని వచ్చిన వార్తలను కూడా జైరామ్ రమేశ్ ప్రస్తావించి విమర్శలు చేశారు. ''ప్రపంచమంతా తిరుగుతూ శాంతి సందేశం ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకని స్వదేశంలోని మణిపూర్ రాష్ట్రంలో హింస నివారణకు, శాంతి స్థాపనకు కృషి చేయడం లేదు? ఎందుకు ఆ రాష్ట్రంలో పర్యటించడంలేదు? ఇదెంతో ఆశ్చర్యంగా ఉంది'' అని కాంగ్రెస్‌పార్టీ గడచిన శుక్రవారంనాడు తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ నేపథ్యంలో జైరామ్ రమేశ్ ప్రకటన చేస్తూ, మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు ముఖ్యబమంత్రి బైరెన్‌సింగ్ తన శక్తిసామర్థ్యాలను కోల్పోయారనీ, ఆయన హయాంలో పరిస్థితులు ఏ మాత్రం చక్కబడే అవకాశం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి బైరెన్ సింగ్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూను గుర్తు చేశారు. ప్రధానమంత్రి సహాయతో, కేంద్రం సలహాలతో మణిపూర్‌లో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో శాంతి స్థాపిస్తామని, హింసను అరికడతామని బైరెన్‌సింగ్ చెప్పారనీ, ఇప్పటివరకూ అక్కడి పరిస్థితులు చక్కబడలేదని జైరామ్ రమేశ్ విమర్శించారు. గత ఏడాది మే నెలారంభంలో మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమైంది. మైతీ, కుకీల మధ్య ఘర్షణల్లో 200 మందికిపైగా మరణించారు. అనేకమంది మహిళలు హత్యలకు, అత్యాచారాలకు గురయ్యారు. వందలాది గృహాలు దహనమయ్యాయి.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, సెప్టెంబరు 04

ఇది జాతీయ విపత్తు

శనివారం నుండి సోమవారం వరకు రెండు తెలుగు రాష్ట్రాలను గజగజ వణికించిన వర్ష బీభత్సం పదుల లక్షలమంది ప్రజలకు ఓ పీడకల. విస్తారమైన ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షం నదీనదాలను ఏకం చేసింది; పచ్చని పంటచేలను, జనావాసాలను జలదిగ్బంధం చేసింది. ఆ క్రమంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేసింది. సోమవారంనుంచి వర్షం తెరిపిఇవ్వటం, మంగళవారం ఉదయానికి జల ప్రవాహ ఉధృతి నెమ్మదించటంతో ఈ ప్రకృతి విలయం కలుగజేసిన కష్టనష్టాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 20మంది, తెలంగాణలో 16మంది అకాల మృత్యుఘాతానికి బలియైనారు. వేలసంఖ్యలో పశువులు, జీవాలు, కోళ్లు మరణించాయి. వందల సంఖ్యలో చెరువులు కట్టలు తెంచుకుని ఊళ్లమీదపడ్డాయి. నాగార్జునసాగర్ ఎడమకాల్వకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురం గ్రామంవద్ద ఆదివారం ఉదయం పెద్ద గండిపడి 300 ఎకరాల్లో వరిపైరు నాశనమైంది.

ఎన్టీఆర్ జిల్లా అయితవరం వద్ద జాతీయ రహదారిపై ప్రవాహం తగ్గి విజయవాడ–హైదరాబాద్ మధ్య వాహన రవాణా పునఃప్రారంభం కాగా, గరికపాడు వద్ద రెండు రోడ్డు మార్గాల్లో ఒకదానిపై వంతెన కొంతమేర కూలిపోయింది. ఒక వంతెనపైగా లైట్ వెహికల్స్‌ను అనుమతిస్తున్నారు. రైలుమార్గాలు దెబ్బతినటంతో కొండపల్లి–రాయనపాడు మధ్య, మహబూబాబాద్ జిల్లా నెక్కొండ వద్ద నిలిచిపోయిన రైళ్లలోని దాదాపు 10వేలమంది ప్రయాణీకులను బస్సులు ఏర్పాటు చేసి అటు విజయవాడ, ఇటు ఖాజీపేట చేర్చి అక్కడనుండి ప్రత్యేక రైళ్లలో విశాఖ, చెన్నై, బెంగళూరులకు పంపటంలో దక్షిణమధ్య రైల్వే అధికారులు శ్లాఘనీయమైన కృషి చేశారు. ఇంటకన్నె–కేసముద్రం సెక్షన్‌లో ఆరుచోట్ల రైల్వేట్రాక్‌కు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికపై పూడ్చి రాకపోకల పునరుద్ధరణకు శ్రమిస్తున్నారు. ఇక చెరువులకు గండ్లు, కొట్టుకుపోయిన రహదారులు, కూలిన విద్యుత్ స్తంభాలు, కూలిన ఇళ్లు, పశునష్టం నీరుతీసిన తర్వాత లెక్కలు తీస్తేగాని అపారనష్టం పూర్తిగా అంతుపట్టదు. పబ్లిక్ ఆస్తుల ధ్వంసానికి ఇవి మచ్చుతునకలు. ప్రైవేటు ఆస్తుల నష్టాలు అపారం.

అటు నాగార్జునసాగర్ నుండి కృష్ణానదీ ప్రవాహం, ఇటు ఉప్పొంగిన మున్నేరు, పాలేరు, బుడమేరు నదుల ఉధృతికి ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాలలోని ప్రాంతాలు కకావికలైనాయి. పైనుంచి వచ్చే నీరు పూర్తిగా తీసేవరకు లక్షలాది ప్రజలను ఆదుకోవటానికి చంద్రబాబునాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. లారీలు, ట్రాక్టర్లకుతోడు బోట్లు, హెలికాప్టర్లు, డ్రోన్‌లు ఉపయోగించి ప్రజలకు ఆహారం, పాలు, నీరు, బిస్కెట్లు, మందులు అందిస్తున్నారు.

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో మంత్రులు, అధికారులు రంగంలోకి దిగి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబబాద్, తదితర జిల్లాల్లో సహాయక చర్యలను వేగవంతం చేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణ సహాయం అందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. ఆయన స్వయంగా పర్యటించాలని కోరారు. ఇదిలావుండగా, తెలంగాణలో నష్టం తాత్కాలిక అంచనా ప్రకారం రూ.5438 కోట్లుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, మృతిచెందిన పాడిపశువులకు రూ.50వేలు, గొర్రెలు, మేకలకు రూ.5వేలు ప్రకటించారు. పంట నష్టానికిగాను ఎకరాకు రూ.10వేలు, వరద బాధిత కుటుంబానికి రూ.10వేల చొప్పున తాత్కాలిక భృతి ప్రకటించారు.

ఈ విపత్తు నష్టాలను పూడ్చటం రాష్ట్ర ప్రభుత్వాల శక్తికి మించిన పని. 276 లక్షలమంది వరద బాధితులుగా అంచనా. ప్రజలతో పాటు ప్రభుత్వ ఆస్తులకు ముఖ్యంగా రహదారులు, చెరువులు ఇతర ఇరిగేషన్ వసతులకు జరిగిన నష్టం అపారం. అందువల్ల ఈ జలవిలయాన్ని ప్రధానమంత్రి జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవటం అవసరం.

ఆమ్ ఆద్మీ పార్టీ తెరపైకి సునీతా కేజ్రీవాల్

కల్యాణీ శంకర్

రాజకీయాలకు దూరంగా అణగి మణగి ఉంటోంది ని అందరూ భావిస్తున్న సునీతా కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీపార్టీలో ఢిల్లీ రాష్ట్రముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ప్రత్యామ్నాయంగా అందరి ఆమోదం పొందిన నాయకురాలుగా రూపుదిద్దుకుంటున్నారా? ప్రత్యేకించి భర్త అరవింద్ కేజ్రీవాల్ మద్యం అవినీతి కేసులో ఈ ఏడాది మార్చి 21 నుండి తీహార్ జైలులో ఉంటున్నప్పటి నుండి సునీతా కేజ్రీవాల్ అటు పార్టీకి, ఇటు తన భర్తకు మధ్య ఒక వారధిలాగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధంగా ఆమె తన శక్తిసామర్థ్యాలను రుజువు చేసుకోవడానికి ఒక మంచి అవకాశం లభించింది. ఐతే అరవింద్ కేజ్రీవాల్ బెయిలుపై విడుదలైన తర్వాత కూడా పార్టీ కోసం ఆమె ఇదే విధంగా పనిచేయడం కొనసాగిస్తారా? లేదా? అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు.

రాజకీయ కుటుంబాలకు చెందిన మహిళలు తమ బంధువులకు ఒక ప్రత్యామ్నాయంగా దేశ రాజకీయాల్లోకి ప్రవేశించడం తరచుగా జరుగుతున్నదే. ఇందుకు అత్యంత విజయవంతమైన ఉదాహరణ సోనియాగాంధీయే. తర్వాత రబ్రీదేవి కూడా ముఖ్యమంత్రిగా రాజకీయరంగ ప్రవేశం చేశారు. బీహార్ మాజీముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పశుదాణా అవినీతి కేసులో జైలుపాలైన తర్వాత ఆయన భార్య రబ్రీదేవి 2000 సంవత్సరం నుండీ 2005 వరకూ ముఖ్యమంత్రి పదవి నిర్వహించారు. ఐతే ఆమె తన భర్త తరపున కేవలం ఒక రబ్బరు స్టాంపులాగా మాత్రమే పనిచేశారు. ఆమె రాజకీయాలపై అవగాహనలేని అనుభవ శూన్యురాలు. కానీ సునీతా కేజ్రీవాల్ మాత్రం అలా కాదు. ఆమె ఆదాయపన్నుశాఖ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటిఎటి) కమిషనర్‌గా 22 సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహించి గృహిణి బాధ్యతలకు అతీతంగా ఇప్పటికే తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకున్నారు. సునీత తన భర్తకు మద్దతుగా ఉంటూనే తెరవెనుక ఉండిపోయారు. ఆమెకు 'అనుభవ సంపద' అపారంగా ఉంది. భర్తపై అవినీతి ఆరోపణలు వచ్చిన తర్వాత ఒక రాజకీయ నాయకురాలుగా, పార్టీ కార్యకర్తగా మారారు. ఆమె నోరు మెదపకుండా తెరవెనుకే ఉండి పనిచేశారు. కేజ్రీవాల్ కూడా ఒక కుటుంబ వ్యక్తిగా తన భార్యతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు.

సిఎం పదవికి అడుగు దూరంలో సునీత! షికారు చేస్తున్న పుకార్లు

ఆమ్ ఆద్మీ పార్టీలో సునీతా కేజ్రీవాల్ భాగస్వామ్యం, జోక్యం పెరిగింది. ప్రత్యేకించి కేజ్రీవాల్ జైలుకు వెళ్ళిన తర్వాత ఆమె చిత్తశుద్ధితో, కృతనిశ్చయంతో పనిచేశారు. మనదేశంలో అవినీతి ఆరోపణలపై అరెస్టయిన తర్వాత కూడా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకుండా పదవిలో కొనసాగుతున్న ఏకైక ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక్కరే. ఐతే కేజ్రీవాల్ గనుక తన పదవికి రాజీనామా చేస్తే సునీతా కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపడతారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రెండో విషయం ఏమిటంటే ఆమె నాయకత్వం ఈ సమయంలో ఎంతో కీలకమైనది. ఎందుకంటే ఆమ్ ఆద్మీపార్టీ పీకలోతుల్లో సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు ఆమె పార్టీలోకి రంగప్రవేశం చేశారు. ఈ సెప్టెంబరునెలలో హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీకి 2025 జనవరి నెలలో ఎన్నికలు జరుగుతాయి. ఆ పార్టీలో ఎంతోమంది సీనియర్ నాయకులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్ళకు కేజ్రీవాల్ అరెస్టుకూడా తోడైంది. కేంద్ర ప్రభుత్వం ఆయన ప్రభుత్వాన్ని రద్దు చేయకుండా రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా పరిపాలన కొనసాగించడానికి పెద్ద అవకాశం ఇచ్చింది.

కేజ్రీవాల్ జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత పార్టీలో సునీతా కేజ్రీవాల్ పాత్ర ముగిసిపోతుందని కేజ్రీవాల్ తర్వాత ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన మనీశ్ సిసోడియా చెప్పారు. మద్యం అవినీతి కేసులో గత ఏడాది మనీశ్ సిసోడియా కూడా అరెస్టయ్యారు. ఐతే కేజ్రీవాల్ సందేశాలను పార్టీకి, ప్రభుత్వానికి మోసుకెళ్ళే ఒక మెసెంజర్‌గా సునీతా కేజ్రీవాల్ పాత్ర ఇప్పటికీ ఇంకా పెరుగుతోందనీ ఎంపి సంజయ్ సింగ్ అన్నారు. కానీ కేజ్రీవాల్ మాత్రం తన భార్య సునీతకు రాజకీయాలంటే ఇష్టం లేదని చెబుతున్నారు. పార్టీలో రోజురోజుకూ పెరుగుతున్న ఆమె ప్రభావం, జోక్యం చూస్తే బహుశా కేజ్రీవాల్ స్థానం ఆక్రమించేందుకు ఇంకా ఒక అడుగుదూరంలో మాత్రమే ఆమె ఉన్నారని అనిపిస్తోంది. ఆమెను పక్కకు నెట్టడం కూడా ఒక సవాలు కాగలదు. కేజ్రీవాల్ జైలు నుండి బైయిలుపై తిరిగివచ్చి వెళ్ళిన తర్వాత కూడా పార్టీలో సునీత పాత్ర ప్రముఖంగానే ఉంది. ఇక నాలుగో విషయం ఏమిటంటే, హర్యానా, ఢిల్లీ అసెంబ్లీలకు ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆమ్ ఆద్మీపార్టీ నాయకత్వ సమస్యను ఎదుర్కొంటున్నది. ఆ పార్టీకి ఒక విశ్వసనీయమైన నాయకత్వంతోపాటు బ్రహ్మాండంగా ప్రజల్లో ప్రచారం చేయగల ఒక నాయకుడు కావాలి. సునీతా ఇప్పటికే ఒక మంచి ప్రచారకురాలుగా ఎదిగారు. మహిళల్లో ఆమెకు పాపులారిటీ వచ్చింది. ఆమె మంచి వక్త కూడా.

తన భార్య సునీతకు రాజకీయాలంటే ఇష్టం లేదని కేజ్రీవాల్ చెబుతున్నారు. పార్టీలో రోజురోజుకూ పెరుగుతున్న ఆమె ప్రభావం, జోక్యం చూస్తే బహుశా కేజ్రీవాల్ స్థానం ఆక్రమించేందుకు ఇంకా ఒక అడుగుదూరంలో మాత్రమే ఆమె ఉన్నారని అనిపిస్తోంది. ఆమెను పక్కకు నెట్టడం కూడా ఒక సవాలు కాగలదు. కేజ్రీవాల్ జైలు నుండి బైయిలుపై తిరిగివచ్చి వెళ్ళిన తర్వాత కూడా పార్టీలో సునీత పాత్ర ప్రముఖంగానే ఉంది.

హర్యానా ఎన్నికల్లో వక్తగా, నాయకురాలుగా....

ఇక చెప్పుకోవలసిన ఐదో విషయం ఏమిటంటే, ఆమ్ ఆద్మీ పార్టీలో ఎలాంటి అధికారిక బాధ్యతలూ, పదవులూ లేకుండానే సునీతా కేజ్రీవాల్‌ను ఒక అనుసంధానకర్తగా పార్టీ సభ్యులు గుర్తించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె భారీ ప్రచారమే చేశారు. ఇప్పుడు హర్యానాలో ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది. మోదీ ప్రభుత్వంపైన, బిజెపి పైనా ఆమె పెద్దస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తన భర్త విశ్వసనీయతను దెబ్బతీయడంలో కొన్ని రాజకీయశక్తులు భాగస్వామ్యంగా ఉన్నాయన్నది ఆమె ప్రచారంలో ప్రధానాంశంగా ఉంది. ప్రతిపక్ష ''ఇండియా'' కూటమి కూడా పెరుగుతున్న సునీతా కేజ్రీవాల్ ప్రాధాన్యతను గుర్తించి ఆమోదం చెబుతున్నది. ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఇటీవల జరిగిన ఒక ర్యాలీలో సునీతా కేజ్రీవాల్‌ను సోనియాగాంధీ పక్కకే కూర్చోబెట్టి ఒక గౌరవనీయమైనస్థానాన్ని ఇచ్చారు. రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సునీత ''కేజ్రీవాల్ ఐదు హామీలు'' పేరుతో భారీగా ప్రచారం ప్రారంభించారు. ఉచిత విద్యుత్, ఉచితంగా వైద్య చికిత్సలు, ఉచిత విద్య, మహిళల కు నెల నెలా 1000డాలర్లు సహాయం, యువతకు ఉపాధి, ఉద్యోగాలు అనే హామీలను ఆమె ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. ఆమెలో కొన్ని ప్రతికూల అంశాలు కూడా ఉన్నాయి. కేజ్రీవాల్ రాజకీయంగా విజయవంతమైనప్పటికీ కూడా ఆమెకు రాజకీయాలపై అంతగా ఇష్టత లేదు. ఆమె పార్టీని చెక్కుచెదరకుండా కాపాడగలదా? లేదా? అనే విషయాన్ని ఇప్పటికీ ఇంకా నిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఉంది. జైలులో ఉన్న కేజ్రీవాల్ నుండి సందేశాలను బయటకు తీసుకువచ్చి కావాల్సిన వారికి చేరవేయడం, ఎన్నికల్లో ప్రచారం చేయడం అనే పరిమితుల్లోనే ఆమె ఇంకా ఉండిపోయారు. ఐతే సునీతా కేజ్రీవాల్ నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ వంటి ఇతర పార్టీల నాయకులతో కూడా సంభాషణలు చేస్తున్నారు. ఇతర అగ్రశ్రేణి పార్టీ నాయకులతో కూడా మాటలు కలుపుతున్నారు. భవిష్యత్ కూటమిపై ఆధారపడిన ఆమ్ ఆద్మీ పార్టీలో అభ్యర్థులను ఎంపిక చేయడం, కూటమి ఏర్పాటు చేయడం ఆమె వ్యూహం. తమ ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా అధిగమించడం ద్వారా మూడోసారి ఢిల్లీ అసెంబ్లీలో పాగా వేయడం లక్ష్యం .

కేజ్రీవాల్ తీహార్ జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత తన పార్టీ చెక్కుచెదరకుండా తమ నియంత్రణలోనే ఉందా? లేదా? అనే విషయాన్ని నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాజీవితంలో తన ఇమేజ్, పాపులారిటీ చెక్కు చెదరకుండా ఉందా? అనే విషయాన్ని పరిశీలించుకోవాలి. అదే విధంగా వారి పార్టీ పరిపాలిస్తున్న పంజాబ్ రాష్ట్ర రాజకీయాలపై కూడా ఆయన కన్ను వేయాల్సి ఉంది. పార్టీకి, ప్రభుత్వానికీ మధ్య అనుసంధాన వ్యవస్థ సక్రమంగా కొనసాగుతోందా? అనే విషయాన్ని కేజ్రీవాల్ బయటకు వచ్చిన తర్వాత నిర్ధారించుకోవాల్సి ఉంది. ఆయన ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. తన బృందాన్ని ఐక్యంగా ఉంచుకోవాలి. హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆమ్ ఆద్మీ పార్టీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. వాటి పైనే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది. సునీతా కేజ్రీవాల్ విజయం సాధించారా? లేదా? అనే విషయాన్ని ఈ ఎన్నికలే రుజువు చేస్తాయి.

(ఐపిఎ సర్వీస్)

కేరళ సిపిఐ(ఎం) నాయకుడు జయరాజన్ పదవీచ్యుతి

పి.శ్రీకుమరన్

సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు ఇ.పి.జయరాజన్‌ను ఎల్‌డిఎఫ్ (వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన) సమన్వయకర్త పదవి నుండి తొలగించడం ఒక అతి పెద్ద రాజకీయ పరిణామం. కేరళ రాష్ట్ర సిపిఐ(ఎం) సెక్రటేరియట్ (కార్యదర్శివర్గం) ఆగస్టు 30వ తేదీన సమావేశమై ఈ నిర్ణయం తీసుకుంది. ఎల్‌డిఎఫ్ గానీ, సిపిఐ(ఎం)గానీ అధికారికంగా ఈ వార్తను ధృవీకరించలేదు. ఐతే ఆ పార్టీ అనుకూల వార్తా ఛానల్ ''కైరాలీ టీవీ'' మినహా ఇతర ప్రముఖ ఛానళ్ళు అన్నీ ఈ వార్తను ప్రముఖంగా ప్రసారం చేశాయి. జయరాజన్ స్థానంలో కేరళ కార్మికశాఖ మాజీ మంత్రి, సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు టి.ఆర్.రామకృష్ణన్‌ను ఎల్‌డిఎఫ్ కన్వీనర్‌గా నియమించారు. వివాదాలకు జయరాజన్ కొత్తవాడేమీ కాదన్న విషయం కేరళలో బహిరంగ రహస్యం. కానీ కేరళ రాష్ట్ర బిజెపి ఇన్‌ఛార్జి, ఆ పార్టీ నాయకుడు ప్రకాశ్ జవదేకర్‌తో జయరాజన్ సమావేశం జరిపిన చివరిఘట్టం దేన్ని రుజువు చేసింది? ఈ సమావేశానికి ముందుగానే జయరాజన్ తన పార్టీ అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉంది లేదా అనుమతి తీసుకుని ఉండాల్సింది. దాన్ని గురించి పార్టీకి ముందే చెప్పాల్సి ఉంది. కానీ ఆయన ఎంచుకున్న కారణాలను బట్టి ఆయన సిపిఐ(ఎం)కు ముందుగాపే మాత్రం సమాచారం చెప్పలేదు. ఈ సమావేశం వల్ల జయరాజన్ రాజకీయ చర్యల గురించిన ఊహాగానాలు మాత్రం మిన్నంటాయి. లోక్‌సభ ఎన్నికలకు ఓటింగ్ జరిగే రోజున ఆయన జవదేకర్‌తో సమావేశం జరిగినట్లు అంగీకరించడం ఎల్‌డిఎఫ్‌కు, సిపిఐ(ఎం)కు దిగ్భ్రాంతి కలగజేసింది. ఈ దౌర్భాగ్య, దుష్ట ఆలోచనలతో కూడిన ఆయన నిర్ణయం అటు సిపిఐ(ఎం)కూ, ఇటు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికీ కూడా తీవ్ర సంకటం తెచ్చిపెట్టింది. పార్టీ నాయకత్వాన్ని ఇరకాటంలో పడేసింది. పార్టీలో సీనియర్ నాయకుడుగా అంత ఉన్నతమైన పదవిలో ఉన్న జయరాజన్ వైపు నుండి చూస్తే ఇది చాలా తీవ్రమైన, బాధ్యతారాహిత్యమైన చర్య. రాజకీయ విమర్శకులకు పెద్ద అవకాశాన్ని ఇచ్చే చర్య. అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లో తిరువనంతపురం, అత్తింగల్, త్రిస్సూర్‌లలో బిజెపి అభ్యర్థులు ఎంతో బలమైన వారని ఆయన చెప్పినప్పుడు పార్టీలో నాయకులు విస్తుపోయి తెల్లమొఖాలేసుకుని ఉండిపోవలసి వచ్చింది.

సిపిఐ(ఎం)లో జయరాజన్‌కు 60 ఏళ్ళ అనుభవం

సిపిఐ(ఎం)లో ఇ.పి.జయరాజన్‌కు 60 సంవత్సరాల అనుభవం ఉంది. కానీ ఆయన పార్టీకి ఎప్పుడూ ఒక చిక్కు ప్రశ్నగానే ఉన్నారు. అనేక సందర్భాలలో పార్టీని ఆయన వివాదాల్లోకి నెట్టేశారు. ఈ విధమైన ఒక ఉదాహరణ చెప్పాలంటే, పినరయి విజయన్ మొదటిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు పరిశ్రమలశాఖా మంత్రిగా ఉన్న జయరాజన్ తన పదవికి రాజీనామా చేశారు. ఎందుకంటే విజయన్ బంధువు కుమారుడు, సిపిఐ(ఎం) నాయకుడు పి.కె.శ్రీమతిని కెఎస్‌ఐఇ కి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారన్న విషయం తెలియడంతో ఆయన రాజీనామా చేశారు.

క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి ఆయన అర్హుడైనప్పటికీ కూడా ఎల్‌డిఎఫ్ కన్వీనర్ పదవి నుండి జయరాజన్‌ను తొలగించడం ఒక్కటే క్రమశిక్షణాచర్య కాదు. ఎందుకంటే ఆయన సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడుగా ఉన్నందువల్ల కేంద్ర కమిటీ మాత్రమే ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోగలదు. సిపిఐ(ఎం) కేరళ రాష్ట్ర పార్టీ నాయకత్వం రాష్ట్రస్థాయిలో యనకు అప్పగించిన ఎల్‌డిఎఫ్ కన్వీనర్ పదవిని మాత్రమే వెనుక్కు తీసుకుంది. ఐతే ఈ విషయంలో ఇంతవరకూ ఇ.పి.జయరాజన్ నుండి ఎలాంటి ప్రతిస్పందనా లేదు. సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరుకాకుండానే ఆయన కన్నూర్‌లోని తన నివాసానికి తిరిగి వెళ్ళిపోయారు. ఆయనను కన్వీనర్ పదవి నుండి తొలగిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శిర్గం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర కమిటీ ఆమోదించింది. ఈ విషయంపై వ్యాఖ్యానించవలసిందిగా జయరాజన్‌పై పాత్రికేయులు ఒత్తిడి తీసుకునప్పుడు, తాను ఏదైనా చెప్పదలచుకుంటే పత్రికలకు తర్వాత తెలియజేస్తానని సమాధానం చెప్పారు.

కేరళలో ప్రతిపక్షాలు మాత్రం ఈ పరిణామాలను చూసి సంతోషంలో మునిగితేలుతున్నాయి. తమ సంతోషాన్ని దాచుకోలేక విమర్శల దాడులు చేస్తున్నాయి. ఇ.పి. జయరాజన్ ప్రస్తుత పరిస్థితిపట్ల ప్రతిపక్ష నాయకుడు తీవ్ర సానుభూతి ప్రకటించారు. సిపిఐ(ఎం) దీర్ఘకాలంగా ఆయనను నిర్లక్ష్యం చేసిందని ఆయన వాపోవడం అర్థం చేసుకోదగిన విషయం.

(ఐపిఎ సర్వీస్)

నిరంతర పోరాటాలతోనే సిపిఐ బలోపేతం

ఉజ్జిని రత్నాకరరావు
9490952646

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్వహించడం ద్వారానే పార్టీని బలోపేతం చేయాలని, పార్టీని తిరిగి పునరుత్తేజం చేయాలని అందుకు నిరంతర పోరాటాలునిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి రాజా పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర నిర్మాణ సమితి సమావేశాలు ఆగస్టు 22,23,24 తేదీలలో వరంగల్‌లో జరిగినవి. పార్టీని స్థాపించి 2024 డిసెంబర్ 26వ తేదీకి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వివిధ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి నిర్ణయించిందని వివరించారు. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో వామపక్షాలు 9 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయని వామపక్షాలకు నిరాశ కలిగించేవిగా ఉన్నప్పటికీ, మోడీ బిజెపి మెజారిటీని తగ్గించడంలో ఇండియా కూటమి కృషి చేసిందని,అయితే మరింత ఐక్యతతో సీట్ల సర్దుబాటు జరిగితే ఫలితాలు మెరుగ్గా ఉండేవని తెలిపారు. సిపిఐ రాష్ట్ర నిర్మాణ సమితి సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పార్టీ నిర్మాణాన్ని ప్రతిష్టపరుచుకొనుటకు గ్రామస్థాయి నుండి పార్టీ ప్రజా సంఘాలను నిర్మిస్తూ, వారి సమస్యలపై ఉద్యమాలు చేపడుతూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

మోడీ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత : 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది.303 స్థానాల నుండి 240 స్థాలకు బిజెపిని పరిమితం చేశారు. 2024 లోకసభ ఎన్నికల్లో సీట్లు పంపిణీ మరింత మెరుగ్గా జరిగి ఉంటే ఇండియా ఐక్య సంఘటనకు మరింత మేలైన ఫలితాలు లభించి ఉండేది. ఇండియా ఐక్య సంఘటన బలమైన శక్తిగా ఆవిర్భవించింది. నేడు 16 పార్టీల కూటమితో ఏర్పాటైనప్పటికి మోడీ నాయకత్వంలోని ఎన్డిఏ ప్రభుత్వం, హిందూమతోన్మాద ఆర్ఎస్ఎస్ విధానాలను చాప కింద నీరుగా ప్రవేశ పెడుతూ వాపక్ష పార్టీలను, మైనార్టీలను లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తుంది. బిజెపి ప్రభుత్వం దుందుడుకుగా ప్రజాస్వామ్య రహితంగా పనిచేయడం కొనసాగిస్తుంది. వీలున్నచోట్ల రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మార్పులకు ప్రయత్నాలు చేస్తుంది. అందుకు నిదర్శనమే 2024 జులై 1 నుండి కొత్త క్రిమినల్ చట్టాలను బిజెపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేస్తున్నది. నయా ఉదారవాద విధానాలను, విద్వేష రాజకీయాలను, మత, కుల ప్రాతిపదికపై ప్రజలను సమీకరణను, కార్పొరేట్ ఎజెండాను నివారించేందుకు మరింత తీవ్రంగా పోరాటాలు నిర్వహించాలి. అన్ని సెక్యులర్ ప్రజాస్వామ్య వామపక్ష శక్తులు, మన దేశ సెక్యులర్ ప్రజాస్వా మ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు నిరంతరం పోరాడాలి. ఇందుకు ఇండియా ఐక్య సంఘటన మద్దతుతో పార్లమెం టు లోపల, వెలుపల పోరాడవలసిందే. ప్రజల జీవన భృతి తదితర సమస్యలపైన స్వతంత్రంగా, వామపక్ష పార్టీలతో కలిసి సంయుక్తం గా నిరంతర పోరాటాలు చేయాలి. బిజెపి, ఆర్ఎస్ఎస్, దుష్ట పాలన కు వ్యతిరేకంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉధృత ప్రచారాన్ని నిర్వహించాలి. బిజెపిని ఓడించేందుకు ఉదారవాద బూర్జువ శక్తులను, ప్రాంతీయ పార్టీలు కలిసి ఏర్పాటు చేసుకున్న ఇండియా ఐక్య సంఘటన విశాలవేదికగా కొనసాగించాలని పార్టీ నిర్ణయించింది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు, మానవ హక్కుల కోసం కార్మికులు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులతో కలిసి స్వతంత్రంగా, ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలి. రాజ్యాంగాన్ని మార్పు చేయాలని బిజెపి పెట్టుకున్న లక్ష్యాన్ని తుత్తునియలు చేసేటందుకు ప్రజాస్వామ్య వామపక్ష శక్తులను ఐక్యం చేయటానికి కృషి చేయాలి. రానున్న రెండు సంవత్సరాల లోను బిజెపి, ఎన్డిఏ శక్తులపైన సిపిఐ, సిపిఎంలు సొంతంగా బలమైన పోరాటాలు నిర్వహించక తప్పదు. ఈ ఐక్య సంఘటన భవిష్యత్తులో మరింత బలపడేందుకు సిపిఐ గట్టిగా కృషిచేస్తుంది. కమ్యూనిస్టు ఐక్యతను విశాలమైన వామపక్ష శక్తులను బలోపేతం చేయడానికి పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చాయి.

పార్టీ పునర్నిర్మాణం వైపు ప్రయాణం:

ఆగస్టు 22–24 తేదీలలో మూడు రోజులు జరిగిన నిర్మాణ సమితి సమావేశంలో.. గ్రామస్థాయి నుండి పార్టీ, ప్రజా సంఘాల బలోపేతం చేయుటకు ముఖ్యంగా అసంఘటిత కార్మిక సంఘాలైన భవన నిర్మాణ, వ్యవసాయ, హమాలి, ఆటో తదితర రంగాలపై దృష్టి పెట్టి వాటిని బలోపేతం చేయాలి. వారి సమస్యలపైన ఆందోళన కార్యక్రమం చేపట్టాలి. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు రానున్న

దృష్ట్యా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి. అందుకు వెంటనే జిల్లా, మండల సమితి సమావేశాలు చేసి పోటీచేసే సర్పంచు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, వార్డులు గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. స్థానిక సమస్యలపై నిర్దిష్టమైన ప్రణాళిక తయారు చేసుకొని వాటి పరిష్కారం కొరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వ హామీల అమలుకు, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పార్టీ శ్రేణులు కృషిచేయాలి.

2024 డిసెంబర్ 26 నుండి పార్టీ శతవార్షికోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సందర్భాన్ని వినియోగించుకొని కమ్యూనిస్టు పార్టీ దేశంలో నిర్వహించిన చారిత్రక పాత్ర, విజయాలను క్రింది స్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. పార్టీని నిర్మాణాత్మకంగా సైద్ధాంతికంగా పునర్నిర్మాణం కోసం కృషి చేయాలని నిర్ణయించింది. నిత్యం ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ ఉండాలని నిర్ణయించబడింది. సమరశీల ఉద్యమాల నిర్మాణం ద్వారానే విస్తృత ప్రజాశ్రేణులను, వివిధ వర్గాల ప్రజలను పార్టీవైపు ఆకర్షించే కృషి ప్రారంభించాలి. ఈ క్రమంలో ఇప్పటికే రాష్ట్రంలోని 33 జిల్లాలు పార్టీ విస్తృత సమావేశాలు జరుపుతు పార్టీ నిర్మాణాన్ని చక్కదిద్ది విస్తృత ప్రజానీకంలోకి క్రియాశీలకంగా పార్టీని తీసుకెళ్లి ప్రయత్నం ప్రారంభించాలి.

సెప్టెంబర్ 11–17 వరకు తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాలు అన్ని జిల్లా కేంద్రాలతోపాటు పోరాట కేంద్రాల్లో నిర్వహించాలి. కేంద్ర పార్టీ పిలుపుమేరకు నిత్యావసరాల ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా, అర్హులైన వారికందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ మొదటి వారంలో నిరసన, ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది..

ఔషధ కంపెనీలపై అంకుశం అవసరం

దేశంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పలు ఔషధ కంపెనీల ఆగడాలకు కళ్లెం పడాల్సిన అవసరం ఉంది. 'డ్రగ్స్ (ధరల నియంత్రణ) ఆర్డర్ (డిపిసిఒ)ను ఎంత వరకూ సమర్థంగా అమలు చేస్తారన్న అంశంపైనే ఇది ఆధారపడి ఉంది. 1995 లో అప్పటి యుపిఎ సర్కారు తెచ్చిన ఈ ఉత్తర్వుల ద్వారా ఔషధాల ధరలను నియంత్రించవచ్చు. 1955 చట్టంలోని ఆర్డర్ 3 ఇంటరాలియా ధరల నియంత్రణలో ఉన్న ఔషధాల జాబితాలు, ధరలను నియంత్రించే విధానాలను స్పష్టం చేస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను అమలు చేసే విధానాలను ఆ చట్టంలో వివరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే, విధించాల్సిన జరిమానాలు లేదా శిక్షలను కూడా స్పష్టంగా పేర్కొన్నారు. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ)వివిధ ఔషధ కంపెనీలకు నోటీసులు జారీ చేయడంతో, డిపిసిఒ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను పాటించని కంపెనీల నుంచి రూ.73కోట్లు వసూలు చేసినట్టు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డా ప్రకటించారు. కరోనా కాలంలో ఔషధ కంపెనీలు అందిన కాడికి దోచుకున్న విషయం తెలిసిందే. మన దేశంలో తయారవుతున్న మందులపై పలు దేశాల్లో విమర్శలు రావడంతోపాటు, వాటిని నిషేధించిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం మేలుకోలేదన్నది బహిరంగ రహస్యం. దేశవ్యాప్తంగా ఔషధ కంపెనీలు ధరల విషయంలో నిబంధనలను పాటిస్తున్న దాఖలాలు లేవు. నామ మాత్రపు తనిఖీలు, చర్యలతో సరిపుచ్చుతున్నందునే, వసూలైన జరిమానాలు తక్కువగా ఉన్నాయి. ఔషధాల ధరలను నియంత్రించడానికి డిపిసిఒ 1997లో అమల్లోకి వచ్చింది. డ్రగ్స్ ఆర్డర్‌లోని నిబంధనలను, దానికి ఉన్న అధికారాలను గమనించి, వాటికి అనుగుణంగా ఔషధ కంపెనీలు వ్యవహరించాలి. ధరలను స్థిరీకరించారు. దీనిని ఉల్లంఘిస్తే, చట్టపరమైన చర్యలను ఎదుర్కోక తప్పదు. ఔషధాల లభ్యతను పర్యవేక్షిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం గా ఉండాలి. ఇలాంటి చట్టం ఉన్నప్పటికీ, దానిని సమర్థంగా అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతున్నది. ఫలితంగా ఔషధ కంపెనీలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాయి. వాటిని కట్టడి చేయకపోతే, సామాన్యుడికి వైద్యం అందదు.

ది గ్రాండ్ ఓల్డ్‌మన్ ఆఫ్ ఇండియా



దాదాబాయి నౌరోజీ తొలితరం స్వాతంత్ర్య సమర యోధుడిగా పేరు పొందారు. ఆయన బ్రిటీష్ చట్టసభలో సభ్యుడైన తొలి ఆసియా ఖండవాసిగా పేరు పొందా రు. నౌరోజీ 4, సెప్టెంబరు 1825న నవసారిలో జన్మించారు. పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి. పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకుడు. బరోడా మహారాజు శయాజీ రావు గైక్వాడ్3 కాలంలో సంస్థాన దివానుగా పనిచేశా రు. ఆయన 1892 నుండి 1895 వరకు ఇంగ్లాండు చట్టసభ అయిన యునైటెడ్ కింగ్డమ్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో కొనసాగారు. ఈయన ఈ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి.

గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన నౌరోజీ భారత జాతీయ కాంగ్రెస్ ప్రముఖ నేతలలో ఒకరు. ఈయన రాసిన 'పావర్టీ అండ్ అన్ బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా' అనే పుస్తకం భారతదేశం నుండి బ్రిటన్ తరలిస్తున్న నిధుల గురించి వివరించిన మొదటి పుస్తకం. నిధుల తరలింపువల్ల భారతదేశానికి ఏటా 200–300 పౌండ్ల నష్టం జరుగుతుందని నిరూపించారు. జాతీయాదా య అంచనాలు వివరించడంలో కూడా ఈయన ప్రసిద్ధి పొందారు. దాదాభాయి నౌరోజీ భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగానే కాకుండా ఈ సంస్థ స్థాపనకు కారకులైన ఒకరుగా ఉన్నారు. 1886లో కలకత్త(నేటి కోల్కత)లో జరిగిన రెండో కాంగ్రెస్ సమావేశానికి ఈయన అధ్యక్షత వహించారు. 1893లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రెండోసారి అధ్యక్షత వహించారు. 1906 లో జరిగిన కలకత్తా సమావేశానికి కూడా అధ్యక్షత వహించి మూడుసార్లు ఈ పదవి పొందిన తొలి నాయకుడిగా అవతరించారు. దాదాబాయి నౌరోజీ పలు గ్రంథాలు రచించారు. ఆయన 30 జూన్ 1917న మరణించారు.

(సెప్టెంబర్ 4 దాదాబాయి నౌరోజీ జయంతి)

ఐక్య పోరుతో హక్కుల రక్షణ

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

కనీస వేతనం, పని భద్రత కల్పించాలి

విశాఖ బహిరంగ సభలో రామేంద్రకుమార్, అమర్‌జిత్ కౌర్ పిలుపు

విశాఖపట్నం: దేశంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాకంటక పాలన సాగిస్తున్న మోదీ విధానాలపై, కార్మిక హక్కుల పరిరక్షణ, చట్టాల అమలుకు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ అధ్యక్షులు రామేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ సిటీలో మూడు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు మంగళవారం సాయంత్రం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశాఖ నగరంలో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రేటర్ విశాఖ కార్యాలయం వద్ద ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వారిద్దరూ ఉత్తేజకర ప్రసంగం చేశారు. విశాఖ నగరానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉందని, ఇక్కడి ఉక్కు పరిశ్రమకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని వారు గుర్తు చేశారు. విశాఖ స్టీల్ దేశంలోనే అత్యుత్తమైనదని పేర్కొన్నారు. వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధికి దోహదపడే విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం కారుచౌకగా తన మిత్రుడు అదానికి కట్టబెట్టాలని చూస్తున్నదన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ మైనార్టీ ప్రభుత్వం రెండు పిల్లర్ల మీద కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా ఈ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి ఎన్‌డీఏకి అండగా నిలబడ్డారన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబుకు దాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రానికి మంచి ప్యాకేజీ ఇచ్చారని మోదీని పొగుడుతున్న చంద్రబాబు... స్టీల్ ప్లాంట్ గురించి ఎందుకు ప్రస్తావించడం లే దని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానేకొనసాగించాలని, సెయిల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దీనిని కాపాడుకోవడానికి ఏఐటీయూసీ మిగిలిన కార్మిక సంఘాలను కలుపుకుని ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. మోదీ అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారని, చిన్న వ్యాపారాలు, ఉత్పాదక యూనిట్లు, ట్రేడ్ లు, దాదాపు 40శాతం స్టార్టప్ లు మూసివేతకు గురవ్వడంతో ఆర్థిక వ్యవస్థ దివాలా స్థితికి చేరిందన్నారు. దీని వల్ల నిరుద్యోగ సమస్య కూడా తీవ్ర రూపందాల్చిందన్నారు. ఇటీవల ఒక నివేదక ప్రకారం బీజేపీ పదేళ్ల పాలనలో 18 లక్షల పారిశ్రామిక యూనిట్‌లు మూతపడి ఉద్యోగులు రోడ్డున పడ్డారని వారు వెల్లడించారు. ఉత్పాదక రంగమే కాకుండా సేవా రంగంలో కూడా భారీగా ఉద్యోగాలు కోల్పోయారన్నారు. మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలను అదుపు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందడంతో పేద మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఆర్థిక ఇక్కట్లకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ఇంకో వైపు దేశంలో 55 శాతం జనాభా అర్ధాకలిలో పస్తులు గడుపుతున్నారని,వీరిలోఅత్యధికులు అసంఘటిత కార్మి కులు, వ్యవసాయ కూలీలు, సన్న చిన్న కారు రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ఆహార భద్రతపై ఐక్య రాజ్య సమితి నివేదికలో ఈ విషయం పొందుపరిచిందని, దీనికి మోదీ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. నిరుద్యోగ సమస్య రోజు రోజుకు తీవ్రంగాపెరుగుతుండడంతో యు వత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 90 శాతం కుటుంబాలు పది వేల కంటే సంపాదన తక్కువ కల్గి ఉండగా, 80 కోట్ల మంది ప్రజలకు ఐదు కిలోల ఉచిత రేషన్ ఇస్తున్నామని కేంద్రం డాంబికాలు పలుకుతోందని విమర్శించారు. దేశ ప్రజలందరికీ ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ 9వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఒక పక్క పేదరికం, నిరుద్యోగ సమస్య, పౌష్టికాహార లోపం, ఆత్మహత్యలు పెరుగుతుండగా, మరో పక్క కార్పొరేట్లు కోట్లకు పడగలు ఎత్తుతున్నారని వారు దుయ్యబట్టారు. ఇటీవలే హిండెన్ బర్గ్ నివేదిక బహిర్గతం చేసినట్లుగా మోదీ క్రోనీ క్యాపిటలిజం కార్పొరేట్ మిత్రులు ప్రభుత్వ రంగానికి చెందిన ఆస్తులపై కన్నేశారని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా కార్పొరేట్ స్నేహితులకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ఇలా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో సంఘటిత ఉద్యమాల నిర్వహణకు, ట్రేడ్ యూనియన్ల, శ్రామికవర్గ ఐక్యతకు పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ, ఏఐటీ యూసీ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, ఏఐటీయూసీ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రాజేంద్రన్, ఏఐటీయూసీ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూర్తి, కర్నాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు యూసఫ్, విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కెఎస్ఎన్ రావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి అచ్యుతరావు స్వాగతం పలకగా, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేశారు.

'ఇంటర్ ''కాంటినెంటల్'' ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో మూడు దేశాలు పాల్గొనే ప్రతిష్టాత్మక 'ఇంటర్ కాంటినెంటల్ కప్ (4వ ఎడిషన్) 2024' ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు.ఈటోర్నమెంట్‌లో ఇండియాతో పా టు మారిషస్, సిరియా దేశాల జట్లు తలపడతాయి.ఇండియా,మారిషస్‌ల మధ్య తొలి మ్యాచ్ ఓపెనింగ్ సెర్మనీలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొన్నారు. ఇండియా, సిరి యా, మారిషస్ దేశాల జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలనిఅఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నిర్ణయించడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ క్రీడాభిమానులు, ముఖ్యంగా హైదరాబాద్ ఫుట్‌బాల్ ప్రియుల తరఫున ఆటగాళ్లకు రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు.హైదరాబాద్‌ను దేశక్రీడా రాజధానిగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ ప్రయత్నమన్నారు. టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం అన్ని జట్ల ఆటగాళ్లకు సిఎం శుభాకాంక్షలు తెలియజేశారు. మూడు జట్ల మధ్య మూడు మ్యాచులు (రౌండ్ రాబిన్ ఫార్మేట్) జరగనుండగా,6న మారిషస్ వర్సెస్ సిరియా, 9న ఇండియా వర్సెస్ సిరియా జట్లు తలపడనున్నాయి. ఇంటర్ కాంటినెంటల్‌కప్ 2024 ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడల సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి ,ఆల్ ఇండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కల్యాణ్‌చౌబే, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ రూ.30లక్షల విరాళం

తక్షణ వరద సాయం అందించాలని సూచన

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసిన గవర్నర్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాలు, వరదల వల్ల పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. ప్రాణనష్టం కూడా సంభవించింది. ఈక్రమంలో పలువురు ప్రముఖులు వరద సహాయక చర్యల కోసం విరాళాలు ప్రకటిస్తున్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సహాయక చర్యల కోసం రూ.30 లక్షల విరాళం ఇచ్చారు. తన నిధుల్లో నుంచి ముప్పై లక్షల రూపాయలను రెడ్ క్రాస్ సొసైటికి ఇచ్చారు. తక్షణ వరద సహాయం అందించాలని ఆయన రెడ్ క్రాస్ సొసైటీకి సూచించారు. అదే సమయంలో భారీగా కురుస్తున్న వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెడ్ క్రాస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్, ఎన్జీవోలు ప్రభుత్వంతో కలిసి పని చేయాలన్నారు. భయాందోళన అవసరం లేదని ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చెప్పారని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

పాత పెన్షన్ విధానం సాధనకు 13న 'చలో ఢిల్లీ'

నేషనల్ కోఆర్డినేషన్ కమిటీఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్:ఇటీవల కేంద్రక్యాబినెట్ యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)పై తీసుకున్న నిర్ణయం మేరకు గత జనవరి తర్వాత భర్తీ అయిన ఉద్యోగులపైఅదే పక్షపాత వైఖరి కొనసాగుతోందని, ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన నకారా తీర్పుకు కు వ్యతిరేకమని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. దీనిని నిరసిస్తూ 13న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు.పాతపెన్షన్ విధానమే కావాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ సెక్టార్ కార్మికుల పోరాటాలకు సంఘీభావంగా చేదోడువాదోడు ఉంటుందని ప్రకటించింది. ఈ చలో ఢిల్లీ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం , ప్రభుత్వ రంగ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

త్వరతగతిన సమస్యలు పరిష్కరించాలి

జలమండలి ఇడి మయాంక్ మిట్టల్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జలమండలి ఎక్సక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. డివిజన్ 3 పరిధిలోని విజయ నగర్ కాలనీ సెక్షన్ ఆఫీస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. సెక్షన్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలించిన ఈడి మాట్లాడుతూ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలన్నారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ, జీఎం సుబ్రహ్మణ్యం డిజిఎం, మేనేజర్లు పాల్గొన్నారు.

అప్పీల్ డిస్మిస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి డబ్బు కరీంనగర్‌కు చెందిన ఒక విద్యార్థికి చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును 5 నెలలకుపైగా ఆలస్యంతో ప్రభుత్వం అప్పీల్ చేయడాన్ని డివిజన్ బెంచ్ తప్పుపట్టింది. సింగిల్ జడ్జి తీర్పు ప్రకారం విద్యార్థికి విద్యా నిధి సాయం అందించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ తీర్పు చెప్పింది.సాంఘిక సంక్షేమ శాఖ అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

కొండలు కొట్టేందుకు పేలుళ్లపై పిల్

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని నివాస ప్రాంతంలోని కొండలను కరిగించేందుకు పేలుళ్లు చేస్తున్నారంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు పిల్‌గామలిచింది.ఈపిల్‌ను బుధవారం హైకోర్టు సీజే బెంచ్ విచారించనుంది.

ఫార్మ సిటీ ఏర్పాటు ప్రక్రియకు తెరపడిందో లేదోచెప్పాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మ సిటీ ఏర్పాటు ప్రక్రియకు తెరపడిందో లేదో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను 6కి వాయిదా వేస్తూ జస్టిస్ లక్ష్మ ణ్ ఉత్తర్వులు జారీ చేశారు. భూసేకరణకు 2017లో జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఏవిధమైన అభ్యంతరాలు స్వీకరణ చేయకుండానే అవార్డు నోటిఫికేషన్ ఇవ్వడం చెల్లదని సింగిల్ జడ్జి తీర్పు చెప్పారని, అప్పటి నుంచి కదలిక లేదని, ఆ భూములపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి రైతులకు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని రైతుల లాయర్ కోరారు. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను ఈనెల 6వ తేదీకి వాయిదా పడింది.

నేటి నుంచి నీటి నాణ్యత పరీక్షలు రెట్టింపు

పర్యటించిన జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాల నేపథ్యంలో తాగునీటి నాణ్యత ప్రామాణాల పరీక్షలను రెట్టింపు స్థాయిలో నిర్వహించాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో ఇటీవల కురిన భారీ వర్షాల నేపథ్యంలోఎం.డి. అశోక్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించారు.హఫీస్‌పేట్‌లోని సాయినగర్, యూత్‌కాలనీ,మజీద్‌బండ, ఇజ్జత్ నగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శి ంచారు. ఈ సందర్భంగా ఎం.డి. మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రెట్టింపు సంఖ్యలో శాంపిళ్లు సేకరించి పరీక్షించిన తర్వాత సరఫరా చేయాలన్నారు. క్లోరిన్ తగిన మోతాదులో ఉండేలా జాగ్రత్తలు పా టించాలనిస్పష్టంచేశారు. అవసరమైన ప్రాంతా ల్లో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా అన్ని చర్యలూ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మంచి నీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలన్నారు.అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నా రు. మరోవైపు రోడ్లపై సీవరేజీ ఓవర్ ఫ్లో కాకుం డా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మ్యాన్ హోళ్లు ఉప్పొంగితే వెంటనే పూడిక తీయాలన్నా రు. వాటి నుంచి తీసిన వ్యర్థాల్ని (సిల్ట్) వెంటనే అక్కడ్నుంచి తొలగించాలన్నారు. ఎక్కువ లోతు ఉన్న మ్యాన్‌హోళ్లపై మూతలు, సేఫ్టీ గ్రిల్స్ తప్పనిసరిగాఉండేలా చూసుకోవాలన్నారు. జలమండలి, జీహెచ్ఎంసి వాటర్ లాగింగ్ పాయింట్లను నిత్యం పర్యవేక్షి ంచాలని, డ్రైనేజీ పనులకు సం బంధించిన వ్యర్థాలను తక్షణం తొలగించాలని, మంచి నీటిపైపు నాలా క్రాసింగ్ వద్ద చెత్త చేరకుం డా జీఎంలుజాగ్రత్త వహించాలన్నారు. పనులు చేస్తున్నప్పుడు కచ్చితంగా బారికేడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసి, సేఫ్టీ ప్రోటోకాల్ పాటించాలన్నారు.

వర్షాల నేపథ్యంలో తాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి : వర్షాలతో తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యే క చర్యలు తీసుకుంటున్నట్లు ఎం.డి. అశోక్ రెడ్డి తెలిపారు. తాగునీటి నాణ్యతపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందుకోసం మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అవలంభిస్తున్నామన్నారు. మొదటి విడతగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(డబ్ల్యూటిపి) వద్ద క్లోరినేషన్ ప్రక్రియ జరుపుతున్నామన్నారు. రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(ఎంబిఆర్) వద్ద క్లోరినేషన్ చేస్తున్నట్లు తెలిపారు. చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పిపిఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఐఎస్ఓ 10500 2012 ప్రకారం శాస్త్రీయంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను జలమండలి తీసుకుంటుందన్నారు.

బస్తీల్లో క్లోరిన్ బిల్లలు పంపిణీ : నగరంలోని బస్తీలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై జలమండలి మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని ఎం.డి. అశోక్ రెడ్డి తెలిపారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకుగానూ ప్రజలు ఇళ్ల లో నిల్వ చేసుకున్న నీటి నాణ్యతపై కూడా దృష్టి సారించామన్నారు.

నిల్వ చేసిన నీటిని శుద్ధి చేసుకోవడం కోసం ప్రజలకు క్లోరిన్ బిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. వరద ముంపు ప్రాంతాలు, బస్తీలలో ఇప్పటివరకు జలమండలి 8.80 లక్షల క్లోరిన్ బిల్లలను పంపిణీ చేసిందన్నారు. క్లోరిన్ బిల్లలను ఉపయోగించి, నీటిని ఎలా శుద్ధి చేసుకోవాలనే విషయంపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

సమన్వయం కోసం ప్రత్యేక కమిటీ..

వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని వాటర్ లాగిన్ పా యింట్లు, ఓవర్ ఫ్లో, కలుషిత నీరు తదితర అంశాలను పర్యవేక్షి ంచడానికి ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీని ఎం.డి. అశోక్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సర్కిల్ 4, రెవిన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, సర్కిల్ 1, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, సర్కిల్ 5 ఆపరేషన్ డైరెక్టర్ 2 స్వామి, సర్కిల్ 4 ఆపరేషన్ డైరెక్టర్1 విజయ రావు, సర్కిల్ 3,6(ఓఆర్ఆర్ పరిధి) పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్‌లు ఆ ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తారు. జిహెచ్ఎంసి, హెచ్ హెచ్ ఎండిఏ, విద్యుత్, శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నారు.

అందుబాటులో కస్టమర్ కేర్..

నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్ హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసం అయినా, తెరిచి ఉంచినట్లు తెలిస్తే జలమండలి కస్టమర్‌కేర్‌కు కాల్ చేసి, సమాచారం ఇవ్వాలన్నారు. కలుషిత నీరు, ఇతర సమస్యలకు జలమండలి కస్టమేర్‌కేర్ 155313కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఎం డితో పాటు డైరెక్టర్ ఆపరేషన్స్1 విజయ రావు, జీఎం బ్రిజేష్, డిజిఎం, మేనేజర్లు తదితరులు ఉన్నారు.

వయనాడ్ తరహా ఘటనలపై స్థానిక హెచ్చరికల వ్యవస్థ : విజయన్

తిరువనంతపురం : ప్రకృతి వైపరీత్యాలకు ముందస్తు హెచ్చరిలు చేసేందుకు స్థానికంగానే తగిన వ్యవస్థలను అభివృద్ధి చేస్తామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. వేనాడ్ తరహాలో కొండచరియలు విరిగిపడటం వంటి వైపరీత్యాలనుండి ముందస్తు హెచ్చరికల కోసం శాస్త్రీయ విజ్ఞానాన్ని స్థానికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, దీనిపైనే ప్రభు త్వం దృష్టి కేంద్రీకరించిందనీ చెప్పారు. కొండచరియలు విరిగిపడటానికి ముందుగానే హెచ్చరికలు అందుకోవడానికి ఒక వ్యవస్థను అభివృద్ధిచేస్తామన్నారు. వాతావరణ మార్పులకు సంబంధించిన అధ్యయనాలు చేసేందుకు కేరళలోని వివిధ సంస్థలను, శాఖలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సస్థలకకు కొత్త పరికరాలతోపాటు, కొత్త సిబ్బందిని కూడా సమకూరుస్తామన్నారు. జులై 30వ తేదీన వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో 230 మంది మరణించారు. అంతకు సమానమైన సం ఖ్యలో మృతదేహాల శరీర భాగాలు కూడా ఛాలియర్ నది నుండి, శిథిలాల నుండి కూడా వెలికితీశారు. వేనాడ్‌లోని మూడు గ్రామాలు పుంఛిరిమట్టమ్, ఛూరల్‌మల, ముండక్కైలు పూర్తిగా నేలమట్టమైపోగా, వాటితోపాటు అట్టామల లోని కొన్ని ప్రాంతాలు కూడా ధ్వంసమయ్యాయి. చరిత్రలో ఎన్నడూలేని రీతిలో ఈ వైపరీత్యం సంభవించింది. ఈ విషయాలపై పిటిఐతో ముఖ్యమంత్రి విజయన్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''వాతావరణ మార్పుల యు గంలో మనం ఉన్నాం, చాలా సున్నితమైన పరిస్థితులు నెలకుంటున్నాయి, వాస్తవ పరిస్థితులను, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉంది. వీటిలో ఎక్కువ వైపరీత్యాలు వాతావరణ మార్పులవల్ల జరిగినవే, ఐనప్పటికీ వీటి ప్రభావం, ఉధృతిని తగ్గించవలసిన అవసరం ఉంది, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం, కొండచరియలు విరిగిపడే ప్రమాదాల నివారణకు శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తాం'' అని పినరయి విజయన్ చెప్పారు. కేరళలోని తొమ్మిది జిల్లాలలో, ఇడుక్కి జిల్లాలోని ఏడు పర్వత ప్రాంత పంచాతీలలో స్థానికంగా 18 కోస్తా తీర ప్రభుత్వాలు సహాయ శిబిరాలను నిర్మిస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ శిబిరాల సంఖ్య ఇంకా పెంచుతామన్నారు. మరిన్ని రా డార్లు, మరిన్ని పర్యవేక్షణా వ్యవస్థలను కేరళకు ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభు త్వం కేంద్రాన్ని కోరింది. కేరళ రాష్ట్ర అవసరాల నిమిత్తం ఒక వాతావరణ మార్పుల అధ్యయన సంస్థను ప్రత్యేకించి కేరళకు శాస్త్రీయ పరిశోధనా కేంద్రా న్ని ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ వ్యవస్థలను పటిష్టం చేయడం కోసం ఆర్థిక సహాయం అవసరం ఉందని అన్నారు. వయనాడ్ ఘటన అనంతరం ఆ ప్రాంతంలో రెండు కొత్త టౌన్‌షిప్‌లను నిర్మిస్తామని ముఖ్యమంత్రి విజయన్ ఇప్పటికే ప్రకటించారు.

తప్పుచేయనప్పుడు నాకెందుకు బాధ...భయం?!

'ముడా' కుంభకోణం వ్యవహారంలో విపక్షాల ప్రచారం అసత్యం : కర్నాటక సిఎం సిద్ధరామయ్య

మైసూర్: కర్నాటక రాష్ట్రంలోని మై సూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణం వ్యవహారం ఉచ్చు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బిగుసుకోవడంతో రాజకీయ ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. క ర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గ హ్లోత్ ముడా వ్యవహారంలో తన ను విచారించేందుకు అనుమతివ్వడంతో తాను ఆందోళన చెందుతున్నానని ప్రతిపక్షాలు ప్రచారం చేయడాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొట్టిపారేశారు. మంగళవారం ఇక్కడ ఆ యన విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంఇచ్చారు. తాను ఎటువంటి తప్పుచేయనప్పుడు బాధపడాల్సిన, భయపడాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది అంతా ప్రతిపక్షనాయకులు చేస్తున్న అసత్య ప్రచా రం మాత్రమేనని సిద్ధరామయ్య తెలియజేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న అస త్య ప్రచారాన్ని నిజం అని నిరూపించుకోలేక వారు చాలా ఆందోళన చెందుతున్నారు తప్ప తనకు ఎంతమాత్రం బాధ, భయం లేద ని వివరించారు. ముడా కేసులో సిఎం సిద్ధరామయ్యఎదుర్కొంటున్న ట్రయల్ కోర్టు విచారణపై మధ్య ంతర స్టేను సోమవారం నాడు కర్నాట క హైకోర్టు సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గవర్నర్ థావర్‌చంద్ సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతి ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను హైకోర్టు ఒక వారం రోజుల కు (సెప్టెంబర్ 9నాటికి) వాయి దా వేసింది. ఎస్‌పి.ప్రదీప్ కుమా ర్. టిజె.అబ్రహాం, స్నేహమయి కృష్ణ గవర్నర్ థావర్‌చంద్‌కు పెట్టుకున్న పిటిషన్లలో ముడా కుంభకోణం వ్యవహారంలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అవినీతి ఉన్నదని ఆరోపించారు. దీంతో గవర్నర్ గహ్లోత్ 1988 ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ సెక్షన్ 17ఏ కింద, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 218కింద సిఎం సిద్ధరామయ్యపై అవినీతి ఆరోపణలను విచారణ చేసేందుకు అనుమతి మం జూరు చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ ఆదేశాలపై చట్టబద్ధతను సవాల్‌చేస్తూ సిద్ధరామయ్య ఆగస్టు 19న కర్నాటక రాష్ట్ర హైకోర్ట్‌లో పిటిషన్‌వేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం నాడు చాముండి హిల్‌పైన ఉన్నటువంటి చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించి దేవతలకు పూజలు చేశారు.

వరద తగ్గుముఖం..సహాయ చర్యలు వేగవంతం

వరద ముంపులోనే లక్షలాది మంది

ప్రకాశం బ్యారేజీకి, బుడమేరుకు తగ్గిన వరద

అమరావతి: రెండు రోజులుగా విజయవాడను గడగడలాడించిన బుడమేరు, కష్ణానది వరద తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద ఉధృతి తగ్గింది. అటు బుడమేరు కూడా శాంతించింది. దీంతో మంగళవారం ప్రభుత్వం సహాయ చర్యలను వేగవంతం చేసింది. నిన్న, మొన్న బాధితులకు పెద్దగా అందని ఆహారం, మంచి నీరు, పాలు వంటి సదుపాయాలు చాలావరకు బాధితులకు చేరింది. ప్రభుత్వ యంత్రాంగం సైతం సహాయ చర్యలను వేగవంతం చేసింది. ఎన్‌డీఆర్ ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతో బాధితులకు చాలావరకు ఆహారం అందజేసింది.ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు సైతం సహాయ చర్యల్లో పాల్గొని బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. కాగా, వరద ఉధృతి తగ్గినప్పటికీ బాధితులు ఇంకా బురదనీటిలో జీవిస్తున్నారు. ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. విజయవాడ నగరంలో వరద ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టింది. నాలుగు రోజుల నుంచి వరద ముంపులోనే ప్రలు అల్లాడుతూ బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి... భయం గుప్పిట్లో బతుకుతున్నారు. బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఇంకా వరద నీరు నిలిచే ఉంది. బాధితులు సగానికిపైగా ఇళ్లకే పరిమితమయ్యారు. కాలనీలు, రహదారులు చెరువుల్లా తలపించడంతో ఎటూ వెళ్లలేని దుస్థితి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, రోగగ్రస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సరిపడా ఆహార పొట్లాలు సమకూర్చినా... కొన్ని ప్రాంతాల్లో అందజేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని స్వయంగా సీఎం చంద్రబాబు మీడియా సమావేశంలో అంగీకరించారు. ఆహార సరఫరాలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోందని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరద ముంపు ప్రభావంలేని ప్రాంతాల వారికి ఆహారం సరఫరా చేయడం, అక్కడ వారు వృథాగా చెత్తలో పోస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. బుడమేరుతో పాటు కృష్ణా పరీవాహక ప్రాంత ముంపులో దాదాపు 4 లక్షల మంది బాధితులు చిక్కుకున్నారు. ఇంకా ఇంట్లో నుంచి బయటకు రాకుండా 3 లక్షల మంది అవస్థలు పడుతున్నట్లు సమాచారం. ఒక్క సింగ్‌నగర్ పరిసర ప్రాంతంలోనే 2.76 లక్షల మంది ఉన్నట్లు అంచనా. విజయవాడ సింగ్‌నగర్, వన్‌టౌన్, వించిపేట ప్రాంతాలు వరద గుప్పెట్లోనే ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్ వద్ద ముంపులోనే ఓ ఇంట్లో మహిళ ప్రసవించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద సహాయక చర్యల్లో నిమగ్నమైన విద్యుత్ లైన్‌మెన్ వజ్రాల కోటేశ్వరరావు కొట్టుకుపోయి మృతి చెందారు. అటు లంక గ్రామాల చుట్టూ వరద నీరు ముంచెత్తింది. ఇప్పటివరకు ముంపు ప్రాంతాల నుంచి కేవలం 43,417 మందిని పునరావాస శిబిరాలకు తరలించినట్లు విపత్తుల కేంద్రం వెల్లడించింది. మరోవైపు, మున్నేరు వరద ఉధృతికి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని లింగాల వంతెన కొట్టుకుపోయింది. దీంతో జగ్గయ్యపేటఖమ్మం మధ్య రాకపోకలు స్తంభించాయి. కిలోమీటర్లు పొడవునా గండ్లు పడ్డాయి. విజయవాడ మధురానగర్ సమీపంలోని విజయదుర్గానగర్‌లో బుడమేరు కాల్వకు గండిపడి ఏలూరు కాల్వలోకి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సమీప ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో జేసీబీపై చంద్రబాబు పర్యటించారు. ప్రకాశం బ్యారేజీలో బోట్లు దూసుకొచ్చి గేట్లు దెబ్బతిన్న ప్రాంతాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పార్టీ ఇతర నేతలు పరిశీలించారు. భారీ వర్షాలు, వరదలతో ఉగ్రరూపం దాల్చిన కష్ణానది కాస్త శాంతించింది. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం క్రమక్రమంగా తగ్గుతోంది. 11 లక్షల 40 వేల క్యూసెక్కుల నుంచి గంట గంటకు వరద తాకిడి తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం 8 లక్షల 94 వేల క్యూసెక్కులకు వరద చేరుకుంది. మరింతగా తగ్గే అవకాశాలున్నాయి.

తగ్గిన బుడమేరు ప్రవాహం: జి.కొండూరు మండలం దగ్గర బుడమేరు ప్రవాహం తగ్గుతోంది. నిన్నటి వరకూ మహోగ్రరూపం దాల్చిన బుడమేరుకు మంగళవారం నుంచి వరద ఉధతి తగ్గింది. బుడమేరు డిజైన్ సామర్థ్యం 15 వేల క్యూసెక్కులకు మించి వరద నీరు వచ్చి చేరింది. కుంభవష్టి నమోదవడంతో బుడమేరు వరద విజయవాడలోని 16 డివిజన్లను ముంచెత్తింది. బుడమేరులో ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులు మాత్రమే వరద ప్రవాహం ఉందని, అది మరింత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

పై ఇన్ఫోటెక్‌కు 13 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాపక్షం / ఖమ్మం అర్బన్ : ఎస్‌బిఐటి కళాశాలలో పై ఇన్ఫోటెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో పై ఇన్ఫోటెక్ నిర్వహించిన ప్రాంగణ నియామకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఉన్నత విలువలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక మాంద్యంలో కూడా ప్రాంగణ నియామకాలు చేపట్టడం వాటిలో తమ విద్యార్థులు ప్రతిభ చాటడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి మాట్లాడుతూ ఐటి సర్వీసెస్, ఐటి ప్రొవైడర్ కంపెనీ అయిన పై ఇన్ఫోటెక్ జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగానికి నిర్వహించిన ప్రాంగణ నియామకాలల్లో 185 మంది ఎస్‌బిఐటి విద్యార్థులు పాల్గొనగా 72 మంది మౌఖిక పరీక్షకు అర్హత సాధించారన్నారు.

వారిలో చివరి దశలో 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. పై ఇన్ఫోటెక్ హెచ్‌ఆర్, డైరెక్టర్ విజయ్ జైస్వాల్, హెచ్‌ఆర్ మేనేజర్ పీయూష్ తివారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్‌కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపిఓ ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ పాల్గొన్నారు.

రైస్ మిలర్ల ఆస్తుల జప్తు రద్దు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గవర్నమెంట్ అప్పగించిన ధాన్యానికి కస్టమ్స్ మిల్లింగ్‌రైస్ (సీఎంఆర్)ను పౌరసరఫరాల శాఖకు అప్పగించని రైస్ మిల్లర్ల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయడాన్ని హైకోర్టు రద్దు చేసింది. రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన వడ్లను మిల్లింగ్ నిమిత్తం మిల్లర్లకు అప్పగిస్తారు. వాటిని మిల్లింగ్ తర్వాత పౌరసరఫరాల శాఖకు నిర్దిష్ట గడువులోగా అప్పగించని రైస్ మిల్లర్ల ఆస్తులను జప్తునకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.చట్ట వ్యతిరేకంగా రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తుల జప్తు చేయడం చెల్లదన్న రైస్‌మిల్లర్లవాదనను ఆమోదిస్తూ జస్టిస్‌లక్ష్మ ణ్ తీర్పుచెప్పారు. చట్ట ప్రకా రం మిల్లర్ల నుంచి నష్టాన్ని ప్రభుత్వం రాబట్టుకునేందుకు వీలుందని, రెవె న్యూ రికవరీచట్టం కింద తీసుకున్న చర్యలు చట్టబద్ధంగా లేవని పేర్కొంది.

కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం

ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ప్రజాపక్షం/అచ్చంపేట : సీఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మి పథకం పేదప్రజలకు వరప్రదాయిని అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో సీఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలనుంచి రెండు పథకాలకు 250మంది లబ్దిదారులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్‌స్థాయిలో వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈపథకం అమలు చేస్తున్నారని దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు, ఆర్‌డిఓ మాధవి, అన్ని నియోజకవర్గపు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యసాధన ధ్యేయంగా అభ్యాసన

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : విద్యార్థులు లక్ష్యసాధనధ్యేయంగా విద్యఅభ్యసనసాగిస్తేనే ఉన్నతస్థానాలకు చేరుకుంటారని జూనియర్ కళాశాలల జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. మండలంలోని పాలెంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డేను మంగళవారం బాలాజిగార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుంచే లక్ష్యం నిర్దేశించుకొని చదువుకుంటేనే జీవితంలో అనుకున్నది సాధిస్తామన్నారు. చదువుతోపాటు సామాజిక సంబంధాలు సామాజిక విలువలు, పరస్పర సహకారం , రాజ్యాంగం, న్యాయచట్టాలపై ఇతర అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉత్తమ పౌరుడిగా ఎదగాలంటే విద్యార్థిదశనుంచే క్రమశిక్షణ సమయపాలన అలవర్చుకున్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్‌డిప్యూటి ఎస్పి, నార్కొటి కంట్రోల్ బ్యూరో అమర్‌నారాయణచౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, అధ్యాపకులు మదన్‌మోహన్‌రెడ్డి, పద్మజ, రేవతి, గౌస్, నర్సింహ్మ, వెంకటయ్య, రాములు, వినోద్, రామకృష్ణ, గోపి, నాన్‌టీచింగ్ సిబ్బంది నిజాముద్దీన్, జయలక్ష్మి ఉన్నారు.

చెంచులను కాపాడిన రెస్క్యూ టీమ్

ప్రజాపక్షం/అచ్చంపేట : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో దుందుభివాగులో పదిమంది చేపలవేటకు వెళ్లి దుందుభివాగులో చిక్కుకున్నారు. వెంటనే తమ కుటుంబసభ్యులకు విషయం తెలియజేశారు. వారు వెంటనే సిద్దాపూర్ సమీపంలో ఉన్నామని పోలీసులకు తెలియజేయగా పోలీసులు రెస్క్యూటీమ్ భద్రత సిబ్బందితో కలిసి ఉదయం సిద్దాపూర్ ప్రాంతంలో దుందుభివాగులోకి వెళ్లి రక్షించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ వెంట ఉండి వారిని తీసుకొచ్చేందుకు కృషిచేశారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/వంగూర్ : మండలపరిధిలోని పోల్కంపల్లి ఉప్పల్‌పాడు నిజాంబాద్ గాజరసదగొడు గ్రామాల లబ్దిదారులకు కల్యాణలక్ష్మి సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులను మంగళవారం అచ్చంపేట పట్టణంలో ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, జనార్దన్, కొండల్‌రెడ్డి, రాజయ్య, శివాజి, ఆయా గ్రామాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు , లబ్దిదారులు పాల్గొన్నారు.

కెఎల్ఐ కాల్వకు త్వరలో మరమ్మతులు

ప్రజాపక్షం/వెల్దండ : కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి82కాల్వలకుపడిన గండ్లను వాతావరణ పరిస్థితులు అనుకూలించగానే మరమ్మతులు చేయిస్తామని నీటిపారుదలశాఖ ఈఈ శ్రీకాంత్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు కెఎల్ఐ ద్వారా సాగునీరును ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ఆదేశాలమేరకు మంగళవారం వెల్దండ మండలంలోని కెఎల్ఐ డి82 కాల్వ పరిస్థితిని నీటిపారుదలశాఖ డిఈలు దేవన్న, సమ్మయ్య, మధుకాన్ మేనేజర్ వెంకట్‌రావుతో కలిసి ఆయన కాల్వను నడకదారిన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎల్ఐ ప్రధాన కాల్వకు మున్ననూర్, వెంకటాపూర్, జీడిపల్లి , కుర్మిద్ద, ఎల్లికల్ గ్రామ సమీపంలో గండ్లు పడ్డాయని వాటన్నింటిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి దిగువకు సాగునీరు అందించడం జరుగుతుందని అదేవిధంగా కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి నుంచి కెఎల్ఐడి82 ప్రధానకాల్వను 33 కిలోమీటర్‌వరకు పరిశీలించడం జరిగిందని తగు నివేదికను ఉన్నతాధికారులకు , ఎమ్మెల్యేకు అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన వెంటనే గండ్లకు మరమ్మత్తులు చేసి పూర్తిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గోపాల్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, బాలయ్య, ఆంజనేయులు ఉన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు , గ్లాసులు వితరణ

ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికి పెబ్బేరు మున్సిపల్ రెండవ కౌన్సిలర్ అక్కమ్మ స్టీల్ గ్లాసు, ప్లేట్ ప్రతి విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలకు ఏదో ఒక విధంగా సహాయం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాములు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి నిల్వ ఉండకుండా 'డ్రై డే' కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

ప్రజాపక్షం / పెద్దమందడి : వర్షాల వల్ల అక్కడక్కడ వర్షపు నీరు నిలవ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ముందస్తు చర్యలు తీసుకోవాలని , నీటి నిలువ ఉండకుండా వారంలో రెండు రోజులు డ్రైడే కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. పెద్దమందడి మండలంలోని ఆకస్మత్తుగా జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల ఇంటి మిద్దెలు, పాత టైర్లు, కుండలు , ఇతర ప్లాస్టిక్ సమాన్లలో నిలువ నీరు ఉండకుండా ఎప్పటికప్పుడు పారవేసే విధంగా డ్రై డే కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ , పంచాయతీ అధికారులను ఆదేశించారు. డ్రై డే సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, డెంగ్యూ పాజిటివ్ వచ్చిన ఇంటిని సందర్శించారు. పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఓపి రిజిస్టరు, ఈడిడి స్టాక్ రక్త నమూనాల పరీక్షల రికిష్టర్లను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఈ మధ్య కాలంలో వచ్చిన అవుట్ పేషంట్లు, జ్వరంతో వచ్చిన వారు ఎంత మంది , ఎంత మందికి రక్త నమూనాలు సేకరించారు. వాటిలో పాజిటివ్ కేసులు ఎన్ని అని ప్రశ్నించారు. బర్త్ ప్లాన్ ఈడిడి రిజిస్టరును పరిశీలించారు. రక్త నమూనాలు సేకరించి ఎలిజా పరీక్షకు పంపించాలని సూచించారు. పాముకాటు, కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో ఎక్కడెక్కడ ఏయే పంట నష్టం జరిగిందని ఎంత నష్టం జరిగిందనే పూర్తి వివరాలు సేకరించి నివేదికను త్వరగా ఇవ్వాలని వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్‌ను ఆదేశించారు. ఆర్డీఓ పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ నాయక్ , జిల్లా వైద్య శాఖ అధికారి జయచంద్ర మోహన్ , జిసిడిఓ శుభలక్ష్మి , వనపర్తి తహసీల్దార్ చాంద్‌పాషా, పెద్దమందడి ఎంపీడో సద్గుణ, పెద్దమందడి వ్యవసాయ అధికారి సైదయ్య, పెద్దమందడి ఇంచార్జీ ఎంఈఓ జయశంకర్ , ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ , శివశంకర్ , ఎంపీడీఓలు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

తెగిన కాల్వలకు వెంటనే మరమ్మతులు

అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

ప్రజాపక్షం / పాన్‌గల్ : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కెఎల్ఐ డి 8, బీమా కాలువ తెగిపోవడంతో మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి పాలమూరు జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డిలు తెగిన కాలువలను పరిశీలించారు. పాన్‌గల్ మండల పరిధిలోని దావాజీపల్లి గ్రామంలో తెగిన కెఎల్ఐ కాలువ, జమ్మాపూర్ గ్రామ శివారులో తెగిన భీమా కాలువను, కొత్తపేట గ్రామ సమీపంలో కోతకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే తెగిన కాలువలకు మరమ్మతు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. మంత్రి వెంట మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్ సాగర్ , రాముయాదవ్ , పుల్లారావు, జయరాములు, సాగర్ , వెంకటయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం / శ్రీరంగాపురం : మండల పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని శ్రీరంగాపురం కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే మెగారెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు చేత రూ. 5వేలు ఆర్థిక సహాయం అందించారు. అతని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్ , మాజీ సర్పంచ్ నాగయ్య తదితరులు నాయకులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ప్రజాపక్షం / వీపనగండ్ల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా డే సమావేశం నిర్వహించారు. డా. రాజశేఖర్ మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు విషజ్వరాల బారిన పడకముందే ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్యాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని , రోడ్లపై ఇంటి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం , మురుగు నీళ్ల వలన దోమలు కుప్పలు తెప్పలుగా వృద్ధి చెంది వాటి దాటికి ప్రజలు రోగగ్రస్తమవుతారన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గునియా , వైరల్ జ్వరాలు విజృంభించి ప్రజారోగ్యాన్ని కాటేస్తావని, దీని కారణంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి అధికంగా ఉంటుందని వివరించారు. గ్రామాలలో ప్రతి ఆశా కార్యకర్త ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. హేమవర్ధన్ , డా. శ్వేత, డాక్టర్ భాగ్యశ్రీ, డా. కరుణశ్రీ, హెల్త్ అసిస్టెంట్ జహంగీర్ , కంప్యూటర్ ఆపరేటర్ రాఘవేంద్ర, ఆశా కార్యకర్తలు , ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామ , పట్టణాలలో తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల మూలంగా గ్రామీణ , పట్టణాలలో ప్రజలు విష జ్వరాలకు, డెంగ్యూ రోగాలకు, మలేరియా తదితర అనారోగ్యాలాకు గురైన వారికి ప్రభుత్వమే ప్రతి గ్రామ , పట్టణాలలో ఉచిత తాత్కాలిక వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కమిటీ డిప్యూటీ డీఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డికి ఎం. ఆంజనేయులు , జిల్లా కార్యదర్శి ఆర్. దేవన్న, జిల్లా ఉపాధ్యక్షులు నిరంజన్ , జిల్లా నాయకులు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏం. ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో ఇటీవల కూడా నాలుగు రోజులు నుంచి పెడతెరిపి లేకుండా రాష్ట్ర వ్యాప్తంతో పాటు వనపర్తి జిల్లా నలుమూలల అతి భారీ వర్షాలు పడ్డాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన గ్రామీణ, పట్టణ ప్రజలు ప్రతి కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు విష జ్వరాలకు, అతిసారా, మలేరియా, డెంగ్యూ రోగాలకు గురై తీవ్ర అస్వస్థకు లోనై ఆర్థిక పరిస్థితి లేక ఇంట్లోనే కాలం గడుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి తాండ, ప్రతి పట్టణంలో ప్రభుత్వమే స్వయంగా తక్షమమే వైద్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను అనారోగ్యాల నుంచి కాపాడావాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుమన్నారు.

రౌడీలకు కౌన్సిలింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయో గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని 14 మంది కమ్యూనల్ రౌడీషీటర్లకు డిసిపి జి.చంద్రమోహన్ మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎలాంటి చిన్న ఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని డిసిపి హెచ్చరించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఎసిపిలు వెంకటరెడ్డి,ఫయాజ్, మునవలతో పాటు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

9న ఆసుపత్రి శంకుస్థాపన

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి : సెప్టెంబర్ 9న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా వనపర్తి జిల్లా వైద్య ఆసుపత్రి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మర్రికుంట వద్ద నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ సెప్టెంబర్ 9న వనపర్తి జిల్లాకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటించి వైద్య కళాశాల పక్కనే 602 పడకల ప్రభుత్వ వైద్య ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం జరిగేచోట స్థలం చదును చేసి శిలాఫలకం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్‌బి కళాశాల భవన గుత్తేదారుకు సూచించారు. అంతకు ముందు వైద్య కళాశాల పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ తరగతి గదులతో పాటు బాలుర, బాలికల వసతి గృహాలు డిసెంబర్ వరకు పూర్తి చేసి ఇవ్వాలని, లేబర్ సంఖ్యను మరింత పెంచాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రహారీ గోడ మొత్తం పూర్తి చేసి గేట్లు అమర్చాలని ఆదేశించారు. రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు నిత్యం పర్యవేక్షణ చేస్తూ పనిలో వేగంతో పాటు నాణ్యత పరిశీలించాలని ఆదేశించారు. రోడ్లు భవనాల డిఈ సీతారామ స్వామి, తహసీల్దార్ చాంద్ పాషా , ఏఈ గుత్తేదారు తదితరులు ఉన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవల్ల రైతులపంటలు నీటమునిగి తీవ్రంగా నష్టపోయారని వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం ఆయన తాడూరు మండలకేంద్రం పెట్రోల్‌బంకువెనకాల వరదలవల్ల నీటమునిగిన వరిపంటలను, పత్తిచేను, యాదిరెడ్డిపల్లిబ్రిడ్జిదగ్గర పూర్తిగా నీటమునిగిన వరి పంటలను , అంతారం గ్రామంలో నీటమునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు ఎరువులు, మందులు, ఇతరత్రా పెట్టుబడులుపెట్టి వ్యవసాయంచేస్తే వారికళ్లముందే అకాలవర్షం వలన మునిగిపోతున్న పంట పొలాలను చూసి తట్టుకోలేకపోతున్నామని వారు ఆవేదనను ఆయనతో వెళ్లబోసుకున్నారు. తక్షణమే ప్రభుత్వం ఎకరాకు రైతులకు 25వేల నష్టపరిహారం చెల్లించాలని , వరుస వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లుకూలిపోయిన రైతులకు ఇందిరమ్మ ఇండ్లతోపాటు తక్షణమే 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, ఇతర సామాగ్రి పంపిణీచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

సిసికెమెరాలు తప్పనిసరి

డిసిపి బాలస్వామి

ప్రజాపక్షం/హైదరాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణకు సిసికెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం సుల్తాన్‌బజార్ బడిచౌడిలోని అవినాష కళాశాలలో జరిగిన నేనుసైతం కార్యక్రమానికి బాలస్వామి ముఖ్య అతిథిగా హాజరై కళాశాలలో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అదనపు డిసిపి జె.నర్సయ్యతో పాటు కళాశాల ప్రిన్సిపాల్, ఎస్.శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు. డిసిపి ప్రారంభించిన 85 సిసికెమెరాలు జియో ట్యాగ్ చేశారు.

దిఐకాన్ పబ్లిక్‌స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాపక్షం/వెల్దండ : దిఐకాన్ పబ్లిక్‌స్కూల్‌పై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ నాయకులు సంతోష్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వెల్దండ మండలం కొట్రగేటువద్దగల దిఐకాన్‌పబ్లిక్‌స్కూల్‌దగ్గర ధర్నా చేశారు. ఈసందర్భంగా పిడిఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ మాట్లాడుతూ మండలపరిధిలోని కొట్రగేటువద్ద ఉన్న గల స్కూల్‌కు శాస్త్రస్కూల్‌పేరుమీద అనుమతి ఉందని, ఆస్కూల్ యజమాన్యం ఐకాన్‌పబ్లిక్‌స్కూల్ అనిబోర్డు పెట్టుకొని తల్లి దండ్రులను మోసం చేస్తున్నారని , స్కూల్‌బస్సుమీద శాస్త్రస్కూల్ అని ఉందని, కాబట్టి అనుమతి ఉన్న శాస్త్రస్కూల్‌బోర్డు పెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. అదే విధంగాస్కూల్లో లక్షలరూపాయలు ఫీజులు వసూలుచేస్తున్నారని , ఇంతకు ముందు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదుచేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే పాఠశాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేకపోతే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ ఆఫీస్‌ను ముట్టడిచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థినాయకులు వినోద్, మహేందర్, అర్జున్, నితిన్, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

పెద్దచెరువుకట్టకు మరమ్మతులు చేపట్టండి

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాలనేపథ్యంలో మండలంలోని వెన్నచర్ల గ్రామంలోని పెద్దచెరువు కట్ట డ్యామేజైందని కట్టకు మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. పెద్దచెరువు కట్టను మాజీ ఎంపిపి తహసీల్దార్ ఎండి యూసుఫ్‌అలీ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పెద్దచెరువు కట్టక మరమ్మత్తులు కొట్టుకుమినీ ట్యాంక్‌బండ్ ప్రతిపాదనలు పంపాలని కోరారు. వెన్నచర్ల గ్రామంలో వర్షానికిపడిపోయిన ఇండ్లను , నష్టపోయిన బాధితుల వివరాలను ప్రభుత్వానికి అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. అనంతరం మరికల్ గ్రామంలో బోనాలపండుగకు ముఖ్యఅతిథిగా మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెన్నచర్ల గ్రామ ఎంపిటిసి రవికుమార్, కల్వకోల్ గ్రామ ఎంపిటిసి కామ్రేడ్ వెంకటస్వామి, చంద్రబండతండా మాజీసర్పంచ్ రామ్‌లాల్, వెన్నచర్ల గ్రామమాజీ సర్పంచ్ రాధాబాలస్వామి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి : మాజీమంత్రి నాగం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : అధికారులు మెగా ఏజేన్సీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిర్లక్ష్యంవల్లే వెంకటాద్రి రిజర్వాయర్‌లోని పంప్‌హౌస్ మోటార్లు నీట మునిగాయని మాజీ మంత్రి డాక్టర్ నాగంజనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియోద్వారా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో 7లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన నాలుగు పంపుహౌస్‌లలో మూడోపంప్‌హౌస్‌వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్‌లో 2437 కోట్లతో కొనుగోలుచేసిన మోటార్లు చెరువులు, కుంటలద్వారా కెఎల్ఐ కెనాల్ ద్వారా వచ్చిన వరదనీటితో నీటమునగడం జరిగిందని విమర్శించారు. వరదలువస్తే నీళ్లు ప్రవహిస్తాయని మెగా ఏజేన్సీకికాని అధికారులకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ప్రారంభానికిముందే ఈదుస్థితి నెలకొనడం దారుణమని ఒకవేళ నీటిని ఎత్తిపోసి మోటార్లు పనిచేసే విధంగా తయారుచేసిన కొనుగోలు చేసినప్పుడు ఉన్నంత సామర్థ్యంగా మోటార్లు పనిచేయవని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే వాటిపై స్పందించి మెగా ఏజేన్సీపై, అధికారులపై చర్యలు తీసుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విమర్శలొద్దు బాధితులను ఆదుకుంటాం : సిపిఐ

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ విమర్శలను పక్కనపెట్టి వరదలలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సిపిఐరాష్ట్రసమితి సభ్యులు, కొల్లాపూర్ నియోజకవర్గ సిపిఐపార్టీ కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ అన్నారు. కొల్లాపూర్ పట్టణంలో వర్షాలనేపథ్యంలో వరదలో పాడైన ఎస్టిహాస్టల్‌ను మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు ఎస్టిహాస్టల్‌కు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్రంలో గతనాలుగు రోజులుగా విరామంలేకుండా అతిభారీ వర్షాలుకురిసిన నేపథ్యంలో రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో వరదలు రావడంతో ఇండ్లు, పంటలను పొలాలను ప్రజలు సర్వం కోల్పోయారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి వరదప్రాంతాలలో తక్షణమే పర్యటించి తగిన ప్యాకేజిని కేంద్రప్రభుత్వం ఇవ్వాలని , కేంద్రం సహాయాన్ని ఇప్పించాల్సిన బాధ్యత తెలంగాణరాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులపై ఉందన్నారు. ఆపద సమయాలలో రాజకీయాలకు అతీతంగా వరద బాధితులను ఆదుకొని ఆర్థికాభివృద్ధికి తోడ్పడుదామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐపార్టీ నాయకులు ఎండి యూసుఫ్ ఉన్నారు.

గోపాల సముద్రంలో గంగమ్మకు పూజ

ప్రజాపక్షం / పెద్దమందడి : పెద్దమందడి మండలం, వెల్టూర్ గ్రామంలో సప్త సముద్రాలలో ఒకటైన గోపాల సముద్రాన్ని సందర్శించి గంగమ్మ తల్లికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పూజలు నిర్వహించారు. పెద్దమందడి మండలలం వెల్టూరు గ్రామంలో విస్తారమైన వర్షాలకు నిండి, అలుగు పారుతున్న సందర్భంగా గోపాల సముద్రాన్ని సందర్శించి అలుగు దగ్గర గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలు, సమర్పించి కొబ్బరికాయ కొట్టి సంబరాలు , పూజలు నిర్వహించారు. కట్టపైన ఉన్న కట్ట మశమ్మ, వేణుగోపాలస్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం కట్టపై కలియ తిరుగుతూ నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ , మాజీ జడ్పిటిసి కె. రఘుపతిరెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం. వేణుయాదవ్ , బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లక్ సురేష్ , మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దయాకర్ , గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్లక్ , సురేష్ , సాంబ యాదయ్య, బలిదుపల్లి ఎంపిటిసి గణేష్ , వెంకటయ్య, అడివన్న, బుసయ్య, ఖాజా హుస్సైన్ , ఆంజనేయులు, శ్యాంసుందర్ రెడ్డి, దండు బాలురాజు, శ్రీధర్ , ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

బ్యూటీ టిప్స్

చర్మం ప్రకాశవంతంగా మెరుస్తూ ఉండాలని కోరుకోని అమ్మాయిలు ఉండరు. కానీ కాలుష్యం, యూవీ కిరణాలు, చెడు ఆహార అలవాట్లు, లైఫ్‌స్టైల్ మార్పుల కారణంగా అనేక సౌందర్య సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖంపై మచ్చ లు, మొటిమలు, జిడ్డు చర్మం.. ఇలా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టి కాంతివంతమైన, మచ్చలు లేని

కీరాతో మెరిసే అందం

చర్మం పొందడానికి కొన్ని ఫేస్ ప్యాక్స్ సహాయపడతాయి. మీ అందాన్ని సంరక్షించే ఫేస్ ప్యాక్స్‌లో కీరా ఒకటి. కీరాతో ఫేస్ ప్యాక్ ఎలా చేసుకోవాలో చూదం! ముందుగా అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి మిక్స్ చేయండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయండి. కీరా దోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. ఇది ముడతలు, సన్నని గీతలు వంటి సమస్యలు దూరం అవుతాయి.

ఎర్రటి పెదాల కోసం



ఎర్రని పెదాలు చూడ్డానికి మరింత అందంగా కనిపిస్తాయి. కానీ, చాలా మందికి చాలా కారణాల వల్ల పెదాలు నల్లగా, డ్రైగా అయిపోతాయి. ఆ సమస్యకి చెక్ పెట్టి పెదాలు ఎర్ర గా కనిపించాలంటే ఈ టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి. ముందుగా ఓ వెట్ నాప్‌కిన్ తీసుకోండి. లేదా మెత్తని టూత్ బ్రష్ తీసుకోండి. దీంతో మీ పెదాలపై మెల్లిగా రుద్దండి. దీని వల్ల డ్రైగా ఉన్న లేయర్ అంత పోయి పెదాలు నీట్‌గా మారతాయి. దీంతో బ్లడ్ సర్క్యూలేషన్ కూడా బాగుంటుం ది. రాత్రుళ్ళు ఇలా చేయడం మంచిది. తర్వాత కొబ్బరి నూనెని రాయండి.

సంగీత సామ్రాజ్ఞి జెన్నీ

పాశ్చాత్య సంగీతంపై ఆసక్తి ఉన్న వారికి 'ఫిస్క్ జూబ్లీ సింగర్స్' బృందం పేరు సుపరిచితమే. ఈ బృంద వ్యవస్థాపకుల్లో జెన్నీ జాక్సన్ కూడా ఉంది. టెనస్సీలోని కింగ్‌స్టన్‌లో 1852లో జెన్నీ జన్మించిన నల్లజాతి గాయని జెన్నీకి పేరుప్రఖ్యాతులు అయాచితంగా ఏమీ దక్కలేదు. ఆండ్రూ జాక్సన్ ఇంట్లో బానిస. చిన్నతనం నుంచే బానిసగా జీవితాన్ని గడిపాడు. జెన్నీ తల్లిదండ్రులకు సైతం బానిస బతుకు తప్పలేదు. చాకలి వృత్తి చేసుకునే జెన్నీ తల్లి, అమెరికా అంతర్యుద్ధం సమయంలో బానిసత్వం నుంచి విముక్తి పొందింది. దీనితో ఆమె కుటుంబం టెన్నెస్సీలోని నాష్ విల్లేకు మకాం మార్చింది. అక్కడే జెన్నీ బాల్యం గడించింది. తల్లిదండ్రులకు స్వేచ్ఛ లభించడంతో, జెన్నీకి బానిసగా బతకాల్సిన దుస్థితి రాలేదు. అయితే, కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో, నిరంతరం సమస్యలు, కష్టాల మధ్యే ఆమె బాల్యం గడిచింది.1866లో కేవలం నల్లజాతీయుల కోసం ఏర్పాటు చేసిన 'ఫిస్క్ ఫ్రీ కలర్డ్ స్కూల్'లో చేరింది. ఆ పాఠశాలలో ఆమే మొదటి విద్యార్థిని కావడం విశేషం. 1871లో జూబ్లీ సింగర్స్ ఏర్పడినప్పుడు, ఆమె అందులో చేరింది. గ్రేట్ బ్రిటన్, యూరప్ దేశాల్లో ఎన్నో మ్యూజికల్ షోలు ఇచ్చింది. 1871–1877 మధ్యకాలంలో తోటి సింగర్ మ్యాగీ పోర్టల్ కోల్‌తో కలిసి విస్తృతంగా పర్యటించింది. విక్టోరియా రాణి సమక్షంలో సంగీత విభావరిని నిర్వహించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఫిస్క్ యూనివర్శిటీ క్యాంపస్ కోసం నిధులు సేకరించింది. 1873లో, వీరి ప్రదర్శనకు గుర్తుగా విక్టోరియా రాణి ప్రత్యేకంగా ఈ బృందం పెయింటింగ్‌ను వేయించింది. ప్రముఖ చిత్రకారుడు ఎడ్మండ్ హావెల్ వేసిన ఆ చిత్రంలో, జెన్నీ ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 1891లో జెన్నీ జాక్సన్ కాన్సర్ట్ కంపెనీని నెలకొల్పిదంది. కేవలం సంగీతంలో మాత్రమేగాక, గాత్రంలోనూ ఆమె శిక్షణనిచ్చేంది. డబ్బింగ్‌కు, థియేటర్‌కు ఆమె శిక్షణ అప్పట్లో అత్యవసరంగా మారింది. అంతగా ఆమె ప్రతిభ వెలిగింది. అంతకు ముందే, 1884లో ఆమె ఆండ్రూ జె. డిహార్డ్‌ను వివాహం చేసుకుంది. జీవితంలో స్థిరపడింది. కానీ, 1909లో ఆండ్రూ మృతి చెందాడు. పెద్దప్రేగు కేన్సర్‌తో బాధపడుతున్న జెన్నీ 1910 మే 4ను తుదిశ్వాస విడిచింది. సంగీత సామ్రాజ్య సామ్రాజ్ఞిగా వెలిగిన జెన్నీకి, మరణానంతరం ఫిస్క్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో గౌరవించింది. సంగీతంలో మాస్టర్స్ డిగ్రీని కూడా ప్రదానం చేసింది. సంగీతం నేర్చుకునే అవకాశం లేకపోయినప్పటికీ, సంగీత ప్రపంచాన్ని ఏలిన జెన్నీ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమైంది. ఆమె ఒక వ్యక్తిగా కాకుండా ఒక శక్తిగా అభివర్ణిస్తారు. ఆ గౌరవానికి ఆమె నూటికి నూరు శాతం అర్హురాలే.

ఆమె ఆత్మవిశ్వాసం ముందు చిన్నబోయిన 'వైకల్యం'

ఒకప్పుడు వికలాంగులు... ఇప్పుడు పేరు మార్చి దివ్యాంగులు... ఏ పేరుతో పిలిచినా, వారి సమాజంలో వారి పరిస్థితి నిరాశాజనకమే. దినదిన గండంగా రోజు గడపాల్సిన దుస్థితే. పథకాలు.. ప్రోత్సహకాలు కాగితాల్లో కనిపించినంతగా, చట్టాల ద్వారా వినిపించినంతగా, వాస్తవంలో లేవన్నది చేదు నిజం. దివ్యాంగుల పరిస్థితే దారుణంగా ఉంటుందనుకుంటే, విద్యాంగ మహిళలు ఎదుర్కొనే సమస్యలు, జీవితంలో వారు ఎదుర్కొనే బాధల గురించి ఎంత చెప్పినా తక్కువే. భరించే వారికే తెలుస్తుంది ఆ వేదన. మరింత ఆత్మనూన్యతకు గురి చేసే తిరస్కరణ. అన్ని రకాలుగా ఎదురుదెబ్బలు తింటున్నప్పటికీ, విద్యాంగ మహిళలు కూడా పట్టుదలతో ఏదైనా సాధించగలరని నిరూపిస్తున్న ఘనత మారుపాక కృష్ణప్రియకు దక్కుతుంది. స్వయంగా దివ్యాంగురాలైనప్పటికీ, ఆమె స్వయం ఉపాధిని కల్పించుకుంటున్నది. తనతోపాటు మరికొంత మందికి చేయూతనందిస్తున్నది. హైదరాబాద్ మోడుప్పల్‌లో 'ఆద్య నిలయం' పేరుతో సంస్థను స్థాపించి, వికలాంగ మహిళలకు ఉచిత వసతి కల్పిస్తున్నది. నాట్యం, పాటలు, ఇతర కళల్లో శిక్షణనిప్పిస్తూ, వారిలో ఉత్సాసాన్ని నింపుతున్నది. కుట్లు, అల్లికలు, ఇతర చేతి పనుల్లో నిపుణులతో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నది. 'ఆద్య నిలయం' దివ్యాంగులకు ఆశాకిరణంగా మారడం వెనుక ఆమె కృషి, అంకిత భావం కీలక భూమిక పోషిస్తున్నాయి. వివిధ వృత్తి విద్యల్లో శిక్షణ పొందిన దివ్యాంగ మహిళలు, స్వయం ఉపాధిని కల్పించుకనే వరకూ 'ఆద్య నిలయం' వారికి అండగా నిలుస్తున్నది. ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నది. దివ్యాంగ మహిళలు, పురుషుల వివాహాలు కష్టతరంగా మారిన నేపథ్యంలో, 18 ఏళ్లు పైబడిన వారికి సంబంధాలను చూపిస్తూ, పెళ్లి జరిపిస్తున్నది. ప్రతి దివ్యాంగ మహిళ బయట సమాజంలో నిర్భయంగా బతికేలా తీర్చిదిద్దుతున్న 'ఆద్య నిలయం'లో నిత్యం వివిధ సామాజిక కార్యక్రమాలు జరుగుతునే ఉంటాయి. సమావేశాలు, ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారికి ఆహ్వానం పలుకుతున్న 'ఆద్య నిలయం' దివ్యాంగ మహిళలకు ఓ ధీమా. దాని నిర్వాహకురాలు కృష్ణప్రియ వారికి మార్గదర్శకురాలు. దివ్యాంగ మహిళలు ఎవరైనా 8341913891 (వాట్సప్ కూడా) 'ఆద్య నిలయం' నిర్వాహకులను సంప్రదించవచ్చు. సహాయం పొందవచ్చు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, ఒక దివ్యాంగురాలు తన లాంటి ఎంతో మంది అభాగ్యులను ఆదుకోవడానికి చేస్తున్న ప్రయత్నాన్ని హర్షిద్దాం. చేయూత నిద్దాం. మానవత్వాన్ని చాటుకుందాం.



పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- విశ్వనాగరిక నగరం
  ఢిల్లీ
- కార్గిల్ యుద్ధంలో ఉపయోగించిన మిస్సెల్స్ ఏవి?
  పినాక
- సుప్రీంకోర్టు ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
  1950, జనవరి 28
- 'కొలిచే ప్రమాణం' ఏ సింధు నాగరికతా కేంద్రంలో లభించింది?
  లోథాల్
- ప్లాసీ యుద్ధం తర్వాత సిరాజ్‌ఉద్‌దౌలాను బంధించి చంపిన వ్యక్తి ఎవరు?
  మీరాన్
- భారతదేశంలో ఏ చట్టం ద్వారా ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు?
  1935
- ద్రవస్థితిలో ఉండు సంయోగపదార్థం
  నీరు
- రాజ్యసభ సమావేశాలకు వీరు అధ్యక్షత వహిస్తారు :
  ఉపరాష్ట్రపతి
- 'ఉపాధి హామీ పథకం' ఎప్పుడు ప్రారంహించబడింది?
  అక్టోబర్ 1993
- 'బ్రహ్మోస్' పితామహుడు ఎవరు?
  శివథాను పిళై
- పొగాకు సాగును భారతదేశంలో ప్రవేశ పెట్టిన ఐరోపా దేశం ఏది?
  పోర్చుగల్
- కిందివాటిలో ప్రగతి క్షిపణి ఏది?
  ప్రహార్
- ఆర్టికల్ 112 కింద పార్లమెంటరీ వ్యవహార భాషలో వార్షిక వివరణ (స్టేట్ మెంట్) ను ఏమంటారు?
  బడ్జెట్
- భారతదేశంలో మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంటును ఎక్కడ నెలకొల్పారు?
  తారాపూర్
- 'భారతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ' ఎప్పుడు ఏర్పాటు చేయబడింది
  1977
- జీవ పదార్థములో నీటిశాతము .
  7080
- హిమోగ్లోబిన్లో ఒక ముఖ్య భాగము.
  ఐరన్
- దిగువ హక్కులలో ప్రాథమిక హక్కుల జాబితాలో లేనిది.
  పని హక్కు
- FAO అనగా
  ఆహారము మరియు వ్యవసాయ సంస్థ (Food and Argicultural Organisation)
- శౌర్య క్షిపణులు వేటికి రూపాంతరాలు?
  సాగరిక
- రెండు టన్నులకు పైగా బరువు ఉండే ఉపగ్రహాలను జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి కింది ఏ వాహక నౌకలను భారత్ వినియోగిస్తోంది?
  జీఎస్ఎల్వీ
- 691. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి దీర్ఘ వ్యాప్తి సబ్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఏది?
  నిర్భయ్

బిజెపి నాయకులు రాజకీయాలు మానేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలి

సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్ విలాస్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : బిజెపి ఎమ్మెల్యేలు రాజకీయాలు మాని ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం సిపిఐ ఆదిలాబాద్ ఫ్యాక్టరీని రాష్ట్రానికి బదిలీ చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, బురద రాజకీయాలు చేయడం మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పునరుద్ధరించాలని విశాఖపట్నంలో జరుగుతున్న జాతీయ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. సిపిఐ పార్టీ తరుపున పార్లమెంటు సమావేశంలో లేవనెత్తారని, బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే సిపిఐ ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు.

మంత్రి పర్యటన ముఖ్యం కాదు బాధితులను ఆదుకోవాలి

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో బాధితుల సమస్యలు పరిష్కారం కావని ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతుల పంటలను అంచనా వేసి, వరదలు ముంపు గురైన కాలనీ వాసులందరిని ఆదుకోవాలని, నిర్మల్‌లో జిఎన్ఆర్ కాలనీ శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని అన్నారు.

సమ్మయ్యకు సిపిఐ నాయకుల నివాళి

ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ / కరీంనగర్ ప్రతినిధి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ తండ్రి అయిన కలవేన సమ్మయ్య మంగళవారం మృతి చెందగా మంచిర్యాలలో ఆయన భౌతిక కాయాన్ని జిల్లాకు చెందిన సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమ్మయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి తదితరులు ఉన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆయన మృతదేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలతో ఘన నివాళులుర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, బోనగిరి మహేందర్‌లు పాల్గొన్నారు

ఆదుకోవాల్సిన సమయంలో రాజకీయాలు తగవు

● 1.10 లక్షల ఎకరాల్లో పంట నష్టం ● నిరాశ్రయులైన 15వేల మంది ● ప్రతి కుటుంబానికీ రెండు లక్షల పరిహారం ఇవ్వాలి ● ఎకరాకు రూ. 50వేలు తక్షణ సాయం అందించాలి ● జాతీయ విపత్తుగా గుర్తించాలి : సిపిఐ నేత బాగం

ప్రజాపక్షం/ ఖమ్మం : మునుపెన్నడు లేని రీతిలో ఖమ్మంజిల్లాను వరదలు ముంచేత్తాయని ఆదుకోవాల్సిన సమయంలో రాజకీయాలు తగవని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ప్రజలను ఆదుకునేందుకు మాత్రమే ప్రాధాన్యతనివ్వాలని సంఘటితంగా పోరాడి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని ఆయన సూచించారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల కాలంలో ఏనాడు చవిచూడని విపత్తును ఖమ్మంజిల్లా చవిచూసిందన్నారు. ఖమ్మం నగరంతో పాటు వివిధ గ్రామాలలో 15వేల కుటుంబాలు నిరాశ్రయులయ్యారన్నారు. సమాచార లోపం, అధికార యంత్రాంగం, నిర్లక్ష్యం భారీ నష్టానికి కారణమైందని వేలాది మంది కట్టు బట్టలతో బయటపడ్డారని హేమంతరావు తెలిపారు. ముంపుకు గురైన ప్రతి కుటుంబానికి రెండు లక్షల రూపాయలు తక్షణ పరిహారంగా అందించాలని, నెల రోజులకు సరిపడ నిత్యావసర వస్తువులను ప్రభుత్వం అందించాని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు అందించాలని, ల్యాప్‌టాప్ పొగొట్టుకున్న వారికి, ధృవపత్రాలు పొగొట్టుకున్న వారికి తక్షణం సాయం అందించాలన్నారు. ఖమ్మం జిల్లాలో ఆరు లక్షల ఎకరాలు సాగు చేస్తే 1.10 లక్షల ఎకరాల్లో మిర్చి, వరి, పత్తి, అపరాల పంటలు దెబ్బతిన్నాయని నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ. 50వేల ఆర్థిక సాయం అందించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు భట్టివిక్రమార్క, తుమ్మల నా గేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించిన తీరు అభినందనీయమన్నారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని, ఇప్పటికే ప్రజ లు జ్వరం, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని హేమంతరావు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రం ప్రస్తుత పరిస్థితిని జాతీయ విపత్తుగా గుర్తించి ఆర్థిక సాయం అందించాలని హేమంతరావు కోరారు. నునావత్ అనూష కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలన్నారు. మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలు ప్రభుత్వమే అధికారంగా నిర్వహించాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయం అనుమల లింగయ్య భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిధిగా హజరై ఆయన మాట్లాడారు.ఈ నెల 11,12,13 తేదీల్లో సూర్యాపేట జిల్లాలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.భూస్వాములకు,దొరలకు,నిజాం ఆరాచాలకు వ్యతిరేకంగా,వెట్టిచాకిరి నిర్మూలనే లక్ష్యంగా సిపిఐ నాయకత్వంలో జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జిల్లాలో వాడవాడలా జరపాలని పార్టీ శ్రేణులను కోరారు.ప్రపంచంలోనే అతిపెద్ద సాయుధ పోరాటం సిపిఐ నాయకత్వంలో తెలంగాణలో జరిగిందని, భూస్వాములు, జాగీర్దార్‌ల చేతిలో ఉన్న లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచి,వేలాది గ్రామాలను విముక్తి చేసింది కమ్యూనిస్టులది అన్నారు. సాయుధ పోరాటంలో 4 వేల మంది వీరులను త్యాగం చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని,ఆ వీరుల త్యాగాలను వాడవాడలా స్మరించు కోవాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు.సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి,కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు,పోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఎఐటియుసి సిరిసిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

ప్రజాపక్షం /వేములవాడ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వేములవాడ మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం నాడు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 9న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల కు పిలుపునిచ్చారు. 9,10వ తరగతి బిల్లులు వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పదివేల జీతం ఇస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని అన్నారు. సెప్టెంబర్ 9న జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని మిడ్ డేవిల్స్ జిల్లా ప్రధాన కార్యద ర్శి మీసం లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బిరెడ్డి లక్ష్మి , మానస, కలపెల్లి లావణ్య, సత్తవ్వ, రజిత, నర్సవ్వ, పుష్పలత, అంతవ్వ, పోచవ్వ, నరసవ్వ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మేయర్ పదవులకు రాజీనామా చేయాల్సిందే

సిపిఐ కరీంనగర్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ నగరంలో వరదలు, విషజ్వరాలు వచ్చి ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్రావు ఎక్కడున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బందులు వారికి పట్టవా? అని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటా తిరిగి ఓట్లు పూర్తయిన తర్వాత ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వారు ప్రజలకు దూరంగా ఉంటూ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. వెంటనే ఎమ్మెల్యే, మేయర్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉండి వరదల సమయంలో మనోధైర్యం కల్పించాల్సిన నగర మేయ ర్ విదేశీ పర్యటన మోజులో ఉన్నాడు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకునే స్థితిలో లేకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఎమ్మెల్యే, మేయర్ ప్రజాక్షేత్రంలో వచ్చి సమస్యలు పరిష్కరించాలని , లేని పక్షంలో వీరు వారి పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

ప్రజాపక్షం / పాన్‌గల్ : వనపర్తి జిల్లాలో భారీ వర్షాలకు ఇండ్లు పంటలు ఆస్తులు కోల్పోయిన వారికి యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం సహయం అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కె. శ్రీరాం ప్రభుత్వాన్ని కోరారు. పాన్‌గల్ మండలం కేతేపల్‌లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలా చోట్ల చెరువులు, కుంటలు భీమా కెఎల్ఐ కాలువలు దెబ్బతిన్నాయని యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం భారీ వర్షాలకు వనపర్తి జిల్లా 114 ఇండ్లు పాక్షికంగా , ఒక ఇల్లు పూర్తిగా కూలిపోయిందన్నారు. అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపు ఉండే అవకాశం ఉందన్నారు. పూర్తిగా కూలిపోయిన ఇంటికి రూ.25వేలు, 15 కిలోల బియ్యం, దుస్తులు, పాక్షికంగా కూలిన ఇంటికి రూ. 15వేలు తక్షణ సహయంగా అందించాలన్నారు. ఎకరానికి రూ. 20వేలు తక్షణ సహయం అందించాలన్నారు. వేరుశనగ, మి నుము విత్తనాలు వేశారని భారీ వర్షాలకు నీళ్లు నిలిచి మొలకెత్తక నష్టపోయారన్నారు. ఆము దం, పత్తి, మొక్కజొన్న తదితర మిట్ట పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టం పడిపోయిన ఇండ్లపై వెంటనే సమగ్ర సర్వే జరిపించి ఎకరాకు రూ.20వేలు సహయం అందించాలని కోరారు. వీపనగండ్ల కల్వరాళ్ల వద్ద భీమా కాలువ గండి పడిందని, పెద్ద మందడి మండలం జగ్గమాయిపల్లి ఈర్ల చెరువు , కెఎల్ఐ కాల్వకు గండిపడిందని, పాన్‌గల్ మండలం బొల్లిగట్టు వద్ద భీమా కాలువ, కేతేపల్లి వద్ద డి.24 కాలువ తెగిందన్నారు. గోపాల్‌పేట మండలం బుద్దారం చెరువు కెఎల్ఐ కాల్వ గండి పడిందని ఇంకా పలుచోట్ల చెరువులు, కాలువలు దెబ్బతిన్నాయని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి పంటలకు నీరు అందించాలని కోరారు. లక్ష్మీ నారాయణ, కాశన్న, కురువ హన్మంతు, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

'కాళోజీ నారాయణరావు అవార్డు' కమిటీ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: 'కాళోజీ నారాయణరావు అవార్డు'కు అర్హులైన సాహితీవేత్తను ఎంపిక చేసేందుకు ప్రముఖ కవి అందెశ్రీ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మొదటి సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం జరిగింది. కమిటీ సభ్యులు ఏనుగు నర్సింహారెడ్డి, సంగనభట్ల నర్సయ్య, పొట్లపల్లి శ్రీనివాస్, మెంబర్ కన్వీనర్ మామిడి హరి కృష్ణ పాల్గొన్నారు. ఈ అవార్డుకు దాదాపు 40 మంది సాహితీవేత్తలు దరఖాస్తు చేసుకున్నారు.

చేనేత వస్త్రాలు వినియోగించాలి : పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్ : సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చేనేత రంగంలో ఉత్పత్తి అయిన వస్త్రాలు, శాలువాలను ఉపయోగిస్తే నేతన్నలకు ఆర్థికంగా సహకారం అందించినట్లు అవుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టీచర్స్ డే, గణేష్ ఉత్సవాల సందర్భంలో కాటన్ శాలువలు వినియోగించాలని కోరారు. బయట రాష్ట్రాల నుండి ఉత్పత్తి అయ్యే సింథటిక్ శాలువాల బదులు మన తెలంగాణాలో మన నేతన్నలు ఉత్పత్తి చేసే కాటన్ వస్త్రాలను బహుమానంగా ఇవ్వాలని మంత్రి కోరారు. చేనేత వినియోగం పర్యావరణానికి అనుకూలంగా ఉండటంతో పాటు నేతన్నలకి అండగా ఉంటుందన్నారు.

వాతావరణ కేంద్రాలను పరిశీలించిన
హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ (హైడ్రా) అమీర్‌పేటలోని ఆర్థిక, సామాజిక అధ్యయనాల కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆటోమేటిక్ వాతావరణ కేంద్రం పని చేసే విధానం, వర్షపాతం కొలతలు ఎలా జరుగుతున్నాయనే అంశాలను ఆయన పరిశీలించారు. ఖైరతాబాద్ చింతల్‌బస్తీలోని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘాన్ని సందర్శించారు. వర్షపాతం అంచనా, వాస్తవ వర్షపాత డేటాను పరిశీలించారు. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌ను సందర్శించి, శాటిలైట్ మ్యాప్‌లకు సంబంధించిన డేటాను పరిశీలించారు.

ఆర్థికసాయం అందించాలి : సిపిఐ

ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా భారీవర్షాల కారణంగా నష్టపోయిన రైతులను, ప్రజలకు ఆర్థిక సహాయం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆందోజు రవింద్రాచారి, ఎల్.బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ హయత్ నగర్ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో నష్టపోయినవారిని ప్రభుత్వం అందుకోవాలని, మరిణించిన కుటుంబాలకు పది లక్షల ఏక్స్ గ్రేషియాన్ ఇవ్వాలని, అంటు వ్యాధులుతోబాటు వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన అన్ని విధాల చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డివిజన్ అభివృద్ధికి సహకారం

ప్రజాపక్షం/వనస్థలిపురం : ఎల్‌బి నగర్ సర్కిల్ 4లో నూతనంగా డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఇస్లావత్ సేవా నాయక్‌ను మంగళవారం వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణ కాలనీ అధ్యక్షులు నవీన్, యాదవ్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి
జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలికి కార్పొరేటర్లు వినతి

ప్రజాపక్షం/వనస్థలిపురం: ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్, హయత్ నగర్, నాగోల్ డివిజన్ల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని బిఎన్‌రెడ్డి, హయత్ నగర్, నాగోల్ కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్‌లు జిహెచ్ ఎంసి కమిషనర్ ఆమ్రపాలిని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారు కాలనీల్లో డ్రైనేజీ పైప్‌లైన్, విద్యుత్ స్తంభాలు, మంచి నీరు పైప్‌లైన్, సీసీ రోడ్లు, మౌళిక సదుపాయలు కల్పనకు నిధులు కొరత తీవ్రంగా ఉందని తక్షణమే నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. కొన్ని కాలనీల్లో సంక్షేమ భవనం, పార్కులు సుందరీకరణ చేయాల్సి ఉందని వారు పేర్కొన్నారు. ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి నిధులు మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తామని కమిషనర్ తెలిపినట్లు కార్పొరేటర్లు తెలిపారు.

డెంగీ వ్యాధి వస్తే భయపడాల్సిన అవసరం లేదు : డిఎంహెచ్‌ఒ

ప్రజాపక్షం/షాద్‌నగర్: డెంగీ వ్యాధి వచ్చిందని ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, అందుకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులు సిద్ధంగా ఉన్నాయని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు వివరించారు. మంగళవారం షాద్‌నగర్ కమ్యూనిటి ఆసుపత్రిలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 57రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామని, అన్ని వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశల ద్వారా 50ఫీవర్ సర్వేలు చేయడం జరుగుతుందన్నారు. మంచినీటి పైపులైన్లు లీక్ కావడంతో నీరు కలుషితమై కొన్ని రకాల వ్యాధులు వస్తాయని వివరించారు. డెంగీ ఇచ్చినప్పుడు మనిషి శరీరంలో రక్తనాళాలు క్రమంగా తగ్గుతుంటాయని, వాటి పట్ల భయపడాల్సిన పనిలేదని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, సిసి సురేష్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి అంతమే..ఎక్సైజ్ పంతం

వ్యాపారుల్లో పరివర్తన వచ్చే వరకు దాడులు కొనసాగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గంజాయి నిర్మూలనకు ఎక్సైజ్ పోలీసులు జూలై 17 నుంచి ఆగస్టు 31 వరకు 53 రోజుల పాటు 'ఆపరేషన్ దూల్‌పేట్' విజయవంతంగా సాగింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 34 కేసులు నమోదు చేసి 207 కిలోల గంజాయి, 4.2 కిలోల హషిష్ ఆయిల్‌ను పట్టుకున్నారు. 66 మందిని గంజాయి కేసుల్లో జైల్లోకి పంపించగా, మరో 61 మంది దూల్‌పేట్ వదిలి పారిపోయారు. ఇక 33 మందిని బౌండోవర్‌తో పర్యవేక్షణలో ఉంచారు. ఆగస్టు 31వరకు ఆపరేషన్ దూల్‌పేట్ అగిపోతుందని అనే భావనలో ఉన్నవారికి ఆపరేషన్ నిరంతరం అని ప్రకటించగానే వారి ఆశల్లో నీళ్లు చల్లినట్లయ్యిందని అధికారులు అంటున్నారు.

జూలై 17 నుంచి నడుస్తున్న 'ఆపరేషన్ దూల్‌పేట్'

జూలై 17న ఆపరేషన్ దూల్‌పేటను ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్‌టిఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డికి ఆపరేషన్ దూల్‌పేట్ బాధ్యతలను అప్పగించారు. అడిషనల్ ఎస్‌పి భాస్కర్ నేతృత్వంలోని ఇద్దరు డిఎస్‌పిల టీమ్‌లతో కలిసి 12 నుంచి 15టీమ్లు నిరంతర దాడులు నిర్వహిస్తున్నాయి,

నిరంతరం నిఘా : కమలాసన్‌రెడ్డి

ఆపరేషన్ దూల్‌పేట్ ఇక నుంచి నిరంతరం కొనసాగుతునే ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే పాత నేరస్తులపై నిఘా పెంచాము. జైలు నుంచి బెయిల్‌పై విడుదలై వచ్చిన వారికి కౌన్సిల్ ఇస్తున్నాము. తిరిగి వారు నేరం చేస్తే రానున్న రోజుల్లో శిక్షలు కఠినంగా ఉంటాయి. గంజాయి, డ్రగ్స్ పూర్తిగా నిర్మూలన జరిగే వరకు దాడులు కొనసాగుతాయి. ఎవ్వరిని వదిలి పెట్టే ప్రసక్తి లేదు.

హుస్సేన్‌సాగర్ బఫర్‌జోన్
వివరాలివ్వండి : హైకోర్టు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల వివరాలు అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ ఆదేశించారు. హుస్సేన్‌సాగర్ వద్ద తమ ఇండ్ల స్థలాల రక్షణకు ఫెన్సింగ్ వేస్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని శరణప్పస్వామి ఇతరులు వేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు పైవిధంగా ప్రభుత్వాన్ని వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.

వివరణ తీసుకోండి

హైదరాబాద్ : శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట వద్ద ఉన్న దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ఏరియాలోని కట్టడాల కూల్చివేతలకు అధికారులు ఇచ్చిన కూల్చివేత నోటీసులను సవాల్ చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బెంచ్ విచారించింది. కూల్చివేత నోటీసులను షోకాజ్ నోటీసులుగా మార్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై బాధితులు ఇచ్చే వివరణ, వాళ్ల దగ్గరున్న ఆధారాలు పరిశీలించాకే తదుపరి చర్యలు ఉండాలని ఆదేశించి పిటిషన్లపై విచారణ మూసివేసింది. ఇదే విధమైన ఉత్తర్వులు వరంగల్ భద్రకాళీ చెరువు వద్ద ఇళ్ల కూల్చివేతల కేసులో కూడా జారీ చేసింది.

కులగణనకు రోడ్ మ్యాప్ ప్రకటించాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిల కులగణనకు రోడ్డు ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమగ్ర కులగనణ చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ గత పది రోజులుగా గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన భత్తుల సిద్దేశ్వర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోక పోవడం ఏమిటని, ప్రజాపాలన అంటే ఇదేనా అని, ప్రజాపాలనలో బిసిల ప్రాణాలు పోతున్న ప్రభుత్వానికి పట్టద అని శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్దేశ్వరుని ఇతర బిసి సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే వాళ్లను ప్రభుత్వం గౌరవించి చర్చించాల్సింది పోయి



ఆమరణ నిరహారా దీక్షచేస్తున్న పది రోజులైనా ప్రభుత్వం వైపు నుండి పలకరించకపోవడం, ముమ్మాటికి బిసిలను అవమానించడమేనని ఆయన అన్నారు. బిసిల ప్రాణాలు అంటే ప్రభుత్వానికి లెక్క లేదా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి కేంద్ర ప్రభుత్వ బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దానకర్ణ చారి, నాయకులు రామరాజు, రవికుమార్, చెన్నయ్య, పుటం పురుషోత్తం, రఘురాం నేత, తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలు, సెల్లార్లపై
దృష్టి సారించిన జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరుస వర్షాలతో నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ, జిహెచ్‌ఎంసి యంత్రాంగం చర్యలు చేపట్టింది. పురాతన శిథిలావస్థకు చేరిన భవనాలపై జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం చర్యలకు ఉపక్రమించింది. డైరక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి, జిహెచ్‌ఎంసి చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్మాణ సంస్థలకు సూచనలు చేశారు. ఇప్పటికే చేపట్టిన అధ్యయనంలో 596 శిథిల భవనాలు లెక్క తేలాయి. అందులోని 344 భవనాలపై చర్యలు తీసుకున్నామని, 129 భవనాలను ఖాళీ చేయించామని, నాలుగింటి తాళం వేశామని అధికారులు చెప్పారు. యజమానులతో 107 భవనాలకు మరమ్మతులు చేయించామన్నారు. నిర్మాణం

లోని సెల్లార్లను అధికారులు తనిఖీ చేశారు. నగర వ్యాప్తంగా దాదాపు 100సెల్లార్లను పరిశీలించామని చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్ తెలిపారు. క్షేత్ర స్థాయిలో జోనల్, సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సైతం సెల్లార్లను పరిశీలించారు. సెల్లారు అంచన ఉన్న నివాసాలను ఖాళీ చేయించడం, ప్రహరీలు లేని చోట ఇసుక బస్తాలను ఏర్పాటు చేయించడం, ఇతరత్రా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో సిఎస్కే విల్లాల నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు కళ్ళప్పగించి చూస్తున్నారని మాజీ శాసన సభ్యులు, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు ఆరోపించారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని గోల్డెన్ ఫార్క్, మామిడికుంట చెరువు, జాలాదికుంట, బొబ్బిలి చెరువు ప్రాంతాలను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ నీటి పరివాహక ప్రాంతాలు, చెరువులు, కుంటలు, పాటు కాలువల ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట వద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికి వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా నిర్మాణాలను యదేచ్ఛగా చేస్తుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏళ్ల చరిత్ర కలిగిన కట్టడాలు, నీటి వనరులు కల్పించే వాటిని ధ్వంసం చేసి నిర్మాణాలు చేయడం బారి తరాలకు ఏమి సంకేతం ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా యదేచ్ఛగా విల్లాలు నిర్మిస్తుంటే మున్సిపల్, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎస్కే విల్లాల నిర్మాణాల్లో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయని, మితగా

వాటిని లేవని, ప్రజలకు నష్టం వచ్చినప్పుడు మాత్రమే పాలకులు హడావుడి చేస్తారే తప్పా మిగతా సమయంలో స్పందించరని వివరించారు. చెరువులు, కుంటలను కబ్జాకు గురి చేయడంతోనే వర్షాలు వచ్చినప్పుడు నీళ్ళు ఇళ్ళల్లోకి వస్తున్నాయని వివరించారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయడంతోపాటు ఏళ్ళ చరిత్ర కలిగిన నిర్మాణాలను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులు, కుంటలకు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల హద్దులను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపిఉపాధ్యక్షుడు సామ రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంధం ఆనంద్, కుమార్‌గౌడ్, కౌన్సిలర్ బచ్చలి నర్సింలు, నాగులపల్లి పాల్గొన్నారు.

చెరువులు, కుంటల రక్షణకు చర్యలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: చెరువులను, కుంటలను అన్యాక్రాంతం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ సమీపంలోని వీరమోని చెరువు నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన ప్రహారీ గోడను, కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను ఉపయోగ పడే నీటి వనరులను ఎవరు ధ్వంసం చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువులు, కుంటలను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎవరైనా పాటు కాలువలను ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. చెరువు నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన ప్రహారీ గోడ నిర్మించడం సరికాదని, తక్షణమే తొలగించేందుకు పట్టాదారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంతో ఇరిగేషన్ శాఖ అధికారులు ఆ పనులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. నీటి వనరులను రక్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందని వివరించారు. కబ్జాలకు గురైన చెరువులు, కుంటలను, పాటు కాలువలను రక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా తీసుకువచ్చారని గుర్తు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట... విద్యారంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాల

యంలో మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతనంగా కంప్యూటర్‌ను బహుకరించడంతోపాటు కళాశాలలో పనిచేస్తున్న స్వీపర్, వాచ్‌మెన్‌లకు ఏడాది జీతాలకు ఎమ్మెల్యే వేతనం నుండి రూ.72వేల చెక్కులను మాజీ శాసన సభ్యులు బక్కని నర్సింలు చేతుల మీదుగా కళాశాల సిబ్బందికి ఇప్పించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంధించేందుకు అధ్యాపకులు కృషిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంజుల, కళాశాల అభివృద్ధి కమిటి చైర్మెన్ శ్యామ్, గ్రామ కమిటి అధ్యక్షుడు అంబటి రాజు, మాజీ ఎంపిటిసి వెంకటేష్‌గుప్తా, పాఠశాల అభివృద్ధి కమిటి చైర్మెన్ రేఖల మల్లేష్, అధ్యాపకులు ప్రశాంత్, శ్రీశైలం, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రఘు, కుమార్‌గౌడ్, చంద్రశేఖర్, సింగారం సుదర్శన్‌లు ఉన్నారు.

చెరువుల ఆక్రమాలకు
అడ్డుకట్ట వేయండి

హైడ్రా కమిషనర్‌కు మధుయాష్కీ గౌడ్ ఫిర్యాదు

ప్రజాపక్షం/వనస్థలిపురం : ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు, కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మంగళవారం హైడ్రా కమిషనర్ ఎవి రంగానాథ్‌ని కొరారు. ఈ మేరకు కమిషనర్‌కు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని పలు చెరువులు ఎఫ్‌టీ ఎల్, బఫర్ జోన్లలో ఆక్రమంగా కొత్త నిర్మాణాలు పుట్టుకొస్తూ ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో యదేచ్ఛంగా భారీ భవంతులు నిర్మాణాలు పట్టుకొచ్చాయన్నారు. చెరువుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ నిర్మాణాలను కూడా తొలగించి మరీ ఆక్రమణలు పాల్పడుతున్నారన్నారు. బైరామాల్ గూడలోని చెరువు ఆరున్నర ఎకరాలకు గాను రెండు ఎకరాలు మిగిలిందన్నారు.ఎఫ్టిల్, బఫర్ జోన్‌లో ఆక్రమణలు తొలగించాలని కోరారు. మన్సూరాబాద్ చిన్న చెరువులో ఎఫ్ టీ ఎల్,బఫర్ జోన్‌లో భారీ భవనాలు నిర్మించారని కోరారు. ఫతుల్లాగూడ చెరువు పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కూడా తొలగించి నిర్మాణాలు చేపట్టారన్నారు. హస్తినాపురంలోని చేపల చెరువు కనీసం ఆనవాళ్లు లేకుండా పోవడం దారుణమన్నారు. సర్వే నెంబర్ 58లో 14 ఎకరాలు విస్తీర్ణంలో ఉండేది. భూకబ్జాదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.సాహెబ్ నగర్‌లోని కాప్రాయి చెరువు మొత్తం విస్తీర్ణం 57ఎకరాలు, గతంలో ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి వరకు హద్దులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 13 ఎకరాలు మిగలడం చెరువులను ఎలా చెరపెట్టారన్న దానికి నిదరనం అన్నారు. 2020లో కురిసిన భారీ వర్షాలకు చెరువుల వాస్తవ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధి తేలిందన్నారు. కానీ ఆక్రమణలు మాత్రం ఆగటం లేదని, ఇకనైనా వాటిని నిలువరించాలన్నారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు, సరూర్ నగర్ చెరువు, బండ్ల గూడ చెరువు, హయత్ నగర్‌లోని కుమ్మరి కుంట, బాతుల చెరువు, హతి గూడ చెరువు తదితర నియోజకవర్గంలోని చెరువుల ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్‌ను ఫిర్యాదులో పేర్కొన్నారు.

పంటల సంరక్షణకు తగిన జాగ్రత్తలు : ఎఒ

ప్రజాపక్షం/షాబాద్ : నిరంతరం కురుస్తున్న వర్షాల నుండి పంటల సంరక్షణపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండలంలో భారీవర్షాల కారణంగా అధికంగా పత్తి పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పని సరిగా పాటించాలన్నారు. రైతులు సాగు చేసిన పత్తి పంటల సాగు పొలం నుండి వరద నీరును కాలువలు చేసి భయటకు పంపించాలని సూచించారు. పొలంలో నీరు నిల్వ లేకుండ చేయడం వలన పత్తి మొక్కలు వేపుగా పెరుగుతాయని వివరించారు. వాతవరణం చల్లగా ఉన్నందున పత్తి చేనుకు మందులు పిచికారి చేయడం మంచిది కాదన్నారు. ఎండు ఆకు తెగులు నివారించేందుకు, నీటి శాతం పెరిగి మొక్కలు చనిపోకుండా, పత్తి మొక్కల అడుగు వేర్ల కాండంకుళ్లు తెగులు ఆశించకుండా చర్యలు చేపట్టాలన్నారు.

వర్షాల నష్టపరిహారానికి నివేదికలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: నష్టపరిహారానికి సంబంధించిన నివేదికలను వెంటనే అందజేయాలనీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక అధికారులను ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు,పూర్తిగా నష్టం జరిగిన ఇండ్ల వివరాలను సేకరించడం తోపాటు చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయుటపై మంగళవారం జిల్లా కలెక్టర్ శశాంక ఆర్‌డిఒలు,తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో దాదాపు 40 ఇండ్లు పాక్షికంగా, రెండు ఇండ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు గుర్తించామని, వీటికి సంబంధించి ఏ మేరకు నష్టం వాటిల్లిన వివరాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాక్షికంగా, పూర్తిగా ధ్వంసమైన ఇండ్ల నష్టపరిహారానికి సంబంధించిన నివేదికలు వెంటనే కలెక్టరేట్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమిష్టిగా నాలాల పరిసరాలను పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఆర్‌డిఒ లు, తహసీల్దార్లు తమ పరిధిలోని ఏదైనా విలువగల ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే వెంటనే వాటికి కంచె వేయుటకు

చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని 100 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటి వరకు 925 చెరువులలో 99 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా 820 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయవలసి ఉన్నదని, వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి వారానికి 30 నుండి 40 చెరువులను సర్వే నిర్వహిస్తే సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కోర్టు కేసులకు సంబంధించి ఆయా కోర్టులలో అధికారులు తగిన సమాచారం అందించి స్పందించాలని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో లాండ్ ప్రొటెక్షన్ అధికారి కెఎస్ బి. కుమారి,ఆర్‌డిఒలు, మండలాల నుండి తహశీల్దార్లు పాల్గొన్నారు.

మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి | వికారాబాద్

చెరువులను పరిశీలించిన ఎంఎల్ఎ, సిఐ

పజాపక్షం/చర్లపల్లి: ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్ల కోసం ఎంఎల్ఏతో పాటు కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ సిఐ అంజయ్యతో కలసి కాప్రా చెరువును పరిశీలించారు. కాప్రా చెరువులో వినాయక నిమజ్జన సందర్భంగా తీసుకోవాలని చర్యలపై అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని, చెరువు వద్ద జాగ్రత్తలు పాటించి పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాపక్షం / కొడంగల్ : ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు రోడ్డు విధ్వాంసం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పాడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో చేసేది ఏమిలేక తనసొంత డబ్బులతో రోడ్డు మరమతు పనులు చేసిన ఘటన కొడంగల్ మండలం లో చోటుచేసుకుంది. పోచమ్మతాండ నూతన గ్రామ పంచాయతీలోని మైసమ్మ తాండకు తారురోడ్డు భారీ వర్షాలకు కోట్టుకుపోయి రాకపోకలకు తీ వ్ర అంతరాయం ఏర్పాడింది. గత ప్రభుత్వ హాయంలో మైసమ్మతాండ వాగుపై వంతెన నిర్మించారు. దీంతో సమస్య తీరిందనుకుని సంతోషించారు తాండవాసులు కానీ ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు వంతెనపై నుంచి కాకుండా వాగు కట్ట తెగిపోయి రోడ్డుపై నుంచి పారుతు రోడ్డును విద్వాంసం చేసింది.

అంగన్‌వాడీ సెంటర్ల పరిశీలన

ప్రజాపక్షం/దుండిగల్ : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ దుందిగల్, బహదూర్ పల్లి లోని అంగన్వాడి సెంటర్‌ను సందర్శించారు. అదేవిధంగా దుండిగల్ మున్సిపల్ ఆఫీస్ దగ్గరలో ఉన్నటువంటి ఓల్డ్ ఏజ్ హోమ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి డిస్టిక్ సిపిడిఓ శారద గండి మైసమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ బాబు, మోసెస్, గండి మైసమ్మ ఎమ్మార్వో సయ్యద్ అబ్దుల్ మతిన్, మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణ రావు, దుండిగల్ అంగన్వాడి ఇంచార్జ్ శోభారాణి, అంగన్వాడీ టీచర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బిడ్జి పనులు వేగవంతం

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కేంద్రాంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరి చందన అధికారులను అదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆర్అండ్‌బి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న పనులు వేగవంతం చేసి ముడు మాసాలలో పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణపన్నుల్లో ఎలాంటి అవకతవకలు తావు నివ్వకుండా నాణ్యతను పాటించాలని అధికారులను అదేశించారు. కొడంగల్‌లో చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో 96 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ,ఇంజనీర్లు రాజేశ్వర్‌రెడ్డి , వసంతనాయక్ , ఇఇ శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

నేడు పాత్రికేయులకు వర్క్‌షాప్

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం కేంద్ర ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో పాత్రికేయులకు వార్తాలాప్ అన్న అంశంపై మీడియా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ జిల్లా కలెక్టర్ గౌతం గౌ రవ అతిథిగా పాల్గొంటున్నారు. పాత్రికేయులకు సైబర్ క్రైమ్, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామని, పాత్రికేయులు తప్పనిసరిగా ఈ వర్క్‌షాప్‌కుహాజరవ్వాలనిజిల్లాపౌరసంబంధాలశాఖాధికారిఅరుంధతి కోరారు.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: ఈదురు గాలులతో గత మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో మల్కాజిగిరి నియోజకవర్గంలో చెట్లు, విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. ప్రధాన రహదార్లతో పాటు కాలనీలు, బస్తీల్లో రహదార్లపై పెద్ద గుంతలై నీరు నిలిచి పోవటంతో వాహనదార్లు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేరేడ్‌మెట్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ ప్రధాన రహదారిలో చెట్టు విరిగిపడింది. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేక పోవటంతో ప్రాణాపాయం తప్పింది. అధికారులు, వెంటనే స్పందించి రోడ్డుపై పడ్డ చెట్టును తొలగించాలని స్థానికులు కోరారు. ఆర్‌కె పురం బ్రిడ్జి దాటాకా ఏఓసి రహదారిలో ఓ విద్యుత్ స్థంభం నేలకొరిగింది. అనేక బస్తీలతో పాటు కాలనీలలో నీరు వరదల్లా పారి సమీపంలోని అపార్ట్‌మెంటు సెల్లార్లలోకి చేరాయి. కురిసిన భారీ వర్షపు నీటి ప్రవాహంతో కొట్టుకు వచ్చిన చెత్తా చెదారాన్ని తొలగించి అంటు వ్యాధులు సోకకుండా జిహెచ్ఎంసి అధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్

ప్రజాపక్షం/దుండిగల్ : కొంపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశానికి మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో అన్నీ వార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు రోడ్లు, మురుగు నీటి కాలువలు, కల్వర్టు, విధి దీపాలు, బి.సి, ఎస్సి కమ్యూనిటీ హాల్స్ శ్మశానవాటికలు పబ్లిక్ టాయిలెట్స్ పార్కుల సంరక్షణ మున్సిపల్ అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీహరి, వైస్ చైర్మన్ రాత్లవాత్ గంగయ్య నాయక్, కౌన్సిల్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్న ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : గత సంవత్సర కాలంగా శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కాబడిన మొబైల్ ఫోన్‌లను ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ రికవరి చేసి బాధితులకు మంగళవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సంవత్సర కాలంగా 19 మొబైల్ ఫోన్‌లను చోరీ అయ్యాయని తెలిపారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారని చెప్పారు. దొంగిలించబడిన ఫొన్‌లను దర్యాప్తులో భాగంగా రికవరీ చేశామని చెప్పారు. 11మొబైల్ ఫోన్‌లను శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు అప్పగించామని చెప్పారు. బాధితులు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌కు, సిబ్బందికి దన్యవాదాలు తెలిపారు. మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైతే వెంటనే శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయాలని అన్నారు.

మున్సిపాలిటీలలో చేరనున్న ప్రలు గామాలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విదుదల చేసిన గెజిట్ ప్రకారం మేడ్చల్ జిల్లాలోని మున్సిపాలిటీలలోకి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని 51 గ్రామాలు విలీనం కానున్నాయి. దీంతో ఇప్పటి వరకు పంచాయతి అధికారుల చేతుల్లో ఉన్న రికార్డులన్నీ మున్సిపల్ అధికారుల చేతుల్లో చేరనున్నాయి. మేడ్చల్ మున్సిపాలిటీలోకి 23 వార్డులతో ఉన్న పూడూర్, రాల్లాపూర్ గ్రామాలు, దమ్మాయిగూడ మున్సిపాలిటీలోకి 18 వార్డులతో ఉన్న కీసర, యాద్గారిపల్లి, అంకిరెడ్డిపల్లి, చేర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలు, నాగారం మున్సిపాలిటీలోకి 20 వార్డులున్న బోగారం, గోదుమకుంటం, కరీంగూడ, రాంపల్లి దాయర గ్రామాలు, పోచారం మున్సిపాలిటీలోకి 18 వార్డులున్న ప్రతాపసింగారం, కొర్రెముల్, కాచివానిసింగారం చౌదరిగూడ గ్రామాలు, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోకి 18 వార్డులున్న అంకుషాపూర్, ఔషాపూర్, మాధారం, ఏదులాబాద్, ఘణ్‌పూర్, మర్పల్లిగూడ గ్రామాలు, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలోకి 15 వార్డులున్న మునిరాబాద్, గౌడవెల్లి గ్రామాలు, తూంకుంట మున్సిపాలిటీలోకి 16 వార్డులున్న బొమ్మరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ గ్రామ పంచాయతిలు విలీనం అవుతున్నాయి.

ఫీర్జాదిగూడలో కమిషనర్‌కు కాసులు కురిపిస్తున్న
అక్రమ కట్టడాలు

ప్రజాపక్షం/బోడుప్పల్: అక్రమార్కులకు అధికారులు అండగా నిలువడంతో ఫీర్జాదిగూడ నగర పాలక సంస్థ లో కమిషనర్ కు కాసులు కురిపిస్తున్నడానికి అక్రమ కట్టడాలు, షెడ్లు నిదర్శనం, అక్రమ కట్టడాలను ఉన్నతాధికారులు కూల్చివేయకుండా ఏలా కాపాడుకోవాలో అక్రమార్కుకులకు అవుట్ సోర్సింగ్ సిబ్బంది మధ్యవర్థిత్వం వహించి నోటీస్‌ల పేరుతో సెటిల్ మెంట్లు చేసి రేటు కుదరగానే నిర్మాణాలు చేసుకోమని ఉచిత సలహా ఇస్తున్నారంటే అధికారుల తీరును చూస్తే నిజమే ననిపిస్తోంది. ఫీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో కమిషనర్, టీపీఎస్‌ల అవినీతికి కేరాఫ్ అడ్రగా మారారని ప్రజల నుండి విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధనలు ఇప్పుడు వీరికి మరింత కాసుల పంట పండిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న నిర్మాణదారుడికి ఆన్ లైన్లో అనుమతులు మంజూరు చేయాలి. అయితే నిర్మాణదారుడు అక్రమ నిర్మాణం చేపడితే వీరి పర్యవేక్షణలోనే న్యాక్ బృందం పని చేయడం గమనార్హం. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఇబ్బంది రావద్దనే దూరదృష్టితో అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి మమా అనిపిస్తారు. చర్యలు ఏవి..? అని ప్రశ్నిస్తే మాత్రం నోటీసులు ఇచ్చాం. టాస్క్ ఫోర్స్ కు తెలియజేశాం. ఇక మా చేతులో ఏమీ లేదు అంటూ తప్పించుకుంటారు. దీంతో వీరు మరింత రెచ్చిపోయి అక్రమ నిర్మాణాల కొరకు ఎవరు అడిగినా పర్మిషన్ ఉంది. జి ప్లస్ టు పర్మిషన్ ఉంది..షెడ్లు, పెంట్ హౌస్ వేసుకుంటే ఏమవుతుంది చూద్దాం. చేద్దాం..? సర్దిచెప్పే పంపిస్తారు. అవినీతి ఎవరు చేసి ఉపేక్షించేది లేదని స్వయానాకలెక్టర్ పదేపదే చెబుతున్నప్పటికీ ఫీర్జాదిగూ టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రం ఇవేవీ పట్టనట్టుగా వ్యవహరించడం పట్లపలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కులకు మధ్యవర్థిత్వం వహిస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

అక్రమ నిర్మాణదారులకు అండగా ప్రజల కళ్ల ఎదుటే అనుమతి లేని షెడ్లు, భవనాలు అంతస్తులకు ఎదో పర్మీషన్ ఉంది కదా. కార్పోరేషన్ లో అందే ఫిర్యాదుల్లో 90 శాతం ఈ విభాగానివే. ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు సామాజిక కార్యకర్తలు వదలకుండా వెంటపడి, విస్తృతంగా ప్రచారం చేస్తేనే తప్ప అక్రమ నిర్మాణాలను కూల్చడం లేరు. ఫిర్యాదులకు స్పందనగా తూతూ మంత్రంగా కేవలం చిన్నపాటి రంధ్రాలు చేసి, అక్రమ నిర్మాణాలకు దన్నుగా నిలవడం సంప్రదాయంగా మారింది. ఆన్‌లైన్‌లోనే అనుమతులైనా, నోటీసులు ఆన్‌లైన్ ద్వారానే జారీ అయినా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఎక్కడ జరగాల్సిన తతంగం అక్కడ గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు ఫీర్జాదిగూడ 1వ డివిజన్ మేడిపల్లి నుండి చెంగిచర్ల వెళ్లే ప్రధాన రహదారిలో తులిప్స్ హోటల్ పైన అనుమతుల కు విరుద్ధంగా భారీ షెడ్డుతో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అటువైపు కన్నేత్తి చూడని అధికారులు 5వ డివిజన్ పర్వతాపూర్ రోడ్డులో శభరి గార్డెన్ ఎదురుగా 600గజాలలో భారీ షెడ్డు నిర్మాణం మొదలైన వెంటనే ఫిర్యాదు చేస్తే ముడుపులు అందుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అడ్డుగా పరదలు కట్టించి నిర్మాణం జరుగుతాలేదని బూకాయించి, నిర్మాణాన్ని శర వేగంగా జరిపిస్తూ ప్రశ్నించిన వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్

ప్రజాపక్షం/నవాబుపేట్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ నవాబ్ పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను, పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది రోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్ లోని మందులను, లాబరేటరీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్ లను, వ్యాక్సిన్ నిల్వ ఉంచు ఐఎల్ఆర్, డీఫ్ ఫ్రీజ్ లను తనిఖీ చేశారు. వీటి నిర్వహణ పట్ల వైద్యాధికారి, సిబ్బందికి తగు సూచనలు చేయడం జరిగింది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశా డే మీటింగ్లో పాల్గొని ఆశలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రజలకు అంటు వ్యాధుల గురించి, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని ఆదేవిదంగా గర్భవతులకు అన్ని రకాల పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాని, జిల్లా ఆసుపత్రిలో గాని చేయించాలని సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆదేశించారు. అదేవిధంగా హాస్పిటల్ భవనం వర్షం నీరుతో కురుస్తున్న సందర్భంగా కొత్త నిర్మాణ భవనానికి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రోహిత్, సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది

ప్రజాపక్షం/మోమిన్‌పేట్ : వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండలంలో శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ జిలాల్ల కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డిఓ వాసుచంద్ర తో కలిసి భారీ వర్షాంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. కాసులాబాద్ చెరువు వాగుపై బ్రిడ్జిని, మల్‌రెడ్డి గూడలో కులిని ఇల్లును పరిశీలించారు. నామనాద్‌గుడ్‌పల్లిలో నిటిలో మునిగిన రైల్వ అండర్ బ్రిడ్జి పొలాలకు వెళ్లే రోడ్డును, వెలిచాల్ గ్రామంలో కూలిన ఇంటిని పరిశీలించి మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో ఎక్కడ కుడా ప్రాణ అస్తి నష్టం జరుగలేదని అన్నారు. కూలి పోయిన ఇండ్లకు 3200లు అందిస్తామని తెలిపారు. వికారాబాద్ జిల్లాలోకూడా నష్ట పోయిన రైతులను అదుకోవడం జరుగుతుందని అన్నారు. స్థానిక నాయకులు శంకర్ యదవ్ , సుభాష్ , మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనకు సఫిల్‌గూడ చెరువును సిద్ధం చేయాలి

గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి

ప్రజాపక్షం/మల్కాజిగిరి: గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలు, నిర్వాహకులతో సమన్వయంతో పని చేస్తూ సఫిల్‌గూడ చెరువును సిద్ధం చేయాలని గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మేయర్ మల్కాజిగిరి నియోజకవర్గంలోని సఫిల్‌గూడ చెరువు, బేబీ పాండ్‌ను పరిశీలించారు. శానిటేషన్ పరిస్థితి, రోడ్ల స్థితి గతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సఫిల్‌గూడ చెరువులో 3 నుంచి 4 వేల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తారన్నారు. సెప్టెంబరు 7 నుండి 17 వరకు గణేష్ ఉత్సవాలతో పాటు నిమజ్జన ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా ప్రశాంతంగా ముగిసేలా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, క్షేత్ర స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షన చేయాలని మేయర్ సూచించారు. డార్క్ స్పాట్స్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా లైటింగ్, పోలీసు బందోబస్తు, రాత్రి సమయాల్లో భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు కొనసాగే రహదారుల్లో గుంతలు పూడ్చాలని, మురికి నీరు పారకుండా చూడాలని, చెట్ల కొమ్మలను కత్తిరించాలని, చెరువు వద్ద బోట్‌లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూడాలని మేయర్ సూచించారు. భక్తులు, సందర్శకులకు తాగు నీరు, వైద్య సదుపాయాలు, అంబులెన్స్, మొబైల్ టాయిలెట్లు, రేయింబవళ్లు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రాజు, శానిటేషన్, లేక్స్, ఎంటమాలజీ, వైద్య ఆరోగ్య శాఖ, ఇంజనీరింగ్, నేరేడ్‌మెట్ ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదల ఓర్వలేకే నాపై విమర్శలు : నరేందర్ రాజు

ప్రజాపక్షం/దుండిగల్ :రాజకీయంగా ఎదుగుదలను ఓర్వలేక కొందరు నాపై నిందలు మోపుతున్నారని పిఏసిఎస్ చైర్మన్ గరిసే నరేందర్ రాజు అన్నారు. విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో మారడంతో కొందరు సొసైటీ సభ్యులు గత అక్టోబర్ లో అవిస్వాస తీర్మానానికి తెరలేపారని, కుదరకపోవడంతో డిసిఓ కు ఫిర్యాదు చేశారని వివరాలు వెల్లడించారు. నిధుల అవకతవకలు విషయంలో ఆగస్టు లో ఎంక్వైరీ వేసింది వాస్తవమే అన్నారు. త్వరలో వివరణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అకౌంట్ నంబర్ 118 ద్వారా ఆయా ఖాతాల నుండి తీసుకున్న లోన్ మొత్తం చెల్లించానన్నాడు. రాజకీయ కక్ష సాధింపుతో నాపై అసత్య ఆరోపణలు సరికాదని 2019 లో బాధ్యతలు తీసుకున్న తరువాత 56 కోట్లు ఋణాలు ఇచ్చామని అందులో ఇప్పటికే 54 కోట్ల రుణాలు వసూల్ చేశామన్నారు. రాజకీయ నేపథ్యంలోనే అసత్య ఆరోపణలు నాపై చేస్తున్నారని రైతులు ప్రజలు నమ్మవద్దని అన్నారు.

విజృంభిస్తున్న అంటు వ్యాధులు

డెంగీ వ్యాధితో ఇద్దరి మృతి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: గత మూడు రోజులుగా జిల్లాలో విరామం లేకుండా కురిసిన వర్షాల కారణంగా డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యాలాంటి అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాలతో బాధ పడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. బస్తీ, పల్లె దవఖానలు, అర్బన్, పిహెచ్‌సి సెంటర్లతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వాహకులు జ్వరంతో వచ్చే రోగులకు సరిపడే విధంగా మందులు, అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపేందుకు కిట్లు కొరత లేకుండా సమకూర్చుకుని అప్రమత్తంగా ఉండాలన్న జిల్లా కలెక్టర్ గౌతం కలెక్టరేట్ కార్యాలయంలో మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖాధికారులతో సమీక్షలు, స్వయంగా కలెక్టర్ చేస్తున్న ఆస్పత్రుల తనిఖీల సందర్భంగా ఇస్తున్న ఆదేశాలు బేఖాతరవుతున్నాయి. జవహర్‌నగర్ భక్తభాయి వెంకటేశ్వర కాలనీకి చెందిన అంజలి(48) డెంగీ బారిన పడి దమ్మాయిగూడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ గత నెల 30న మృతి చెందింది. మేడ్చల్ మండలంలోని రావల్ కోల్‌లో మరో వ్యక్తి సైతం డెంగ్యూ బారిన పడి మృతి చెందాడు, మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 450కి పైగా కేసులు నమోదయ్యాయని అధికారులు పేర్కొంటున్నప్పటికీ అనధికారిక లెక్కల ప్రకారం అంత కంటె ఎక్కువగానే ఉంటున్నట్లు సమాచారం. గత వారం రోజులుగా జిల్లాలో విష జ్వరాలతో బాధ పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగి పోతూ ప్రభుత్వ,ప్రయివేటు ఆస్పత్రుల వెంట క్యూ కడుతున్నారు. జిల్లాలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేసి జ్వరాలతో బాధ పడుతున్న వారి వివరాలు సేకరించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇటీవలి కాలంగా 3,71,514 ఇళ్లకు వెళ్లి 13,37,450 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేయగా 9 వేల మంది జ్వరాలతో బాధ పడుతున్న విషయం తేలిందని వైద్య శాఖాధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు కృషి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: వికారాబాద్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నాత పాఠశాలలో మంత్ర శిక్షా లోకం భారత్ దేశ్, అలోకిత్ సంస్థలు పాల్గొని మండల రిసార్స్ పర్సన్‌లు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆంగ్లంలో మాట్లడే నైపూణ్యాలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాల భోదనతో పాటు ఆంగ్లంలో మాట్లాడే నైపూణ్యాలపై కూడా ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. విద్యార్థుల్లో మాతృభాషతో పాటు ఆంగ్లంలో మాట్లాడే నైపూణ్యంపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలని ఆయాన సూచించారు. భోదించే సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు పూర్తి పట్టు ఉన్నప్పుడే విద్యార్థుల్లోని నైపూణ్యాన్ని ప్రదర్శింపజేయాలని కలెక్టర్ తెలిపారు. ట్రైని కలెక్టర్ ఉమా హరతి తదితరులు పాల్గొన్నారు.

మామను పొడిచిన అల్లుడు

పజాపక్షం/నాగారం: మామను అల్లుడు కట్టర్‌తో పొడిచిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సిఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నాగారం రామలింగేశ్వర నగర్ కాలనీకి చెందిన అశోక్ తన అల్లుడైన పత్తి యాదగిరి(24) మద్యం సేవించి ఇంటికి వెళ్లి తనకు డబ్బులు ఇవ్వాలని గొడవపడి తనతో తీసుకువచ్చిన పదునైన కట్టర్‌తో సోమవారం రాత్రి మామపై దాడి చేసి కడుపులో పొడిచాడు.దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు యాదగిరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఆయన తెలిపారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేత

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: సిఆర్‌డబ్ల్యూడి రెయిన్బో టీం, హైదరాబాద్, హైరింగ్ మేనేజర్ జోన్న విలియమ్స్, టీం లీడర్ షేక్ అలీం సహకారంతో, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ మఖ్దుం నగర్ లోని ఎనభై అనాధ మరియు పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, టిఫిన్ బాక్స్, పెన్సిల్, ఎరేజర్, పెన్ అందజేశారు. సిఆర్‌డబ్ల్యూడి సంస్థ సామజిక సేవ బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సంస్థ టీం లీడర్ అలీం అన్నారు. హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ అనాధ మరియు పేద విద్యార్థుల కోసం ఇంతటి సహాయ కార్యక్రమం చేపట్టిన సంస్థ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సామజిక వేత్త మధుబాబు చికిలే, ఇన్నారెడ్డి, యూసఫ్ ఖాన్, షఫీ, అన్సారీ,పాషా, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాపక్షం/శామీర్‌పేట : వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, పేట్ బషీరాబాద్ ఇన్స్‌పెక్టర్ హర్షవర్ధన్‌లు అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్‌లోని దేవర యాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవాలకు కమిటి సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే నియమ నిబంధనల ప్రకారం ఉత్సవాలను జరుపుకోవాలని లేనిచో చర్యలు తీసుకోబడుతాయని చెప్పారు. వినాయకులను పెట్టడానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, డిజేలకు ఏలాంటి అనుమతులు లేవని చుట్టు పక్కల వారికి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను నిర్వహించాలని పేర్కొన్నారు. రోడ్లను బ్లాక్ చేయకూడదని కనీసం ద్విచక్ర వాహానాలు వెళ్లే విధంగా రోడ్డుకు దారి వదలాలని చెప్పారు. డిఈఈ సునీత, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్‌గౌడ్, పన్నాల వీరారెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ప్రతీ నెలా రూ.5000 ఇవ్వాలి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి

ప్రజాపక్షం/మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు ప్రతి నెలా రూ.5000 ఇవ్వాలని, వారికిచ్చే కమిషన్ పెంచాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి డిమాండ్ చేసారు. కొత్త రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం నోటిఫికేషణ్ విడుదల చేసిన సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరా గోదాములలో నిత్యావసర వస్తువులను సరైన తూకంతో డ్యామేజి లేకుండా ఇవ్వాలన్నారు. రేషన్ డీలర్లకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సదుపాయాలను వర్తింప చేయాలన్నారు. గత మూడు నెలల్లో రేషన్ తీసుకోని వారి రేషన్ కార్డులను అధికారులు తొలగించారని, తెల్ల కార్డులు లేని పక్షంలో ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొంద లేక పోతున్నారన్నారు. కుటుంబాల్లో వివాహమైన వారి పేర్లను తొలగించటం, కొత్త సభ్యుల పేర్లను చేకూర్చటం నిరంత ప్రక్రియగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి బాలరాజు, రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల సంతోష్ కుమార్, బాల్‌రెడ్డి, చక్రధర్, రమేష్ సింగ్, శివకుమార్, వెంకట హరి, కరుణానిధి, కార్పొరేటర్లు విజయ శాంతి, సునీతా యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీకి చెందిన హన్మంత రావు, దోలి రమేష్, రాము యాదవ్, మధుసుధన్, పరమేశ్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, భాగ్యానంద్‌రావు, వంశీ, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ సంచలనం..

పాకిస్థాన్‌పై సిరీస్ క్లీన్ స్వీప్

రావల్పిండి: టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ సంచలనం సృష్టించింది. నిరసనలు, అల్లర్లతో తమ దేశం అ ట్టుడుకుతున్న పరిస్థి తుల్లో.. స్ఫూర్తిమంతమైన ప్రదర్శ నతో అదరగొట్టింది. పాకిస్థాన్‌తో రెండు టె స్టుల సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. పాక్‌పై బంగ్లాదేశ్ టెస్టు సిరీస్ గెలవడం ఇ దే మొదటిసారి. రావల్పిండి వేదికగా జరిగిన రెం డో టెస్టులో బంగ్లాదేశ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 185 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్ నైట్ స్కోరు 42/0తో (రెండో ఇన్నింగ్స్) మంగళవారం, ఐదో రోజు ఆటను ప్రారంభించిన ఆ జట్టు 56 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ని అందుకుంది. ఓపెనర్లు జకీర్ హసన్ (40), షాద్మాన్ ఇస్లామ్ (24), నజ్ముల్ హొస్సేన్ శాంటో (38), మోమినుల్ హక్ (34), ముష్ఫికర్ రహీమ్ (22*), షకీబ్ అల్ హసన్ (21*) రాణించారు. పాక్ బౌలర్లలో మీర్ హంజా, షాజా ద్, అబ్రార్ అహ్మద్, ఆఘా సల్మాన్ తలో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 274 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 26 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో లిటన్ దాస్ (138), మెహదీ హసన్ మిరాజ్ (78) ఆదుకోవడంతో 262 రన్స్‌కు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా పేసర్లు హసన్ మహ్మద్ (5/43), నహీద్ రాణా (4/44) విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 172కే కుప్పకూలింది. సల్మాన్ ఆఘా (47 నాటౌట్), మహ్మద్ రిజ్వాన్ (43) పోరాడకపోతే పాక్ ఆ మాత్రం స్కోరు కూడా చేసేది కాదు.

విదేశీ గడ్డపై బంగ్లాదేశ్ టెస్టు సిరీస్ విజయాలు

2–0 (2) x వెస్టిండీస్ (2009)
1–0 (1) x జింబాబ్వే (2021)
2–0 (2) x పాకిస్థాన్ (2024)

లార్డ్స్ స్టేడియంలో డబ్ల్యుటిసి ఫైనల్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్2025 ఫైనల్‌కు షెడ్యూల్ ఖరారైంది. ఈ కీలకమైన పోరుకు ప్రతిష్ఠాత్మక లండన్ లార్డ్స్ మైదానం వేదిక కానుంది. ఈ ఫైనల్ ఫైట్ 2025 జూన్ 11 నుంచి 15 దాకా జరగనున్నట్లు ఐసిసి తాజాగా వెల్లడించింది. జూన్ 16ను రిజర్వ్ డే గా ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

రిజర్వ్ దే కూడా

'2025 జూన్ 11నుండి, 15 వ తేదీ వరకు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ జరగనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ఫైనల్‌కు లార్డ్స్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది. అవసరం అయితే జూన్ 16 రిజర్వ్ డేగా అందుబాటులో ఉంటుంది' అని ఐసీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ లార్డ్స్ వేదికగా జరగడం ఇదే తొలిసారి. సౌతాంప్టన్ వేదికగా తొలి డబ్ల్యూటీసీ ఫైనల్ (2021) జరిగింది. అందులో న్యూజిలాండ్ విజేతగా నిలిచింది. ఇక 2023 డబ్ల్యూటీసీ ఫైనల్ ఓవల్ వేదికగా జరిగింది. ఈ ఫైనల్‌లో ఆస్ట్రేలియా గెలుపొందింది. అయితే ఈ రెండు ఎడిషన్స్‌లో ఫైనల్స్‌కు చేరిన భారత్ ఛాంపియన్‌గా నిలువలేకపోయింది. దీంతో ఈ సారైనా ఫైనల్ చేరి డబ్ల్యూటీసీ గద దక్కించుకోవాలని రోహిత్ సేన ఉత్సాహంగా ఉంది.

పాయింట్ల పట్టికలో టాప్‌లో భారత్

2023 ఐసిసి వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ విజేత ఆస్ట్రేలియా కంటే పాయింట్ల పట్టికలో భారత్ ముందంజలో ఉంది. 9 మ్యాచ్‌ల్లో ఆరు గెలిచి భారత్ 68.51 విన్నింగ్ పర్సంట్‌తో తొలి స్థానంలో నిలిచింది. 12 మ్యాచ్‌ల్లో ఎనిమిది గెలుపొంది, ఆసీస్ 62.50 విన్నింగ్ పర్సంటేజ్ నమోదు చేసి రెండో స్థానంలో కొనసాగుతోంది. అలాగే న్యూజిలాండ్ ఆరు మ్యాచుల్లో మూడు గెలిచి, మూడు ఓడిపోయింది. 50 శాతం పాయింట్ పర్సెంటేజీతో నిలిచింది. నాలుగో స్థానంలో బంగ్లాదేశ్, ఐదో ప్లేస్ లో ఇంగ్లాండ నిలిచింది. చివరి నాలుగు స్థానాల్లో దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్, వెస్టిండీస్ జట్లు నిలిచాయి. 'ఐసిసి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ క్రికెట్ క్యాలెండర్‌లో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈవెంట్‌లలో ఒకటిగా మారింది. 2025 ఎడిషన్ కోసం తేదీలను ప్రకటించినందుకు మేము సంతోషిస్తున్నాము. ఇది ప్రపంచ క్రికెట్ అభిమానులకు ఆనందాన్నిచ్చే విషయం. ఐటిసి ఫైనల్ మ్యాచ్ టికెట్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. కాబట్టి అభిమానులు ఇప్పుడే వారి ఆసక్తిని నమోదు చేసుకోమని కోరుతున్నాను' అని ఐసిసి సిఇఒ అల్లర్డిస్ తెలిపారు

10 వేల పరుగులు చేయకపోతే సిగ్గుపడాలి

కోహ్లి-హర్భజన్ సంభాషణ

ప్రస్తుతం ప్రపంచంలో మేటి బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న విరాట్ కోహ్లి కెరీర్ ఆరంభంలో కాస్త ఇబ్బందిపడ్డాడు. క్రమక్రమంగా తన నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ, సీనియర్లు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తూ స్టార్ బ్యాటర్‌గా ఎదిగాడు. కెరీర్ మొదట్లో కోహ్లితో జరిపిన సంభాషణను టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తాజాగా పంచుకున్నాడు. 'నాకు ఒక సంఘటన గుర్తుంది. అది శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్. అజంతా మెండిస్ వరుసగా వికెట్లు తీస్తు న్నాడు. అప్పుడు క్రీజులోకి వచ్చిన కోహ్లి స్వేచ్ఛగా ఆడి అర్ధశతకం చేశా డు. అతను నన్ను 'పాజీ (అన్న) నేను ఎలా ఆడాను?' అని అడగ్గా 'బాగా ఆడావు' అని చెప్పా. పాజీ నేను ఔట్ కాకుండా మరిన్ని పరుగులు చేయా ల్సింది అన్నాడు. అతడి యాటిట్యూడ్ నాకు నచ్చింది. కోహ్లి టెస్ట్ క్రికెట్ విషయానికొస్తే.. ఈ ఫార్మాట్‌లో అతని అరంగేట్రం వెస్టిండీస్‌పై జరి గింది. విండీస్ పేసర్ ఫిడెల్ ఎడ్వర్డ్స్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ షార్ట్ బాల్ తో కోహ్లిని బోల్తా కొట్టించాడు. దీంతో అతడు తీవ్ర నిరాశకు గురయ్యా డు. సరిగ్గా బ్యాటింగ్ చేయలేనా?అనే అనుమానాలు పెంచుకున్నాడు. అ ప్పుడు నేను కోహ్లితో' టెస్ట్ క్రికెట్‌లో 10,000 పరుగులు చేయకపోతే ను వ్వు సిగ్గుపడాలి. నీకు టెస్టుల్లో 10 వేల రన్స్ చేయగలిగే సత్తా ఉంది. ను వ్వు దీన్ని పూర్తి చేయకపోతే అది తప్పే అవుతుంది' అని కోహ్లితో చెప్పా నని హర్భజన్ సింగ్ గుర్తు చేసుకున్నాడు. ధోనీ, రోహిత్‌శర్మ కెప్టెన్సీ మధ్య తేడాలను కూడా భజ్జీ వివరించాడు. హర్భజన్ వీరిద్దరి నాయకత్వంలో ఆడిన సంగతి తెలిసిందే. 'ధోనీ ఎప్పుడూ ఆటగాళ్ల దగ్గరకు వెళ్లి ఇలా ఆ డు, అలా బౌలింగ్ చేయ్ అని చెప్పడు. తప్పుల నుంచి వారే స్వయంగా నే ర్చుకునేలా చూస్తాడు. ఈ విషయంలో రోహిత్ శైలి భిన్నంగా ఉంటుంది. రోహిత్ ప్రతీ ఆటగాడి భుజంపై చేయి వేసి మాట్లాడతాడు. నువ్వు ఇది చేయగలవ్ అనే నమ్మకాన్ని ఇచ్చి ప్రోత్సహిస్తాడు' అని హర్భజన్ వివరించాడు.

రీల్

'దేవర' సాంగ్ రికార్డు?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం దేవర కోసం అందరికీ తెలిసిందే. మరి ఇప్పుడు మాస్ లో విపరీతమైన హైప్ ని సెట్ చేసుకుంటున్న ఈ సినిమా నుంచి ఒకో పాట మరింత హైప్ ఎక్కిస్తుంది. లేటెస్ట్ గా అనౌన్స్ చేసిన మూడో సాంగ్ పై అయితే మొదట వచ్చిన రెండు పాటల కంటే ఎక్కువ హైప్ నమోదు కాగా ఇప్పుడు దేవర సెక్‌ండ సింగిల్ చుట్టమల్లే నమోదు చేసిన భారీ రికార్డు కోసం వైరల్ అవుతుంది. ఈ సాంగ్ లేటెస్ట్ గా మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ స్పాటిఫైలో ఏ తెలుగు సినిమా సాంగ్ అందుకొని రికార్డు రెస్పాన్స్ అందుకుందట. ఈ సాంగ్ ఒక్క రోజులోనే 1 మిలియన్ కి పైగా స్ట్రీమ్స్ ని స్పాటిఫై లో అందుకొని నెవర్ బిఫోర్ రికార్డు సెట్ చేసింది. దీనితో ఈ సాంగ్ కి ఎలాంటి క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించగా ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆరట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

'స్పిరిట్' స్క్రిప్ట్ పై కొత్త అప్ డేట్

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనే సినిమా చేయబోతున్నాడు. ఐతే, ఈ క్రేజీ సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది ?, ఎప్పుడు రిలీజ్ అవుతుంది ? అంటూ ప్రభాస్ ఫ్యాన్స్ తెగ ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం సందీప్ రెడ్డి ఈ సినిమా స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్ర కథలో ప్రభాస్ పాత్ర వైల్డ్ ఎలిమెంట్స్ తో బోల్డ్ గా సాగుతుందని, పైగా ప్రభాస్ డ్యూయెల్ రోల్ లో కనిపించబోతున్నాడని టాక్. పైగా ఇప్పటికే, ఈ సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ మాఫియా డాన్ గా కనిపిస్తాడని, ముఖ్యంగా ప్రభాస్ పాత్రలోని డెప్త్ కూడా నెవ్వర్ బిఫోర్ అనే రేంజ్ లో ఉంటుందని వార్తలు వచ్చాయి. అన్నట్టు ప్రభాస్ నుంచి ప్రేక్షకులు ఏదైతే బలంగా కోరుకుంటున్నారో అదే ఈ సినిమాలో ఉంటుందట. దాదాపు రూ.400 కోట్లకు పైగా బడ్జెట్ తో ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్ సినిమా పూర్తి చేసే పనిలో ఉన్నాడు.

విజయ్ లుక్‌పై నెగెటివ్ కామెంట్స్

తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ది గోట్' సెప్టెంబర్ 5న గ్రాండ రిలీజ్‌కి రెడీ అయ్యింది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ చిత్రాన్ని స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కించాడు. ఇప్పటికే ఈ చిత్ర టీజర్, ట్రైలర్లకు మంచి రెస్పాన్స్ వచ్చాయి. ఇక ఈ సినిమాను తెలుగులోనూ భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమాకు సంబంధించి హైదరాబాద్‌లో తాజాగా ఈవెంట్ నిర్వహించారు చిత్ర యూనిట్. ఈ క్రమంలో జరిగిన మీడియా మీట్‌లో ఓ విలేకరి గోట్ మూవీలో విజయ్ డీఏజింగ్ లుక్‌పై ప్రశ్నించారు. దీంతో దర్శకుడు వెంకట్ ప్రభు సమాధానమిస్తూ.. సినిమాలో విజయ్ వయసు తక్కువగా చూపెట్టేందుకు డీఏజింగ్ టెక్నాలజీ వాడామని.. అయితే, స్పార్క్ పాటలో అది మరీ తక్కువగా కనిపించడంతో ఆ లుక్‌పై నెగెటివ్ కామెంట్స్ వచ్చాయని అన్నారు. అటు విజయ్ కూడా తన లుక్‌ను మరీ యంగ్‌గా చూపెట్టొద్దు అని చెప్పడంతో, యంగ్ లుక్‌కి సంబంధించి మళ్లీ టెక్నాలజీని ఎంతవరకు వాడాలో అంతే వాడి దానిని సరిచేశామని దర్శకుడు చెప్పుకొచ్చాడు. ఇలా విజయ్ యంగ్ లుక్‌పై నెగెటివ్ కామెంట్స్ రావడంతో డీఏజింగ్ టెక్నాలజీని మళ్లీ సరిచేసుకున్నామని డైరెక్టర్ చెప్పడంతో విజయ్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర కొత్త రికార్డులు క్రియేట్ కావడం ఖాయమని చిత్ర యూనిట్ ఆశిస్తుంది.

అంతరాష్ట్ర రాకపోకలకు అంతరాయం

ప్రజాపక్షం/వాజేడు: గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు శ్రీరాం సాగర్, కడెం, సమ్మక్క సారక్క, తుపాకులగూడెం బ్యారేజీల గేట్లు పూర్తిగా ఎత్తి వేసి దిగువ ప్రాంతానికి వరద నీరు విడుదల చేయడం వలన దీనితో గోదావరి ఉదృతంగా పెరుగుతుంది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు వద్ద 15 మీటర్లకు చేరుకుంది. దీనితో వద్ద 163వ జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో తెలంగాణ, ఛత్తీస్‌గడ్ అంతరాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై పేరూరు ఎస్ఐ కృష్ణ ప్రసాద్ భారీ గేట్లు ఏర్పాటుచేసి అటు వైపు ఎవరు దాటకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

పక్కా సమాచారంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 9 మందిని మావోయిస్టుల మృత దేహాలను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. అదే విధంగా ఆయుధాలు, మందుగుండుపేలుడు సామాగ్రి, జిలిటెన్ స్టిక్స్ స్వాదీనం చేసుకున్నారు. తప్పించుకుని పారిపోయిన మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు 154 మంది మావోయిస్టులను పోలీసులు మట్టుపెట్టారు.

13 మంది మావోయిస్టులు అరెస్టు

బీజాపూర్ జిల్లాలోని రెండు ప్రాంతాల్లో మ౦త్తం 13 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఎడుగురుని గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో, మరో ఆరుగురుని టెర్రాం పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో 202 బెటాలియన్ టీం ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. అరెస్టయిన వారిలో 25 ఏళ్ల నుండి 55 ఏళ్ల మధ్య వయస్సు గల వారని తెలిపారు. పట్టుబడిన వారి నుండి డిటోనేటర్లు, ఎలక్ట్రిక్ వైర్, ఇనుప చువ్వలు, బాణాలు, బ్యాటరీలు, మావోయిస్టు కరపత్రాలు స్వాదీనం చేసుకున్నారు. ఈ అరెస్టులతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మొత్తం 600 మందికి పైగా నక్సలైట్లను అరెస్టు చేశారు.

జీవితాంతం జైలులోనే!

(మొదటి పేజీ తరువాయి)

అపరాజిత టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేస్తాం' అని మమత తెలిపారు. 'అత్యాచారం వంటి చర్యలు మానవాళికి ఒక శాపాలు. అలాంటి ఘోరాలు జరగకుండా సామాజిక సంస్కరణలు రావాలి. యుపి, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అసాధారణ స్థాయిలో నేరాలు జరుగుతున్నాయి. ఉన్నావ్, హాథ్రస్ కేసుల్లో న్యాయం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ బెంగాల్‌లో మహిళలకు కోర్టుల్లో న్యాయం లభిస్తుంది. మీలా నేనూ ప్రధాని, హోంమంత్రిపై నినాదాలు చేస్తే ఎలా ఉంటుంది? మహిళ రక్షణ కోసం సమర్థమైన చట్టాలు తీసుకురాలేని ముఖ్యమంత్రులు రాజీనామా చేయాలి' అని మమత డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో సిబిఐ నుంచి న్యాయం కోరుతున్నామని మమత తెలిపారు. దోషులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అయితే హత్యాచార ఘటనపై మమత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్న విపక్షాలు, అపరాజిత ఉమెన్ అండ్ చైల్డ్ బిల్లుకు మద్దతు పలికాయి. బిజెపి శాసనసభాపక్ష నేత సువేందు అధికారి బిల్లుకు పలు సవరణలు సూచించగా అవి తిరస్కరణకు గురయ్యాయి.

పెరుగుతున్న 'గోదావరి'

ప్రజాపక్షం/భద్రాచలం : గోదావరి మళ్లీ పెరుగుతుండటంతో వరద ముప్పు పొంచి ఉంది. ఎగువ నుండి నీరు దిగువకు విడుదల కావడంతో గోదావరి వేగంగా పెరుగుతోంది. మంగళవారం కడపటి వార్తలు అందే సమయానికి భద్రాచలం వద్ద 40 అడుగు నీటి మట్టం నమోదైంది. ఇది క్రమేపీ పెరుగుతూ 50 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరో ప్రక్క ఐదవ తేది నుండి మరో కొన్ని రోజుల పాటు తుపాను హెచ్చరిక ఉండటంతో తీర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధానంగా జూలై, ఆగస్టు మాసాల్లో గోదావరికి పెద్ద ఎత్తున వరదలు వస్తుంటాయి. భారీ వర్షాలు పడటంతో ఎగువన ఉన్న ప్రాజెక్టులు నిండటంతో క్రిం దికి నీటిని విడుదల చేస్తుంటారు. గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులే కాకుండా తాలిపేరు ప్రాజెక్టు నీరు కూడా పెద్ద ఎత్తున గోదావరి నదిలో కలుస్తుంది. దీంతో భద్రాచలం పరివాహన ప్రాంతం పెద్ద ఎత్తున వరదల భారిన పడుతుంటుంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా అనేక మంది ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. గడిచిన రెండు మాసాల్లో గోదావరి నది ఉగ్రరూపం దాల్చడంతో పరివాహక ప్రాంతం అతలాకుతలమైంది. జూన్, జూలై, ఆగస్టు , సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో మొదటి ప్రమాదహెచ్చరికను దాటి గోదావరి నది అనేక సార్లు ప్రవహించింది. ఎగువన భారీగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పాటు తాలిపేరు సామర్థ్యానికి మించి వర్షపు నీరు చేరడంతో గేట్లు ఎత్తిన అధికారులు నీటిని గోదావరిలోనికి విడుదల చేస్తున్నారు. గడిచిన 72 గం.లలో మహారాష్ట్రాలోని నాందేడ్, లాతూర్,బీదర్, ఉస్మానాబాద్, పర్బాని, తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జిగిత్యాల జిల్లాల్లో భారీ నుండి అతి భారం వర్షం కురిసింది. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ప్రవహిస్తోంది. ప్రాజెక్టుకు చెందిన 40 గేట్లను ఎత్తిన అధికారులు 1 లక్ష 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో దాదాపు సమానంగానే ఉంది. ప్రాణహిత, ఇం ద్రావతి ఉపనదులు సైతం పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. ఛత్తీస్‌ఘడ్‌లో ఎడతెరిపిలేని వానలు పడుతుండటంతో తెలంగాణలోని చర్లలో గల తాలిపేరు ప్రాజెక్టు నిండుతోంది. దీంతో అధికారులు 22 గేట్లు ఎత్తి రెండు రోడులుగా 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టుల్లో నుండి నీరు దిగువకు విడుదల చేయడం, ఉపనదులు, వాగులు,వంకలు పొంగిపొర్లి గోదావరిలో కలుస్తుండటంతో వరద పెరిగే అవకాశం ఉంది.

'కిన్నెరసాని' అధికారుల నిర్లక్ష్యం వల్లే

(మొదటి పేజీ తరువాయి)

అనేక ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కూడా అధికారులతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని హమాలీ కాలనీ, ఇందిరానగర్, తదితర లోతట్టు ప్రాంతాలు, మండల పరిధిలోని బసవతారక కాలనీ, సోములగూడెం, రంగాపురం, నాగారం కాలనీ, నాగారం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అధికార యంత్రాంగం అంతా తక్షణమే నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందించాలని ఆదేశించారు. రోడ్లు, విద్యుత్ లైన్లు తక్షణమే పునరుద్ధరించాలని అన్నారు. ముందస్తు సమాచారం అందించినప్పటికీ సందర్శనకు గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ముంపు ప రిస్థితులను గుణపాఠంగా తీసుకుని రాబోయే రోజుల్లో ఇలాంటి నష్టం వాటిల్లకుండా, ప్రజలు ఇబ్బందుల పాలు కాకుండా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని, ఇళ్లు దెబ్బతిన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తామని, ఇసుక మేటలు వేసిన రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఈ పర్యటనలో ఆయన వెంట వివిధ శాఖల అధికారులతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా,రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, ఉప్పుశెట్టి రాహుల్, నాగరాజు, సుధాకర్, గంగాధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న, గిరి, రహిమాన్, శ్రీను, విజయ్, హరి, మోహన్ రావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల రేట్లు పెంపుపై వారంలో నిర్ణయం : బాల్‌రాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ కార్మికుల జెఎసి ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు నాయకుల ప్రతినిధివర్గంతో నేడు సివిల్ సప్లయిస్ కమీషనర్ చౌహాన్‌తో చర్చలు జరిపి సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల హమాలీ రేట్ల పెంపుకు కమీషనర్ సానుకూలంగా స్పందిస్తూ వారం రోజుల గడువు కోరారని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్రాజ్ తెలిపారు. తెలంగాణాలోని 182 మండల పాయింట్లు, గిరిజన కార్పొరేషన్ గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఒకే విధమైన హమాలీ రేట్లు, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాలు కోరగా కమీషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ కార్మికులకు ఇయస్ఐ సౌకర్యం కల్పించాలని చట్టాలు నిర్దేశిస్తున్నా హమాలీ కార్మికులకు ఇయస్ఐ సౌకర్యం కల్పించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించగా కమీషనర్ గారు తక్షణమే చర్యలు తీసుకొని ఇయస్ఐ లేదా ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దసరాకు హమాలీ కార్మికులకు ఇస్తున్న బోనస్‌ను రూ.10వేలకు పెంచాలని, స్వీటుకు రూ.1200 చెల్లించాలని, పండుగ సందర్భంగా యూనిఫాం కుట్టుకూలికి రూ.2వేలు పెంచాలని కోరిన కార్మిక సంఘాల డిమాండ్ను సానుకూలంగా స్పందిస్తూ హమాలీ కార్మిక సంఘాలకు హామీ ఇస్తూ తప్పనిసరిగా పెరుగుదల ఉంటుందని ఆయన తెలిపారని తెలిపారు. హమాలీ కార్మికుల పనిని మండల పాయింట్ల ద్వారానే కొనసాగిస్తామని కార్మికులు ఆందోళన చెందరాదని కమీషనర్ తెలిపారు. మండల పాయింట్లు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి తప్పనిసరి పరిస్థితిలో మార్చాల్సివస్తే ఆ గోడౌన్లో పనిచేసే హమాలీలతోనే పనిచేయించాలని హమాలీ కార్మిక సంఘాలు కమీషనర్ను కోరగా సానుకూలంగా స్పందిస్తూ హమాలీ కార్మికులే పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గతంలో ప్రతి మండల పాయింటులో ఒక అధికారిని నియమించి హమాలీ ఇతర కార్మికుల ప్రావిడెంట్ ఫండ్, హమాలీ రేట్లు ఇతర సమస్యల పరిష్కారం కోసం నియమించిన ఉద్యోగులను తొలగించటం వల్ల గోడౌన్లలో అనేక ఇబ్బందులు జరుగుతున్నాయని వెంటనే పునర్నియామకం చేసి మండల పాయింట్లు హమాలీ ఇతర కార్మికులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరగా సానుకూలంగా స్పందిస్తూ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సివిల్ సప్లయ్ కమీషనర్ చౌహాన్ తదుపరి చర్చలు ఈ నెల 10వ తారీఖున ఉంటాయని ఆ రోజు అన్ని సమస్యలను సానుకూలంగా పరిష్కరించి హమాలీ కార్మికులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్రాజ్ తెలిపారు. ఏ కారణం చేతనైనా చర్చలు వాయిదా పడినా, సమస్యలను పరిష్కరించటంలో కాలయాపన చేసినా హమాలీ కార్మిక సంఘాలు సెప్టెంబర్ 15 నుండి సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కడారి సునీల్, కడారి తిరుపతి, సిఐటియు నుండి పాలడుగు సుధాకర్, వంగూరు రాములు, ఐఎఫ్టియు నుండి కె.సూర్యం, టిఆర్‌ఎస్కెవి నుండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశోధనలను ప్రోత్సహించాలి

(మొదటి పేజీ తరువాయి)

అని రాష్ట్రపతి చెప్పారు. ప్రభుత్వ పథకాలైన స్టార్టప్ఇండియా, స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా లక్ష్యాలను యువతరం సాధించగలగాలన్న ఆకాంక్షను ఆమె వ్యక్తంచేశారు. సింబసిస్ యూనివర్సిటీవిద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు, ప్రొఫెసర్లు విద్యరంగంలో పరిశోధనలను ప్రోత్సహించాలని రాష్ట్రపతి ముర్ము కోరారు. సింబయాసిస్ యూనివర్సిటీలో వాటర్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ సహా వాతావరణ మార్పు, నానోసైన్స్, స్టెమ్‌సెల్ తరహా బహుళ క్రమశిక్షణాయుత పరిశోధనా కేంద్రాలు అనేక ప్రాంతాలలో పనిచేస్తున్నాయని ఆమె ఈ సందర్భంగా ఉదాహరించారు. ప్రతీ టాస్క్‌లో అత్యుత్తమ ప్రతిభా సామర్థ్యాలను కనబర్చేందుకు ప్రయత్నించాలని రాష్ట్రపతి విద్యార్థులను కోరారు. సక్సెస్‌కు నిజమైన అర్థాన్ని విద్యార్థులు అవగతం చేసుకుని ఇతరుల జీవన ప్రమాణాన్ని పెంపొందించే పనులను చేపట్టాలన్నారు. విద్యార్థులు తమ తెలివి, వ్యక్తిత్వ వికాసంతో దేశంలోనే కాదు విదేశాల్లోనూ సానుకూల ఫలితాలను సాధించగలరన్న ధీమా వ్యక్తంచేశారు. భారతదేశంలోని వివిధ సామాజికవర్గాలు, మతాల సంస్కృతిని అర్థంచేసుకుని వారి అవసరాలను తీర్చగలగాలని విద్యార్థులను కోరారు. యాజమాన్యనిర్వహణ, ఆరోగ్య సంరక్షణ, లా, సోషల్ సైన్సెస్, ఇతర రంగాలలో నవకల్పనలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, యాంత్రిక అభ్యాసాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించగలుగుతారన్న విశ్వాసాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యక్తంచేశారు. స్త్రీశక్తి పురోగతి పౌరులకు గర్వకారణంగానే కాకుండా దేశాభివృద్ధిలో ముఖ్యమైన చోదకశక్తి కాగలదన్నారు. ప్రతీ విద్యాసంస్థలో కూడా మహిళా విద్యార్థులను ప్రోత్సహించాలని, వారు ఉన్నత విద్యను దక్కించుకునేందుకు వారికి భద్రత, సురక్షిత వాతావరణం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అధునాతన సాంకేతికపరిజ్ఞానం, ప్రజ్ఞతో కూడిన విలువ ఆధారిత విద్యను యువతరానికి అందించే లక్ష్యంతో అన్ని విద్యా సంస్థలు ముందడుగు వేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com